www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 22-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 205

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి రా. 1.29 తదుపరి సప్తమి; నక్షత్రం: ఆర్ద్ర తె. 5.39 తదుపరి పునర్వసు; వర్జ్యం: మ. 2.10-3.46; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.18, రా. 9.50-10.39, అమృతఘడియలు: రా. 7.44-9.19; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.13; సూర్యాస్తమయం: 5.45

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్ మీడియాపై కేంద్ర సమాచార శాఖకు
'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఫిర్యాదు

'సాక్షి' చానల్‌కు కేంద్ర హోం శాఖ నుంచి సెక్యూరిటీ

క్లియరెన్స్ లేదన్న విషయమూ ఫిర్యాదులో ప్రస్తావన

శాటిలైట్ ఫ్రీక్వెన్సీ హ్యాకింగ్‌పైనా విజయవాడలో కేసు

ABN ఆంధ్రజ్యోతి

14

మూసీ ప్రాజెక్టు రెండు దశల్లో!

తొలి దశలో నదీ ప్రవాహ ప్రాంతం, అటూ ఇటు కట్ట

రెండో దశలో ఇరువైపులా 50 మీటర్ల బఫర్ జోన్.. రోడ్లు

డీపీఆర్ మాత్రం మొత్తానికే.. ప్రాజెక్టు పూర్తికి ఆరేళ్లు

నదీ గర్భంలో 1600 ఇళ్లు, బఫర్‌జోన్‌లో 13వేల ఇళ్లు

బాధిత కుటుంబాలకు పరిహారం, డబుల్ ఇళ్లు, స్థలం

రింగ్‌రోడ్డుకు దగ్గర్లో 150-200 గజాలు

సియోల్ పర్యటన, పరిశీలనతో సరికొత్త ఆలోచన

(సియోల్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)

మూసీ నది ప్రక్షాళన, పునరుజ్జీవ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం రెండు దశల్లో ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ఆలోచనతో ఉంది. మొదటి దశలో మూసీ ప్రవహిస్తున్న ప్రాంతాన్ని మాత్రమే అభివృద్ధి చేస్తారు. అంటే దీని పరిధిలో ప్రస్తుతం నదీగర్భం.. మూసీకి అటూ ఇటూ ఉన్న ప్రాంతం (కట్టలు) మాత్రమే వస్తాయి. రెండో దశలో మూసీ నదికి అటూ ఇటూ 50 మీటర్ల పరిధిలోని బఫర్‌జోన్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారు. అయితే డీపీఆర్‌ను మాత్రం ఒకే ప్రాజెక్టు కింద రూపొందిస్తారు. పనులు నిరంతరాయంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగేందుకే ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తిచేయాలని సర్కారు

మిగతా 13వ పేజీలో...

చంగ్ ఏ చంగ్ కళతో సియోల్‌కే అందం!


చంగ్ ఏ చంగ్ నదిని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి తదితరులు

పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా రవాణా కోసం ఫ్లైఓవర్

ఆపై నది పునరుద్ధరణ.. చెత్త నుంచి విద్యుదుత్పత్తి

చంగ్ ఏ చంగ్-మూసీకి ఎన్నో భిన్నత్వాలు

హైదరాబాద్‌లో మూసీ 55 కి.మీ. మేర ప్రవాహం

చంగ్ ఏ చంగ్ సియోల్‌లో 11 కిలోమీటర్ల మేరే

వెడల్పు 30 మీటర్లు... కొన్నిచోట్ల అంతకన్నా తక్కువే

అభివృద్ధి చేయడంతో పర్యాటక ప్రాంతంగా మారిన వైనం

13


హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీ గ్రూప్-1 పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

గ్రూప్-1 వాయిదాకు
సుప్రీం నిరాకరణ

పరీక్షల వాయిదా, జీవో 29 రద్దు పిటిషన్‌పై జోక్యం చేసుకోం

అభ్యర్థులు పరీక్షా కేంద్రాల వద్ద ఉండగా స్టే ఇవ్వలేం

పిటిషనర్లకు తేల్చిచెప్పిన సర్వోన్నత న్యాయస్థానం

ఫలితాలకు ముందే విచారణ పూర్తికి హైకోర్టుకు ఆదేశం

ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్

తొలి రోజు ఇంగ్లిష్ క్వాలిఫై పరీక్ష.. 72% మంది హాజరు

నేటి నుంచి సబ్జెక్టులవారీ పరీక్షలు.. కేంద్రాల వద్ద బందోబస్తు

ఆలస్యంగా వచ్చిన పలువురు అభ్యర్థులు వెనక్కి

మహిళా విశ్వవిద్యాలయం వద్ద కన్నీరు పెట్టిన ఓ అభ్యర్థి

గోడ దూకి వెళ్లేందుకు ఓ అభ్యర్థి యత్నం.. పట్టుకున్న అధికార్లు

ఆందోళన వద్దు.. ఏకాగ్రతతో పరీక్షలు రాయండి

గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థులకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రూప్-1 పరీక్షల వాయిదా, జీవో రద్దు పిటిషన్‌పై జోక్యం చేసుకోలేమని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఫలితాల వెల్లడికి ముందే విచారణను ముగించాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. తమ తుది తీర్పునకు లోబడే నియామకాలు జరపాల్సి ఉంటుందంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో స్పష్టంగా

మిగతా 14వ పేజీలో...

భారత్ లౌకిక దేశంగా ఉండాలని లేదా?

పిటిషనర్లకు సుప్రీం సూటి ప్రశ్న

రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తప్పించాలన్న పిటిషన్లపై విచారణ

2



రాబడి తగ్గింది!

జీహెచ్ఎంసీలో నిర్మాణ అనుమతుల ఆదాయం నిరుటి కన్నా 300కోట్లు తక్కువ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు తగ్గడంతో.. జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం ఆదాయం గణనీయంగా తగ్గింది. గత మూడు, నాలుగేళ్లతో పోలిస్తే నిర్మాణ అనుమతులు, నివాసయోగ్య పత్రాల జారీ రుసుము రాబడిలో తగ్గుదల కనిపిస్తోంది. కిందటి సంవత్సరం (2023-24)తో పోలిస్తే ఏకంగా రూ.300 కోట్లు, అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2024-25) కంటే రూ.350 కోట్లకుపైగా ఆదాయం తగ్గడం గమనార్హం. నిర్మాణ అనుమతుల జారీ రుసుమే పట్టణ ప్రణాళికా విభాగానికి ప్రధాన ఆదాయ వనరు. కానీ, ఈ ఏడాది భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు గణనీయంగా తగ్గాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1107.29 కోట్ల ఆదాయం రాగా.. ఏప్రిల్ నుంచి అక్టోబరు 20వ తేదీ వరకు రూ.750 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇప్పటి వరకు కేవలం రూ.450 కోట్లు మాత్రమే సమకూరింది.



బంగారం, వెండి
ఆల్‌టైం రికార్డు

11

ఒక్కరోజే రూ.5,000 పెరిగిన వెండి

రూ.80,000 దాటిన పసిడి ధర

సహించేది లేదు

చట్టాన్ని చేతిలోకి తీసుకునేవారిపై కఠిన చర్యలు

భావోద్వేగాలు రెచ్చగొట్టాలని కొందరి ప్రయత్నం

శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడులు వస్తాయి

ఈ విషయంలో రాజీ లేని కృషి చేస్తున్న పోలీసులు

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

విధినిర్వహణలో మృతిచెందే కానిస్టేబుల్.. కుటుంబానికి కోటి పరిహారం, ఐపీఎస్‌కు 2కోట్లు

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలు

మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటుకు ఉత్తర్వులు.. శంకుస్థాపన చేసిన సీఎం


మంచిరేవులలో యంగ్‌ఇండియా పోలీస్ స్కూల్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడే వారిని తామే శిక్షించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అది సరైంది కాదని, అందుకోసం పోలీస్ వ్యవస్థ ఉందని చెప్పారు. చట్టాన్ని చేతిలోకి తీసుకునే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కొందరు భావోద్వేగంతో, ఉన్మాదంతో మందిరాలపై, మసీదులపై దాడి చేసి.. రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముత్యాలమ్మ గుడిలో జరిగిన ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి బాధ్యులను అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. తప్పిదాలకు పాల్పడే వారిని ఏ మాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సోమవారం గోషామహల్ పోలీస్ స్టేడియంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయారు. పోలీస్ అమర వీరుల స్తూపానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో 140 కోట్ల మంది ప్రజలు గుండెలపై చేయి వేసుకొని ప్రశాంతంగా నిద్ర పోతున్నారంటే దానికి కారణం పోలీసులేనన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి పథంలో ముందు కెళ్లాలంటే శాంతిభద్రతలు అత్యంత కీలకమని, శాంతిభద్రతలు లేకపోతే పెట్టుబడులు రావని అన్నారు. తెలంగాణ పోలీసులు

మిగతా 12వ పేజీలో...

డైట్, కాస్మెటిక్ చార్జీలు 40% పెంపు?

ఉన్నతాధికారుల కమిటీ సిఫారసు

డిప్యూటీ సీఎం భట్టికి నివేదిక అందజేత

26న క్యాబినెట్ భేటీలో నిర్ణయం?

16 ఏళ్ల తర్వాత కాస్మెటిక్‌చార్జీల పెంపు

ఏడేళ్ల తర్వాత పెరగనున్న డైట్ చార్జీలు

రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలు, హాస్టల్ విద్యార్థులకు వర్తింపు

12

7,65,705 మంది విద్యార్థులకు లబ్ధి

విమానాలకు బెదిరింపు కాల్స్ చేస్తే
జీవిత ఖైదే



వారిని నో ఫ్లై జాబితాలో చేర్చేలా సవరణ

కేంద్ర మంత్రి రామ్మోహన్ వెల్లడి

వారంలో 100 బెదిరింపు కాల్స్

అవన్నీ ఫేక్ అని తేలినట్లు ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 21: ఇటీవల భారత్‌లో పౌర విమానాలకు బాంబు బెదిరింపులు ఎక్కువవుతున్నాయి. ఈ నెల 14 నుంచి వారం రోజుల వ్యవధిలోనే సుమారు 100 బెదిదిరింపు కాల్స్ వచ్చాయి. ఈ నేపథ్యంలో కాల్స్, సోషల్ మీడియాలో ఫేక్ పోస్టుల ద్వారా బెదిరింపులకు పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టంలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, బెదిరింపు కాల్స్ చేసే వారిని నో ఫ్లై జాబితాలో చేర్చేలా నిబంధనలు సవరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి బెదిరింపులకు పాల్పడటాన్ని శిక్షార్హమైన నేరంగా

మిగతా 2వ పేజీలో...

1-19 మధ్య ఎయిరిండియా విమానం ఎక్కొద్దు!

దాడి చేస్తామని ఉగ్రవాది పన్నూన్ హెచ్చరిక

కెనడా దృష్టిలో ఇది వాక్‌స్వాతంత్ర్యం: జైశంకర్

2

18 పట్టణాభివృద్ధి సంస్థలు!

రాష్ట్రంలో ఇప్పటికే 9.. మొత్తం 27కు చేరిక

త్వరలో కొత్త యూడీఏల పరిధిలో బిల్డింగ్, లేఅవుట్ ఫీజులపై మార్గదర్శకాలు

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేగవంతమైన అభివృద్ధి కోసం రాష్ట్రమంతా ఒకే విధమైన బృహత్తర ప్రణాళికను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో మరో 18 పట్టణ అభివృద్ధి అథారిటీల (యూడీఏ)ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే రాష్ట్రంలో 9 యూడీఏలున్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన 18 యూడీఏలతో కలిపి వీటి సంఖ్య 27కు చేరింది. యూడీఏల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అవుతున్నాయి. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో యూడీఏలను ఏర్పాటు చేసినట్టు పురపాలక శాఖ పట్టణ ప్రణాళిక అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జిల్లా కలెక్టర్ల నుంచి అందిన ప్రతిపాదనల ఆధారంగా యూడీఏల పరిధిని నిర్ణయించినట్టు చెప్పారు. 18 యూడీఏల గెజిట్ పబ్లికేషన్ జరుగుతున్నట్టు తెలిపారు. ఈ యూడీఏల పరిధిలో త్వరలోనే బిల్డింగ్, లేఅవుట్ ఫీజులు, ఇతర అంశాలపై మార్గదర్శకాలు జారీ కానున్నాయి. యూడీఏలతో మౌలిక వసతుల కల్పన, పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.


గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ ప్రతినిధులు

మత విద్వేషాలు
రెచ్చగొట్టే కుట్ర

పథకం ప్రకారమే ఆలయాలపై దాడులు

కేసులు ఎన్ఐఏకు అప్పగించాలి

గవర్నర్ జిష్ణుదేవ్‌కు బీజేపీ ప్రతినిధుల విజ్ఞప్తి

సమగ్ర విచారణకు డీజీపీ జితేందర్‌కు వినతి

నిఘా వ్యవస్థ పూర్తి విఫలం: ఈటల

స్లీపర్‌సెల్స్ కుట్ర ఛేదించాలి: రఘునందన్

లాఠీచార్జి అమానుషం: రాజాసింగ్

హిందువులపై అక్రమ కేసులు: వీహెచ్‌పీ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పథకం ప్రకారం దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని.. జాతి వ్యతిరేక శక్తులు మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కుట్ర పన్నాయంటూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు బీజేపీ ఫిర్యాదు చేసింది. ఆలయాలపై వరుస దాడుల కేసుల దర్యాప్తును ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ)కు అప్పగించాలని

మిగతా 12వ పేజీలో...

చంద్రబాబు ఒక కన్నును పొడుచుకున్నారా?

తెలంగాణపై చిన్న చూపెందుకు?

శ్రీవారి దర్శనం, వసతి గదుల కోసం మా లేఖలను తీసుకోకపోవడం బాధాకరం

ఏపీ నేతలకు తెలంగాణలో వ్యాపారాల్లేవా?

తీరు మార్చుకోకపోతే అసెంబ్లీలో తీర్మానం

తిరుమలలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఈవో తీరు బాధాకరం: ఎమ్మెల్సీ వెంకట్

13


కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలో తడిసిన ధాన్యం

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో వర్షాలు

వేర్వేరు చోట్ల పిడుగులు.. ఒక మహిళ, మూగజీవాల మృతి

3

పత్తి రైతుకు తేమ దిగులు!

మొదలైన సీసీఐ కొనుగోళ్లు

అకాల వర్షాలతో పెరుగుతున్న తేమ

3

8-12% లోపు ఉంటేనే మద్దతు ధర

తేమ శాతం నిర్ధారణకు కమిటీలు: కొండా

ఇద్దరు బాలికలపై లైంగిక వేధింపులు

12

'బ్యాడ్ టచ్' అవగాహనలో అటెండర్ దుశ్చర్య

బయటపెడితే చంపేస్తానని హెచ్చరిక

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఘటన

ఇంజనీరింగ్ కాలేజీలు సొంతంగా సీట్లు భర్తీచేసుకోవచ్చు!: హైకోర్టు

14



2

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్
నలుగురు మావోయిస్టుల మృతి

ఒక జవాన్‌కు తీవ్ర గాయాలు

ఘటనా స్థలం నుంచి తుపాకులు స్వాధీనం

వరుస ఎన్‌కౌంటర్లతో నక్సల్స్‌కు ఎదురుదెబ్బ

ఇజ్రాయెల్ హెచ్చరికలతో
బీరుట్ ఖాళీ

మూటాముల్లెతో వీధుల్లోకి ప్రజలు..

సురక్షిత ప్రాంతాలకు పయనం.. భారీ ట్రాఫిక్

హెజ్‌బొల్లా ఆర్థిక మూలాలపై ఇజ్రాయెల్ గురి

అల్ ఖర్డ్- అల్ హసన్ బ్యాంక్ శాఖలపై వైమానిక దాడులు

బీరుట్‌లోని అత్యంత రద్దీ ప్రదేశాల్లో అల్ ఖర్డ్ శాఖలు

2

సరిహద్దు గస్తీపై భారత్, చైనా ఒప్పందం

ఎల్ఏసీ వెంబడి 2020 నాటి స్థితి పునరుద్ధరణకు అవకాశం

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముందు కీలక పరిణామం

ఇది సహనం, పట్టుదలతో కూడిన దౌత్యం ఫలితం: కేంద్ర మంత్రి జైశంకర్

ఇక చైనాతో ఉద్రిక్తతలు ముగిసినట్లే!

2

భారత్ లౌకిక దేశంగా ఉండాలని లేదా?

- పిటిషనర్లకు సుప్రీంకోర్టు సూటి ప్రశ్న
- రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్ట్, సెక్యులర్.. పదాలను తొలగించాలన్న పిటిషన్లపై విచారణ

న్యూఢిల్లీ, అక్టోబరు 21: రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్ట్ (సామ్యవాద), సెక్యులర్ (లౌకిక) అనే పదాలను తొలగించాలన్న వాదనలపై సుప్రీంకోర్టు సూటిగా స్పందించింది. భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలోనే ఈ పదాలు ఇవిడి ఉన్నాయని తెలిపింది. ఈ విషయాన్ని న్యాయస్థానాలు పలుమార్లు తమ తీర్పుల్లో స్పష్టం చేశాయని గుర్తుచేసింది. రాజ్యాంగ పీఠిక నుంచి ఈ పదాలను తొలగించాలని కోరుతూ బీజేపీ మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి తదితరులు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్‌ల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్లలో ఒకరైన న్యాయవాది విష్ణుశంకర్‌జైన్ వాదనలు వినిపిస్తూ.. సోషలిస్ట్, సెక్యులర్ పదాలను చేర్చేందుకు 1976లో చేపట్టిన 42వ రాజ్యాంగ సవరణపై పార్లమెంటులో చర్చే జరగలేదన్నారు. దీంతో.. ఈ పదాలకు



అనేక వివరణలు ఉన్నాయని, కానీ.. వాటిని భిన్నంగా అన్వయించుకుంటున్నారని దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. మరో న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ వాదనలు వినిపిస్తూ 42వ సవరణ అమల్లోకి వచ్చేనాటికి నాటి ప్రధాని ఇందిర దేశంలో ఎమర్జెన్సీ విధించారని తెలిపారు. దీనిపై సంజీవ్ ఖన్నా స్పందిస్తూ, "మీరు.. భారత్ సెక్యులర్ దేశంగా ఉండాలనుకోవడంలేదా?"అని ప్రశ్నించారు. అయితే తాము అలా అనడంలేదని, ఆ సవరణను మాత్రమే సవాలు చేస్తున్నామని న్యాయవాది జైన్ చెప్పారు. పీఠికలో ఈ రెండు పదాలను చేర్చడం ద్వారా కొత్త నిర్ణయాలకు అవకాశం కల్పించినట్లయిందని అన్నారు. బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి వాదనలు వినిపిస్తూ.. పీఠికలో 1949 నవంబరు 26 తేదీ ఉండడం తప్పు అని నిరూపిస్తానన్నారు. పీఠిక రెండు భాగాలుగా ఉండొచ్చని, ఒకటి తేదీతో, మరొకటి తేదీ లేకుండా ఉండొచ్చని అన్నారు. సోషలిస్ట్, సెక్యులర్ పదాలను పీఠికలో చేర్చేందుకు దేశ ప్రజలు అంగీకరించారని చెప్పడం సరికాదన్నారు. దీంతో ఇందుకు సంబంధించిన పత్రాలను పిటిషనర్లు సమర్పిస్తే పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది. నోటీసులు జారీ చేసేందుకు మాత్రం నిరాకరించింది. విచారణను నవంబరు 18కి వాయిదా వేసింది.

లోకం తీరు



భారత ఆకాంక్షలు నెరవేరేదాకా విశ్రాంతి లేదు

- అప్పటిదాకా కష్టపడి పనిచేస్తూనే ఉంటాం: మోదీ
- ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఆపే శక్తి భారత్‌కు ఉంది: కామెరాన్



న్యూఢిల్లీ, అక్టోబరు 21: భారతదేశ ఆకాంక్షలు నిజమయ్యేదాకా తమ ప్రభుత్వం కష్టపడి పనిచేస్తూనే ఉంటుందని, విశ్రాంతికి అవకాశమే లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. "భారతదేశం ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. అనేక మైలురాళ్లు చేరుకుంది. సంస్కరణలు అమలు చేసింది. అయినా ఇంకా ఎందుకు కష్టపడి పనిచేస్తున్నారు? అని నన్ను కలిసిన చాలా మంది అంటుంటారు. అప్పుడు నేను.. గడిచిన పదేళ్లలో 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాం. 16 కోట్ల ఇళ్లకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం. ఇది సరిపోతుందా? అని అడుగుతా. కచ్చితంగా సరిపోదు. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే అత్యధికంగా యువత ఉన్న దేశం. మన యువత మనల్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళుతుంది" అని మోదీ చెప్పారు. భారతదేశ కలలు, ఆకాంక్షలు, ప్రతినలు నెరవేరేదాకా విశ్రమించే ప్రసక్తే లేదని సోమవారం ఎన్డీటీవీ నిర్వహించిన 'ప్రపంచ సమ్మేళనం'లో ప్రధాని వ్యాఖ్యానించారు. కాగా, ఇదే సదస్సులో బ్రిటన్ మాజీ ప్రధాని డేవిడ్ కామెరాన్ మాట్లాడుతూ.. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపే శక్తి భారత్‌కు ఉందన్నారు. ఇరు దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించే సామర్థ్యం భారత దేశానికి ఉందని వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదంపై పోరు ఆగదు

- జవాన్ల త్యాగంతోనే దేశాభివృద్ధి: షా



న్యూఢిల్లీ, అక్టోబరు 21: దేశంలో గత పదేళ్లుగా ప్రశాంత పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఉగ్రవాదంపై పోరును ఆపబోమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. జమ్మూ-కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో మునుపటితో పోల్చితే శాంతి నెలకొందని చెబుతూ ఉగ్రవాదం, అక్రమ చొరబాట్లు, మతపర సెంటిమెంట్లను రెచ్చగొట్టేందుకు జరుగుతున్న కుట్రలపై మాత్రం పోరాటాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. సోమవారం ఇక్కడ జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నేషనల్ పోలీసు మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ భద్రతా దళాల త్యాగం కారణంగానే ప్రశాంత పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇంతవరకు విధి నిర్వహణలో 36,438 మంది పోలీసులు అమరులయ్యారని, ఒక్క గత ఏడాదే 216 మంది చనిపోయారని అమిత్ షా చెప్పారు..

గడ్చిరోలి అడవుల్లో ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టుల మృతి.. ఒక జవాన్‌కు గాయాలు

చర్ల, అక్టోబరు 21: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎదురుకాల్పుల్లో ఒక జవాన్ గాయపడ్డారు. గడ్చిరోలి జిల్లాలోని భామ్రాగడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొప్రి అటవీ ప్రాంతంలో నక్సలైట్లు ఉన్నట్లు సమాచారం అందడంతో సీ-60 బెటాలియన్‌కు చెందిన బలగాలు అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. ఘటనా స్థలం నుంచి నక్సలైట్లకు చెందిన తుపాకులు, ఇతర వస్తువులను పోలీస్ బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతి చెందిన మావోయిస్టుల వివరాలు ఇంకా గుర్తించలేదు. మృతదేహాలను గడ్చిరోలి జిల్లా కేంద్రానికి తరలించినట్లు తెలుస్తోంది.

త్వరలో 'కోల్ ఎక్స్ఛేంజ్' ఏర్పాటు: కిషన్ రెడ్డి

- రష్యా నుంచి కోకింగ్ కోల్ దిగుమతి చేసుకునే యోచన

న్యూఢిల్లీ, అక్టోబరు 21: బొగ్గు అమ్మకం, కొనుగోలుదార్లకు సౌకర్యంగా ఉండేందుకు త్వరలో కేంద్ర ప్రభుత్వం 'కోల్ ఎక్స్ఛేంజ్'ను ఏర్పాటు చేయనుంది. ఇతర ఖనిజాలకు కమాడిటీ ఎక్స్ఛేంజ్ ఉన్నట్టు విధంగానే బొగ్గు కోసం ప్రత్యేకంగా దీన్ని నెలకొల్పనుంది. ఈ విషయాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. ఇటీవల జరిగిన సమావేశంలో దీనిపై చర్చించినట్టు తెలిపారు. కోల్ ట్రేడింగ్ ఎక్స్ఛేంజ్ నెలకొల్పాలని 2024-25 ప్రణాళికలో బొగ్గు శాఖ ప్రతిపాదించింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ఏర్పాటుచేసి బొగ్గు అమ్మకాలు, కొనుగోళ్లు, అనుమతులు పొందడం తదితర విషయాల్లో ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఈ ఎక్స్ఛేంజ్ ఉండాలని నిర్ణయించింది. దీనిపై నోట్ రూపొందించి వివిధ మంత్రిత్వ శాఖల అభిప్రాయాలు తెలుసుకొంది. మంత్రివర్గం పరిశీలన కోసం పంపే తుది నోట్‌కు మంత్రి కిషన్‌రెడ్డి ఆమోదం తెలిపారు. ఇది కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పనిచేయనుంది. కాగా, అవసరమైతే రష్యా నుంచి కోకింగ్ కోల్‌ను దిగుమతి చేసుకుంటామని మంత్రి చెప్పారు.

భర్త దీర్ఘాయుష్షుకు వ్రతం చేసి.. రాత్రికి అన్నంలో విషంపెట్టి చంపిన భార్య!

లఖ్‌నవూ, అక్టోబరు 21: భర్త దీర్ఘాయుష్షు కోసం నిష్ఠగా సంకటహర చతుర్థి వ్రతం చేసిన ఆమె అదే రోజు రాత్రి భర్తను హత్యచేసింది. తన వ్రతం కోసం ఉదయం నుంచి పొద్దంతా ఏర్పాట్లతో బిజీగా ఉన్న భర్తతో సాయంత్రం గొడవపడి, రాత్రి అతడికి భోజనంలో విషం పెట్టింది. తీవ్ర అస్వస్థతకు గురైన అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. యూపీలోని కౌశంబీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్మాయిల్‌పూర్‌లో ఆదివారం ఈ ఘటన జరిగింది. మృతుడు అదే గ్రామానికి చెందిన శైలేశ్. నిందితురాలు అతడి భార్య సవిత. ఆదివారం రోజంతా ఉపవాసం ఉన్న సవిత, సాయంత్రం వ్రతం పూర్తయ్యాక భర్తతో గొడవపడింది. అయితే కొద్దిసేపటికే ఆ గొడవ సద్దుమణిగింది. రాత్రి ఇద్దరు కలిసి భోజనం చేశారు. చేతులు కడుక్కున్న తర్వాత ఏదో పనిచెప్పి పొరుగింటికి వెళ్లి రావాలని భర్తను పురమాయించింది. కొద్దిసేపటికి అతడు అస్వస్థతకు గురై ఇంటికొచ్చేసరికి ఇంట్లోంచి పారిపోయింది. శైలేశ్‌ను అతడి సోదరుడు అఖిలేశ్ ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ చికిత్స పొందుతూ శైలేశ్ మృతిచెందాడు. అంతకుముందు.. శైలేశ్ స్టేట్‌మెంట్‌ను వీడియో రూపంలో రికార్డు చేశారు. భోజనంలో భార్య తనకు విషం పెట్టిందని శైలేశ్ స్టేట్‌మెంట్ ఇచ్చాడు.

కేజ్రీవాల్‌కు సుప్రీంలో చుక్కెదురు

- పరువు నష్టం కేసుపై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, అక్టోబరు 21 : ప్రధాని మోదీ విద్యార్హతలపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి తనకు జారీ అయిన సమన్లను కొట్టేయాలని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టేసింది. దీంతో ఆయనపై గుజరాత్ కోర్టులో పరువునష్టం కేసు విచారణ జరగనుంది. ప్రధాని విద్యార్హతలపై కేజ్రీవాల్, ఆప్ నేత సంజయ్ సింగ్ వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యలపై గుజరాత్‌లోని మెట్రోపాలిటన్ కోర్టు వారిద్దరికి సమన్లు జారీ చేసింది. కాగా ఆప్ నేత సంజయ్ సింగ్ ఇదే అంశంపై దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం మరో బెంచ్ ఏప్రిల్ 8న కొట్టేసిన విషయాన్ని జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ కేజ్రీవాల్ పిటిషన్ విచారణ సందర్భంగా గుర్తుచేసింది. కేజ్రీవాల్ తరఫున న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపిస్తూ... గుజరాత్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పటేల్‌కు ఈ వ్యవహారంతో సంబంధం లేదన్నారు. ఒకవేళ ఆప్ నేతల వ్యాఖ్యలు పరువు నష్టం కిందకు వచ్చినా... ప్రధాని మోదీ పరువునష్టం కేసు దాఖలు చేయాలి గాని, గుజరాత్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కాదన్నారు. కాగా ప్రధాని విద్యార్హతలకు సంబంధించి ఆప్ నేతలు ఇద్దరూ ప్రెస్ కాన్ఫరెన్స్‌లు, మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో గుజరాత్ యూనివర్సిటీని లక్ష్యంగా చేసుకుని పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారని రిజిస్ట్రార్ పరువు నష్టం కేసులో పేర్కొన్నారు.

ఎయిరిండియా విమానం ఎక్కొద్దు

- 1-19 మధ్య ప్రయాణించొద్దు
- దాడి చేస్తామని ఉగ్రవాది పన్నూన్ వార్నింగ్



న్యూఢిల్లీ, అక్టోబరు 21: ఖలిస్థాన్ ఉగ్రవాది, సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూన్ భారత్‌కు తాజాగా మరో హెచ్చరిక చేశాడు. నవంబరు 1 నుంచి 19 మధ్య ఎయిరిండియా విమానాలపై దాడిచేస్తామని ప్రకటించాడు. సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. ఆ తేదీల నడుమ ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించవద్దని సోమవారం ఓ వీడియోలో హెచ్చరించాడు. 'సిక్కుల మారణహోమం' 40వ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏదో ఒక ఎయిరిండియా విమానంపై దాడిచేసే అవకాశం ఉందని తెలిపాడు. అమెరికా, కెనడాల ద్వంద్వ పౌరసత్వాన్ని కలిగి ఉన్న పన్నూన్ గత ఏడాది కూడా ఇలాంటి హెచ్చరికే చేశాడు. ఇందుకుగాను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అతడిపై నేరపూరిత కుట్ర, వివిధ వర్గాల నడుమ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాడన్న ఆరోపణలతో కేసు నమోదు చేసింది. నిరుడు డిసెంబరు 13లోపు భారత పార్లమెంటుపై దాడిచేస్తానని కూడా ప్రకటించాడు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాన పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆ రాష్ట్ర డీజీపీ గౌరవ్ యాదవ్‌లను చంపుతామనీ బెదిరించాడు. గ్యాంగ్‌స్టర్లు అంతా ఏకమై జనవరి 26న మాన్‌పై దాడిచేయాలని పిలుపిచ్చాడు. ఓపక్క భారత్‌లో పలు విమానాలకు బాంబు బెదిరింపులు(ఎక్కువ నకిలీవే) వస్తుండడం, మరో ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్య దరిమిలా కెనడాతో భారత్ దౌత్య సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో పన్నూన్ తాజా వార్నింగ్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్న ఇతడిని కేంద్ర హోం శాఖ 2020 జూలైలో ఉగ్రవాదిగా ప్రకటించింది. అంతకు ఏడాది ముందే ఎస్ఎఫ్‌జేను చట్టవిరుద్ధ సంస్థగా పేర్కొంటూ నిషేధం విధించింది. పన్నూన్ హత్య కు భారత గూఢచార సంస్థ రా మాజీ అధికారి వికాస్ యాదవ్ కుట్ర పన్నినట్లు అమెరికా ఈ నెల 17న ఆరోపించడం.. ఇది నిరాధార ఆరోపణగా భారత్ తోసిపుచ్చిన సంగతి తెలిసిందే.

గతంలోనూ బెదిరించారు: విదేశాంగ మంత్రి

ఎయిరిండియాకు, దాని ప్రయాణికులకు సోమవారం వచ్చిన హెచ్చరిక గురించి భారత ప్రభుత్వానికి తెలియదని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. అయితే గతంలో కూడా భారత ఎయిర్‌లైన్స్‌కు, పార్లమెంటుకు, మన దౌత్యవేత్తలకు, హైకమిషన్లకు, మన నేతలకు బెదిరింపులు రావడం చూశామని.. ఇది ఆందోళనకరమని ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంగా కెనడా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. 'చాలా తెలివైన పదాలతో ఈ బెదిరింపులు చేశారు. కెనడా ప్రభుత్వానికి మాత్రం ఇది వాక్‌స్వాతంత్ర్యం' అని అన్నారు. నిలదీశారు. భారతీయ దౌత్యవేత్తల విషయంలో కెనడా రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. భారత్‌లో తమకు లైసెన్సు లభించినట్లుగా ఆ దేశ రాయబారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

విమానాలకు బెదిరింపు కాల్స్ చేస్తే జీవిత ఖైదే

(మొదటి పేజీ తరువాయి)

పరిగణించి తగిన శిక్ష, జరిమానా విధిస్తామని తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ వచ్చిన బెదిరింపు కాల్స్ అన్నీ ఫేక్ అని తేలిందని చెప్పారు. అయినప్పటికీ.. పౌర విమానయాన శాఖకు కఠినమైన ప్రొటోకాల్ ఉందని, దాన్నే తాము పాటిస్తున్నామని స్పష్టం చేశారు. విమానంలో బోర్డింగ్ పూర్తయ్యాక ఇలాంటి బెదిరింపు కాల్స్ చేసేవారికి శిక్ష విధించేలా ఇప్పటికే చట్టంలో కొన్ని సెక్షన్లు ఉన్నాయని, అయితే.. ఇతర ప్రాంతాల్లో ఉంటూ బెదిరింపులకు పాల్పడేవారికి కూడా వీటిని వర్తింపజేసే ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. బెదిరింపు కాల్స్ వచ్చినప్పటి నుంచి అనేక విమానయాన సంస్థలతో పలుమార్లు సమావేశాలు నిర్వహించామని తెలిపారు. సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్ (ఎస్‌యూఏసీఎస్ఏ)ను సవరించే అంశంపైనా వివిధ శాఖలతో చర్చిస్తున్నామని చెప్పారు. విమానం గాలిలో ఉన్నప్పుడు ఫేక్ బెదిరింపు కాల్స్ చేసేవారికి ఎస్‌యూఏసీఎస్ఏ చట్టం ప్రకారం ప్రస్తుతం జీవిత ఖైదు విధిస్తున్నారు. అయితే దీనితోపాటు వారిని నో ఫ్లై జాబితాలో చేర్చేందుకు నిబంధనలు సవరించే పనిలో ఉన్నామని మంత్రి తెలిపారు. "గతవారం రోజుల్లో పలు బెదిరింపు కాల్స్ రావడంతో ఎనిమిది విమానాలను దారి మళ్లించాం. ప్రతి అంశాన్నీ సమగ్రంగా విశ్లేషించి వేగంగా నిర్ణయాలు తీసుకున్నాం. అవి ఫేక్ కాల్స్ అని తెలిసినా.. మేం తేలికగా తీసుకోలేదు. భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. బెదిరింపు కాల్స్‌పై హోంశాఖ, ఇతర ఏజెన్సీలతో కలిసి దర్యాప్తు వేగవంతం చేస్తున్నాం. అందరి సమష్టి కృషితో త్వరలోనే మెరుగైన పరిస్థితి తీసుకొస్తాం' అని రామ్మోహన్ నాయుడు వివరించారు.

హోంశాఖతో సమావేశం

విమానాశ్రయాల్లో భద్రతకు బాధ్యత వహించే ఏవియేషన్ సెక్యూరిటీ బాడీ బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)తో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సోమవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. బీసీఏఎస్ డైరెక్టర్ జనరల్ జుల్ఫికర్ హసన్, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ రాజ్విందర్ సింగ్ భట్టి.. బెదిరింపు కాల్స్‌పై ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు వివరాలను హోంశాఖ ముఖ్యకార్యదర్శి గోవింద్ మోహన్‌కు వివరించారు.

సరిహద్దు గస్తీపై భారత్, చైనా ఒప్పందం

- ఎల్ఏసీ వెంబడి 2020 నాటి స్థితి పునరుద్ధరణ చాన్స్

న్యూఢిల్లీ, అక్టోబరు 21: గాల్వన్ లోయలో ఉద్రిక్తతలు ఏర్పడటానికి(2020 మే) ముందు సరిహద్దులో భారత్, చైనా సైన్యం ఏ విధంగానైతే గస్తీ నిర్వహించేవారో తిరిగి అదే విధంగా గస్తీ నిర్వహించుకునేందుకు అవకాశం ఏర్పడిందని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. సోమవారం ఢిల్లీలో ఒక ఆంగ్ల టీవీ చానల్ సదస్సులో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 'గస్తీపై ఒక ఒప్పందానికి వచ్చాం. 2020 నాటి పరిస్థితికి తిరిగి వెళ్లనున్నాం. తద్వారా చైనాతో ఉద్రిక్తతలు ముగిశాయనుకోవచ్చు. 2020 తర్వాత వివిధ కారణాలతో వారు మనల్ని దూరం పెడితే, మనం వారిని దూరం పెట్టాం. ఇప్పుడు ఇరుపక్షాలూ ఒక అవగాహనకు వచ్చాం. దీంతో 2020 వరకు ఏ విధంగా గస్తీ నిర్వహించామో మళ్లీ అదే విధంగా గస్తీ నిర్వహించుకునేందుకు అవకాశం ఏర్పడింది' అన్నారు. '2020 సెప్టెంబరు నుంచి చర్చలు జరుపుతూనే ఉన్నాం. మరింత సంక్లిష్టంగా ఉన్నప్పటికీ ఇది చాలా సహనంతో కొనసాగిన ప్రక్రియ' అన్నారు. కాగా, ప్రధాని మోదీ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనే నిమిత్తం చేపట్టనున్న రష్యా పర్యటన వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించిన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రం మిస్రీ కూడా ఈ విషయాన్ని వెల్లడించారు. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి గస్తీ విషయంలో భారత్, చైనా ఒక ఒప్పందానికి వచ్చాయని చెప్పారు. ఇరుదేశాల నుంచి చర్చల్లో పాల్గొనే వారు కొన్ని వారాలుగా పరస్పరం అందుబాటులో ఉన్నారన్నారు. 'ఎల్ఏసీ వెంబడి గస్తీపై భారత్, చైనా ఒక ఒప్పందానికి వచ్చాయి. 2020లో తలెత్తిన అంశాలపై ఒక పరిష్కారానికి వచ్చాయి' అన్నారు.

మదర్సాల్లో సమగ్ర విద్య కరువు

- విద్యార్థుల ఎదుగుదలకు అవకాశాలు తక్కువ
- సుప్రీంకు తెలిపిన బాలల హక్కుల కమిషన్

న్యూఢిల్లీ, అక్టోబరు 21: మదర్సాలు విద్యార్థులకు సమగ్రమైన విద్యను అందించడంలేదని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) అభిప్రాయపడింది. ఈమేరకు సుప్రీంకోర్టులో అఫిడవిట్ సమర్పించింది. ఉత్తరప్రదేశ్ మదర్సా విద్యా బోర్డు చట్టం-2004ను కొట్టివేస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలైంది. దీనికి సమాధానంగా ఎన్‌సీపీసీఆర్ అఫిడవిట్‌ను సమర్పించింది. మదర్సాలు సరైన విద్యను అందించడంలేదని, అందువల్ల విద్యార్థులు ఎదుగుదల అవకాశాలను కోల్పోతున్నారని తెలిపింది. విద్యా హక్కు చట్టానికి అనుగుణంగా నిర్వహణ ఉండడంలేదని, యాజమాన్యం ఇష్టాయిష్టాలపైనే అవి నడుస్తున్నాయని తెలిపింది. టీచర్ల నియామకం, వారి అర్హతలు, నిధుల సమీకరణ తదితర అంశాల్లో ఎక్కడా పారదర్శకతలేదని పేర్కొంది. ఖురాన్, ఇతర మత గ్రంథాలను అధ్యయనం చేయడానికి ఉద్దేశించిన సంప్రదాయ పద్ధతుల్లోనే నడుస్తున్నాయని తెలిపింది. విద్యాయేతర కార్యకలాపాలు, ప్రయోగాలు వంటివేమీలేవని పేర్కొంది. ఇది అసంఘటిత విద్యారంగంగా మారిందని అభిప్రాయపడింది. పాఠ్యాంశాలపైనా అభ్యంతరం తెలిపింది. ముస్లింమత ఆధిక్యతను వ్యాప్తి చేసే దిశగా బోధన ఉంటోందని పేర్కొంది. ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ముస్లిమేతర విద్యార్థులూ చదువుతున్నారని, అలాంటి వారికి ఈ బోధన ఇబ్బంది కలిగిస్తుందని అభిప్రాయపడింది. చిన్న పిల్లల విషయంలో కొన్ని అభ్యంతరకరమైన పాఠాలు కూడా ఉన్నాయని తెలిపింది. ముస్లిమేతర భద్రత బలగాలపై ఆత్మాహుతి దాడులు చేస్తే ఎలా వ్యవహరించాలన్నదానిపై దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్ ఫత్వా జారీ చేస్తూ దీనిపై స్థానిక పండితులను సంప్రదించాలని తెలిపిందని బాలల హక్కుల కమిషన్ తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఇది ఉగ్రవాదాన్ని సమర్థించేదిగా, జాతీయ భద్రతకు ముప్పు కలిగించేలాఉందని అభిప్రాయపడింది.

వయనాడ్‌తో నయాజోష్ వచ్చేనా?

- కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారిన ఎన్నిక
- తొలిసారిగా ఎన్నికల బరిలో ప్రియాంక
- గెలుపునకు సర్వశక్తులొడ్డుతున్న కాంగ్రెస్
- రేపు ప్రియాంక నామినేషన్.. సోనియా, రాహుల్, ఖర్గే హాజరు

న్యూఢిల్లీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వయనాడ్ ఉప ఎన్నిక గెలుపు కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. గాంధీ కుటుంబానికి చెందిన ప్రియాంక తొలిసారిగా ఎన్నికల బరిలో నిలవడంతో అధిష్ఠానం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ప్రియాంక గాంధీ గెలుపు కోసం యావత్ కాంగ్రెస్ దృష్టి కేంద్రీకరించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్‌తో పాటు రాయ్ బరేలీ స్థానం నుంచి పోటీ చేసి, రెండు చోట్లా విజయం సాధించారు. రాయ్ బరేలీ నుంచి ఎంపీగా కొనసాగుతూ వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. గాంధీ కుటుంబాన్ని రాయ్ బరేలి, అమేఠీ తర్వాత అక్కున చేర్చుకున్న నియోజకవర్గం వయనాడ్. 2019లో కాంగ్రెస్ కంచుకోట అమేఠీలో రాహుల్ గాంధీ ఓటమి పాలవగా, వయనాడ్ మాత్రం అఖండ విజయాన్ని అందించింది. 2024 లోకసభ ఎన్నికల్లోనూ అక్కడి ప్రజలు రాహుల్ గాంధీని అక్కున చేర్చుకున్నారు. అత్యధిక మెజారిటీతో గెలిపించారు. అందుకే.. గాంధీ కుటుంబానికే చెందిన ప్రియాంకను బరిలో నిలపడం ద్వారా వయనాడ్ తమకెంతో ప్రత్యేకమని చెప్పేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. వయనాడ్‌లో యూడీఎఫ్ తరఫున కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రియాంక గాంధీ ఈ నెల 23న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ విషయాన్ని ఏఐసీసీ సోమవారం అధికారికంగా ప్రకటించింది. నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని ఏఐసీసీ తెలిపింది. కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర నేతలతోపాటు ముఖ్యమంత్రులు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారని స్పష్టం చేసింది.



ముగ్గురి మధ్య హోరాహోరీ


గాంధీ కుటుంబాన్ని ఓడించి వయనాడ్ స్థానాన్ని సొంతం చేసుకోవాలని బీజేపీ యోచిస్తోంది. ఇప్పటికే బీజేపీ, సంఘ్ శ్రేణులు వయనాడ్‌లో ఆపరేషన్ ప్రారంభించాయి. స్థానికంగా మంచి పేరున్న విద్యావంతురాలైన నవ్య హరిదాస్‌ను రంగంలోకి దింపింది. ప్రియాంక గాంధీ స్థానికేతరురాలు అనే ప్రచారం చేస్తూ, స్థానిక సెంటిమెంట్‌ను రగిలించాలని బీజేపీ ప్రయత్నిస్తున్నట్టు పలువురు రాజకీయ విమర్శకులు అభిప్రాయ పడుతున్నారు. మరోవైపు.. వామపక్ష పార్టీలకు కంచుకోట కేరళ. అక్కడ అధికార పార్టీ కూడా వామపక్షాలదే. అందుకే.. ఈ సారి ఎలాగైన వయనాడ్‌ను సొంతం చేసుకోవాలని ఎల్‌డీఎఫ్ పట్టుదలగా ఉంది. గత లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్‌లో లెఫ్ట్ పార్టీకి రాహుల్ గాంధీకి మధ్యనే పోటీ నెలకొంది. రాహుల్ గాంధీకి 6,47,445 ఓట్లు రాగా, ఎల్డీఎఫ్ నుంచి బరిలో నిలిచిన సీపీఐ అభ్యర్థి అనీ రాజాకు 2,83,023 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి సురేంద్రన్ 1,41,045 ఓట్లతో మూడోస్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. అందుకే.. ఈ సారి ఎల్డీఎఫ్ సైతం వ్యూహాత్మకంగా తమ అభ్యర్థిని మార్చింది. క్షేత్రస్థాయిలో ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఈ పోటీలో విజయం ఎవరిదనే అంశంపై నవంబరు 13న జరిగే పోలింగ్‌తో స్పష్టత రానుంది. నవంబరు 23న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

మోదీపై అన్నాచెల్లెళ్ల యుద్ధం..

దేశంలో దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న ప్రధాని మోదీని నిలువరించేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలను ముమ్మరం చేసిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే మోదీ ప్రాభవం తగ్గిందని భావిస్తున్న కాంగ్రెస్.. వచ్చే ఎన్నికలలోపు మరింత బలమైన పార్టీగా ఎదిగేందుకు వ్యూహాలకు పదును పెట్టిందని అంటున్నారు. ఇప్పటికే.. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ తనదైన పాత్ర పోషిస్తున్నారని భావిస్తున్న కాంగ్రెస్.. మరోశక్తిగా ప్రియాంక గాంధీని తయారు చేయాలని ఆశిస్తున్నదని చెబుతున్నారు. అందులో భాగంగానే ఆమెను వయనాడ్ నుంచి ఎన్నికల బరిలో నిలుపుతున్నారని అభిప్రాయ పడుతున్నారు. వయనాడ్‌లో ప్రియాంక విజయం సాధిస్తే రాహుల్, ప్రియాంక చెరోవైపు దేశంలోని ప్రజల తరఫున నిలిచేలా పార్టీ ప్రణాళికలు రచిస్తోందని అంటున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ ఇప్పటి నుంచే వ్యూహ రచన చేస్తున్నదని, అందులో భాగంగానే ప్రియాంకను బరిలోకి దింపుతున్నదని అభిప్రాయ పడుతున్నారు.

ఇజ్రాయెల్ హెచ్చరికలతో బీరుట్ ఖాళీ

- ప్రాణభయంతో వీధుల్లోకి ప్రజలు.. మూటాముల్లెతో పరుగులు
- సురక్షిత ప్రాంతాలకు పయనంతో భారీగా ట్రాఫిక్ జామ్



బీరుట్, టెల్ అవీవ్, గాజా, అక్టోబరు 21: లెబనాన్ రాజధాని బీరుట్‌ను వదిలిపోవాలన్న ఇజ్రాయెల్ హెచ్చరికలతో ప్రజలు పరుగులు తీశారు. ప్రాణభయంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు జనం పెద్ద ఎత్తున వీధుల్లోకి రావడంతో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. బీరుట్ జనాభా 24 లక్షలు కాగా ఉన్నపళంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలనడంతో చాలా మంది ఇళ్లను వదిలిపెట్టేశారు. వాస్తవానికి హెజ్‌బొల్లా ఆర్థిక మూలాలు దెబ్బతీసే లక్ష్యంతో వారికి ఆర్థిక వనరులను సమకూర్చే అల్ ఖర్ద్-అల్ హసన్ అసోసియేషన్ శాఖలపై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. అల్ ఖర్ద్-అల్ హసన్‌కు 30 శాఖలుండగా అందులో 15 బీరుట్‌లో అత్యంత రద్దీగా ఉండే ప్రదేశాలు, కిక్కిరిసిన జనావాసాల మధ్యలో ఉన్నాయి. ఐడీఎఫ్ హెచ్చరించిన కాసేపటికే బీరుట్ శివార్లలోని చియా ప్రాంతంలో పేలుళ్లు సంభవించాయి. దీంతో బీరుట్ వాసులు ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీయాల్సివచ్చింది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ బీరుట్‌లో పర్యటించడానికి కొద్ది గంటల ముందు ఇజ్రాయెల్ ఈ దాడులకు దిగింది.

నష్టంపై హెజ్‌బొల్లా నాయకత్వం ఆరా!

అల్ ఖర్ద్-అల్ హసన్ అసోసియేషన్‌ను 1983లో ఏర్పాటు చేశారు. ఇస్లామిక్ మత విధానాలకు అనుగుణంగా సేవా భావంతో సామాన్యులకు రుణాలను అందిస్తుంది. హెజ్‌బొల్లాకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్నారనే ఆరోపణలతో అమెరికా దీనిపై 2007లో ఆంక్షలు విధించింది. హెజ్‌బొల్లాను నాశనం చేయాలని నిర్ణయించుకున్న ఇజ్రాయెల్ దానికి ఆర్థిక వనరులు అందకుండా అల్ ఖర్ద్-అల్ హసన్ అసోసియేషన్ శాఖలన్నింటిపై దాడులకు ఉపక్రమించింది. ఇజ్రాయెల్ దాడులతో జరుగుతున్న నష్టంపై హెజ్‌బొల్లా నాయకత్వం ఆరా తీసింది.

హెజ్‌బొల్లా రాకెట్ దాడులు

ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా రాకెట్ దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా 30కి పైగా రాకెట్లను ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించింది. వీటిని విజయవంతంగా కూల్చేశామని ఐడీఎఫ్ ప్రకటించింది. స్పష్టమైన కారణాలు వెల్లడించకుండానే బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసేసింది.

ఒక్కో జంట 16 మంది పిల్లల్ని కనాలేమో!

- 'డీలిమిటేషన్'తో ఇలాగే ఆలోచించాల్సి వస్తుందేమో: తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనలో తమిళనాడులో లోక్‌సభ స్థానాలు తగ్గే అవకాశం ఉండడంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జనాభా నియంత్రణ కారణంగా రాష్ట్రంలో ఎంపీ స్థానాలు తగ్గే పరిస్థితి తలెత్తుతున్నప్పుడు.. పిల్లల్ని కనే విషయంలో పరిమితులు ఎందుకు విధించుకోవాలనే ఆలోచన వస్తోందన్నారు. చెన్నైలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 31 జంటలకు సామూహిక వివాహాలు జరిపించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పూర్వం కొత్తగా పెళ్లయిన జంటలను పెద్దలు.. 16 సంపదలతో వర్ధిల్లాలని ఆశీర్వదించేవారు. ఇప్పుడు 16 సంపదలకు బదులుగా 16 మంది పిల్లల్ని కనాల్సిందిగా దీవించాల్సివస్తుందేమో!" అని వ్యాఖ్యానించారు. పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన విధానాన్ని చూస్తే ఇలాగే ఆలోచించాలేమోనన్నారు.



డయల్-1912 వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎండీలు

కరెంటు అంతరాయమా..
డయల్ 1912

- హైదరాబాద్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అంబులెన్స్‌ల తరహాలో ప్రత్యేకంగా వాహనాలు
- ఒక్కో వాహనంలో ఏఈ సహా ముగ్గురు సిబ్బంది
- థర్మో విజన్ కెమెరాలతోపాటు భద్రతా పరికరాలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లోని విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అంబులెన్స్‌ల తరహాలో ప్రత్యేక వాహనాలను టీజీఎస్పీడీసీఎల్ అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే వెంటనే అత్యవసర సేవల సిబ్బంది అందుబాటులోకి వచ్చేలా ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు ఖైరతాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం డయల్-1912 నూతన వాహనాలను డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అంబులెన్స్ తరహాలో ఈ వాహనాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు. సీబీడీ(సెంట్రల్ బ్రేక్ డౌన్) విభాగాన్ని పటిష్ఠపరుస్తూ ప్రతి డివిజన్‌లో ప్రత్యేక వాహనం అందుబాటులోకి తీసుకవస్తున్నామన్నారు. వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే వెంటనే అత్యవసర సేవల సిబ్బంది పరికరాలతో అక్కడకు చేరుకొని విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతారని తెలిపారు. ప్రతి వాహనంలో అవసరమైన మెటీరియల్‌తోపాటు ఒక అసిస్టెంట్ ఇంజనీర్, ముగ్గురు లైన్ సిబ్బంది 24 గంటలు సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఈ వాహనాల్లో థర్మో విజన్ కెమెరాలు, పవర్ రంపం మిషన్, నిచ్చెనలు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, కేబుల్స్ వంటి భద్రతా పరికరాలను అందుబాటులో ఉంచారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిలైతే.. అక్కడకు తక్కువ సమయంలో తరలించడానికి, పాత ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు ఈ వాహనాలను వినియోగించనున్నారు. టీజీ ఎయిమ్స్ యాప్‌తో అనుసంధానం చేయడం ద్వారా వాహనం ఎక్కడ ఉంది? ఎన్ని నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకుంటుందనే వివరాలు అధికారులకు ఎప్పటికప్పుడు తెలిసిపోతుంది.

ప్రభుత్వ అనుమతులుంటే కూల్చరు!

- డెవలపర్లు, కొనుగోలుదారులు ఆందోళన చెందొద్దు
- నరెడ్కో తెలంగాణ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి
- హైటెక్స్‌లో 25 నుంచి 27 వరకు ప్రాపర్టీ షో

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు తీసుకొని నిర్మించిన ఏ ప్రాజెక్టును ఎవరూ కూల్చరని, నిర్మాణ సంస్థలు, డెవలపర్లు, కొనుగోలుదారులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నరెడ్కో) తెలంగాణ అధ్యక్షుడు ఎం.విజయసాయి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అన్ని అనుమతులున్న ప్రాజెక్టులు కూడా అక్రమంగా నిర్మించారనే తప్పుడు సమాచారంతో కొనుగోలుదారుల్లో అనేక సందేహాలు, ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రభుత్వ అనుమతులు తీసుకున్న నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బంది లేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం భరోసానిచ్చిందని చెప్పారు. ఈ నెల 25 నుంచి 27 వరకు హైటెక్స్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించనున్న నరెడ్కో ప్రాపర్టీ షో బ్రోచర్‌ను సోమవారం నరెడ్కో ప్రతినిధులు ఆవిష్కరించారు. ప్రాపర్టీ షోలో వందలాది ప్రాజెక్టులకు చెందిన ఫ్లాట్లు, ఇళ్లు, స్థలాలు అందుబాటులో ఉంటాయని, కొనుగోలుదారులు తమకు నచ్చిన ఆస్తులను ఎంచుకోవచ్చని చెప్పారు.

శ్రీవారి ఆలయానికి సమీపంలో ప్రయాణించిన హెలికాప్టర్

తిరుమల, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయానికి సమీపంలో సోమవారం ఓ హెలికాప్టర్ ప్రయాణించడం కలకలం సృష్టించింది. సాధారణంగా ఆలయ ఆగమశాస్త్రం ప్రకారం గర్భాలయం పైభాగంలో విమానాల రాకపోకలుండకూడదు. అయితే నోఫ్లయింగ్ జోన్‌గా తిరుమలను ప్రకటించడం సాధ్యం కాదని కేంద్రం స్పష్టం చేసింది. భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని వీలైనంతవరకు తిరుమల క్షేత్రం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటారు. అయితే ఇటీవల తిరుమలపై విమానాలు ప్రయాణిస్తూనే ఉన్నాయి. తాజాగా సోమవారం ఉదయం హెలికాప్టర్ భారీ శబ్ధంతో ప్రయాణించడంతో మళ్లీ నో ఫ్లయింగ్ జోన్ అంశం తెరపైకి వచ్చింది.

అకాలవర్షం.. తడిసిన ధాన్యం

కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కామారెడ్డి జిల్లాలో సోమవారం కురిసిన అకాలవర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. జిల్లాలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, సదాశివనగర్, కామారెడ్డిలో సోమవారం వర్షం కురిసింది. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేటలలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. చేతికి వచ్చిన పంట నీటిపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సదాశివనగర్‌లో భారీ వర్షానికి చెరువు అలుగులు పొంగి పలు ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. కోతకు చేరుకున్న వరిపైరు నేలకొరిగింది. నిజామాబాద్, నిర్మల్, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ అకాల వర్షం కురిసి పలు ప్రాంతాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల వరిపంట నేలకొరిగింది. కొన్నిచోట్ల వాన నీటి ప్రవాహానికి ధాన్యం కొట్టుకుపోయింది. సిద్దిపేటలో మార్కెట్ యార్డు, చేర్యాల మార్కెట్ యార్డులో ధాన్యం కొట్టుకుపోగా మక్కలు తడిసి ముద్దయ్యాయి. సిద్దిపేట జిల్లా పెద్దమాసాన్‌పల్లిలో పిడుగు పడి బోదాస్ లక్ష్మి(50) అనే మహిళ మృతి



కామారెడ్డి జిల్లా ధర్మారావుపేటలో అకాల వర్షానికి నేలకొరిగిన వరి పంట

చెందింది. చిన్నకోడూరు మండలంలోని చెల్కలపల్లి గ్రామంలో ఒక ఆవు, హుస్నాబాద్ మండలంలోని పోతారం(ఎస్)లో మరో ఆవు పిడుగులు పడి మృతి చెందాయి. మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలంలో పిడుగు పడి ఏడు మేకలు మృత్యువాత పడ్డాయి.

సాగర్ 20 గేట్ల నుంచి నీటి విడుదల

శ్రీశైలం కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలు, 5 క్రస్ట్‌గేట్లను ఎత్తి 2,22,147 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదలడంతో సాగర్ 20 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ కాల్వలు, జల విద్యుత్ కేంద్రం, క్రస్ట్‌గేట్ల ద్వారా మొత్తం 2,29,692 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.04 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 589 అడుగులు ఉంది. ఎగువన శ్రీశైలం ప్రాజెక్టుకు 1,68,863 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 884.30 అడుగులతో 211.47 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

తూర్పు మధ్య బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సాయంత్రానికి తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది .మంగళవారం వాయుగుండంగా, బుధవారం ఉదయానికి తుఫాన్‌గా బలపడుతుంది.

పత్తి రైతుకు తేమ దిగులు!

మొదలైన సీసీఐ కొనుగోళ్లు.. అకాల వర్షాలతో పంటలో పెరుగుతున్న తేమ శాతం

- 8 నుంచి 12 శాతం లోపు ఉంటేనే మద్దతు ధర..
- తేమ శాతం నిర్ధారణకు ప్రత్యేక కమిటీలు వేస్తామన్న మంత్రి సురేఖ

వరంగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అన్నదాతను వరుస కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రకృతి పగ బట్టినట్లుగా అకాల వర్షాలతో పంటలపై ప్రభావం చూపగా, చేతికొచ్చిన పంటకు తేమ శాతం పెరుగుతుండటంతో మద్దతు ధర లభించే పరిస్థితి కనిపించట్లేదు. వరుసగా కురుస్తున్న వర్షాలకు పత్తితో పాటు ధాన్యంపై కూడా తేమ శాతం పెరుగుతోంది. దీంతో సీసీఐ, మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు తేమ పేరుతో భారీగా కోత విధిస్తుండటంతో అన్నదాతలు విలవిలలాడుతున్నారు. రాష్ట్రంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఎట్టకేలకు పత్తి కొనుగోళ్లను ప్రారంభించింది. సోమవారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్లను మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. నెల రోజుల క్రితమే పత్తి మార్కెట్లోకి వస్తున్నా సీసీఐ కొనుగోళ్లను చేపట్టలేదు. ఈ నేపథ్యంలో ప్రైవేటు వ్యాపారులు క్వింటాల్‌కు రూ.5,200 నుంచి రూ.7 వేల వరకు చెల్లించి పత్తిని కొనుగోలు చేశారు. అయితే సీసీఐ క్వింటాల్‌కు రూ.7,521 చెల్లిస్తోంది. దీంతో నెల రోజులుగా ఐదారు లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి భారీగా నష్టపోయామని వాపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ 320 కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

తేమపై రైతుల్లో టెన్షన్..

అకాల వర్షాలతో భారీగా పడిపోయిన దిగుమతి దిగులు నుంచి దూది రైతులు కోలుకోకముందే తేమ టెన్షన్ పెడుతోంది. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 శాతం మించి ఉండకూడదనే సీసీఐ నిబంధన రైతులను కలవర పెడుతోంది. నెలన్నర రోజులకు పైగా కురుస్తున్న వర్షాలతో చేతికొచ్చే పత్తి తడుస్తూ ఉండటంతో.. ఇంటికి తెచ్చి ఆరపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఎంత శ్రమించినా తేమ శాతం మాత్రం పత్తిలో భారీగానే ఉం టుంది. దీంతో సీసీఐ వద్ద కూడా మద్దతు ధర వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. ఇక కౌలు రైతులకు కొనుగోళ్ల చెల్లింపులపై సాంకేతిక సమస్యలు వస్తున్నా యి. సీసీఐ కొనుగోళ్లలో పారదర్శకత పాటిస్తున్న నేపథ్యంలో.. కౌలు రైతులు సీసీఐ వద్ద తమ పత్తిని విక్రయించాలంటే భూయాజమానుల నుంచి ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ తీసుకెళ్లాల్సిందే. అయితే చాలా మంది ఆధార్ కార్డు, బ్యాంకు బుక్ ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో గత్యంతరం లేక దళారులకే పత్తిని విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. తేమ నిబంధనలను కాస్తంత సడలింపులతో పాటు కౌలు రైతులు తమ ఆధార్, పాస్‌బుక్ ఇచ్చేలా సీసీఐ అధికారులతో చర్చిం చి ఒప్పించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రతి బస్తా కొనుగోలు చేస్తాం: సురేఖ

పత్తి రైతుల ఆందోళనల నేపథ్యంలో తేమ శాతాన్ని నిర్ధారించేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేక కమిటీలను నియమిస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత మాట్లాడుతూ.. రైతులు తెచ్చిన ప్రతి బస్తా పత్తిని కొనుగోలు చేస్తామని.. మూడ్రోజుల్లో రైతు ఖాతాల్లో డబ్బులను జమ చేస్తామని వెల్లడించారు.

రైస్ మిల్లర్లు ఆస్తులు అమ్ముకోవద్దు


- రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికవరీ యాక్ట్ - 1864 ప్రకారం రాష్ట్రప్రభుత్వం సీజ్ చేసిన ఆస్తులను రైసు మిల్లర్లు అమ్ముకోరాదని హైకోర్టు డివిజన్ బెంచ్ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. అంతేకాక ఆస్తులకు సంబంధించిన అంశాల్లో వేరేవారితో ఎటువంటి లావాదేవీలను జరపరాదని పేర్కొంది. కస్టం మిల్లింగ్ రైస్ ఇవ్వని రైస్‌మిల్లర్ల ఆస్తులను ఇటీవల ప్రభుత్వం సీజ్ చేసింది. దీనిపై పలువురు యజమానులు హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు దాఖలు చేశారు. రైస్‌మిల్లర్ల పిటిషన్లను అనుమతించిన సింగిల్ జడ్జి ధర్మాసనం.. ఆస్తుల జప్తును కొట్టేసింది. సీఎంఆర్ ఒప్పందంలో ఆర్బిట్రేషన్ క్లాజ్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదని అభిప్రాయపడింది. చట్టప్రకారం మళ్లీ చర్యలు తీసుకోవచ్చని ప్రభుత్వానికి స్వేచ్ఛ ఇస్తూ ఆస్తుల జప్తును కొట్టేసింది. అయితే సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్, అధికారులు డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేశారు. వీటిపై సోమవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకునే ముందు మిల్లర్లకు ఎలాంటి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదు. అయినా వారికి నోటీసులు ఇచ్చాం. చర్యలు తీసుకోవడానికి ముందు చేపట్టిన ప్రక్రియే నోటీసులు ఇవ్వడంతో సమానం' అని తెలిపారు. రైస్‌మిల్లర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. 'కఠిన చర్యలకు దిగేముందు ప్రభుత్వం ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. రెండు పార్టీల మధ్య జరిగిన ఒప్పందంలో ఆర్బిట్రేషన్ క్లాజ్ ఉన్నప్పుడు రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించడమనే విషయమే తలెత్తదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. నోటీసులు ఇచ్చారా? లేదా? వివరాలు సమర్పించాలని ఏజీకి ఆదేశాలు జారీచేసింది. వచ్చే విచారణ వరకు ఆస్తులను అమ్ముకోవడం లేదా బదిలీ చేయడం చేయరాదని మిల్లర్లకు ఆదేశాలు జారీచేసింది. విచారణను నవంబరు 5కు వాయిదా వేసింది.

జయశంకర్ వర్సిటీలో అదనంగా 200 సీట్లు

- బీఎస్సీ ఆనర్స్ కోర్సులో ప్రత్యేక కోటా కింద పెంపు
- రూ.10 లక్షల కోర్సు ఫీజు రూ.5 లక్షలకు తగ్గింపు

హైదరాబాద్/రాజేంద్రనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కోటా కింద అదనంగా 200 సీట్లను బీఎస్సీ(ఆనర్స్) వ్యవసాయ కోర్సులో పెంచుతున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాద పూర్వకంగా కలిసిన అల్దాస్ జానయ్య

అల్దాస్ జానయ్య ప్రకటించారు. ఈ సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేస్తామని సోమవారం ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుతం ప్రత్యేక కోటాలో ఉన్న బీఎస్సీ(ఆనర్స్) వ్యవసాయ కోర్సుకు 4 ఏళ్లకు కలిపి రూ. 10 లక్షల ఫీజు ఉండగా... దాన్ని రూ. 5 లక్షలకు తగ్గించినట్లు తెలిపారు. అలాగే ప్రవేశ సమయంలో ఒకేసారి రూ. 3 లక్షలు చెల్లించాలనే నిబంధన ఉండగా.. దానిని రూ. 65 వేలకు తగ్గించినట్లు వెల్లడించారు. పెంచుతున్న సీట్ల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో రెండు, మూడు రోజుల్లో అందుబాటులో ఉంచుతామని వివరించారు. ప్రస్తుతం వ్యవసాయ వర్సిటీ వీసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య.. సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిశారు.

చేతబడి నెపంతో బాబాయి హత్య

- సొంత అన్న కుమారుడే నిందితుడు



కుంజా భిక్షం

జూలూరుపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చేతబడి నెపంతో సొంత బాబాయినే చంపేశాడు ఓ వ్యక్తి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం రాచబండ్లకోయగూడెంలో ఆదివారం ఈ దారుణం జరిగింది. గ్రామానికి చెందిన కుంజా ప్రవీణ్, మల్కం గంగయ్య(అలియాస్ గంగులు) వరుసకు మామా అల్లుళ్లు. కొంతకాలంగా ప్రవీణ్, అతడి తల్లి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి తన బాబాయి కుంజా భిక్షం(42) చేతబడి చేయడమే కారణమని ప్రవీణ్ అనుమానించాడు. భిక్షంను చంపడానికి ప్రవీణ్ తన మామ గంగులుతో కలిసి పథకాన్ని రూపొందించాడు. అనుకున్న ప్రకారం ప్రవీణ్, గంగులు కలిసి భిక్షంను తీసుకొని ఆదివారం రాత్రి మద్యం తాగేందుకు గ్రామ సమీపంలోని వేపలవాగు వద్దకు వెళ్లారు. అక్కడ ముగ్గురూ మద్యం తాగారు. భిక్షం మత్తులోకి జారుకున్నాక గంగయ్య, ప్రవీణ్ ఓ రాయితో భిక్షం ముఖం, తలపై కొట్టి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని వాగులో వేశారు. అదే సమయంలో భిక్షం సోదరుడి కుమారుడు నరేంద్ర భిక్షంకు ఫోన్ చేయగా.. ఆ ఫోన్‌ను గంగయ్య ఎత్తాడు. తాము భిక్షంను హత్యచేసి వాగులో పడవేశామని, ఎవరికీ చెప్పొద్దని హెచ్చరించాడు. సోమవారం పోలీసులు చేరుకొని మృతదేహాన్ని వాగులో నుంచి బయటికి తీయించారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

28 నుంచి జిల్లాల్లో బీసీ కమిషన్ పర్యటన

హైదరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టబోయే కులాల గణనపై ఆయా పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు తెలంగాణ బీసీ కమిషన్ ఈనెల 28 నుంచి నవంబరు 8వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాల్లో పర్యటించనుంది. ఈ విషయమై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు సోమవారం కలిశారు. కుల గణనపై ఇప్పటి వరకు జరిగిన కసరత్తును గవర్నర్‌కు ఈ సందర్భంగా వారు వివరించారు. ఆయా కులాల స్థితిగతులపై చేపట్టబోయే సమగ్ర కుటుంబ గణన వివరాలను వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల ద్వారా గణన చేపట్టనున్నట్లు గవర్నర్‌కు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు.



ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

హింసావలయం

సోనేమార్గ్ దగ్గర ఒక భారీ నిర్మాణ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఏడుగురిని ఆదివారం సాయంత్రం మిలిటెంట్లు కాల్చిచంపడంతో జమ్మూకశ్మీర్ 'ప్రశాంతత' మరోసారి భగ్నమైంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న సొరంగమార్గం పనులలో పాల్గొంటున్న సిబ్బందిని లక్ష్యంగా పెట్టుకుని మిలిటెంట్లు కాల్పులు జరిపారు. కశ్మీర్ స్థానికుడైన ఒక వైద్యుడు, పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన ఇంజనీర్లు, కార్మికులు ఆరుగురు ఈ దాడిలో మరణించారు. నిర్మాణంలోని సొరంగమార్గం జమ్మూకశ్మీర్ నుంచి లడఖ్‌కు వెళ్లేమార్గాన్ని సుగమం చేసి, పర్యాటకాభివృద్ధికి దోహదం చేస్తుంది. జమ్మూకశ్మీర్‌కు ఇతర ప్రాంతాల నుంచి కార్మికులు, ఉద్యోగులు రావడాన్ని, వనరులను అన్యాక్రాంతం చేయడానికి అనువైన అభివృద్ధిని చేపట్టడాన్ని కశ్మీరీ తీవ్రవాదులు వ్యతిరేకిస్తున్నారు. లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ఒకటి ఈ కాల్పులకు తమదే బాధ్యత అని ప్రకటించింది. యథావిధిగా దేశ హోంమంత్రి, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ హింసాత్మక దాడిని ఖండించారు. అబ్దుల్లా ప్రమాణస్వీకారం తరువాత ఈ రకం సంఘటన ఇది రెండోది.

జమ్మూకశ్మీర్ ప్రతిపత్తిని నిర్వచించే 370 ఆర్టికల్ నిర్వీర్యంచేసి , కేంద్ర ప్రభుత్వం 2019లో కీలకనిర్ణయం తీసుకున్నది. మిలిటెంట్ సంస్థల సానుభూతిపరులనే కాక, ప్రధాన రాజకీయపార్టీల నేతలను కూడా నిర్బంధంలో ఉంచింది. సాధారణ ప్రజలు ఇటువంటి పరిష్కారాన్నే కోరుకుంటున్నారని, ఫలితంగా లభించే అభివృద్ధిని చూసి సంతోషిస్తారని ప్రభుత్వం చెప్పింది. వేర్పాటు, అధిక అధికారాలు వంటి విషయాలను పక్కనబెడితే, రాజ్యాంగంలోని 370 ఆర్టికల్‌తో పాటు, 35(ఎ) కూడా డొల్లగా మారిపోవడంతో, జమ్మూకశ్మీర్ ప్రజలకు ఉండిన ప్రత్యేక హక్కులు పోయాయి. నివసించే, ఆస్తి కలిగి ఉండే హక్కు రాష్ట్రంలోని స్థానికులకు మాత్రమే ఉండేది. అది వారి వనరులకు, ఉపాధికి గ్యారంటీగా ఉండేది. అధిక ప్రతిపత్తి కలిగి ఉండే రాష్ట్రం స్థాయి నుంచి, కేంద్రానికి అధీనంగా మిగిలే కేంద్రపాలిత ప్రాంతం స్థాయికి, జమ్మూ కశ్మీర్ ప్రభ తగ్గిపోయింది. ప్రజలలో దీనిపై ఉన్న తీవ్ర అసంతృప్తి ఇటీవలి ఎన్నికలలో వ్యక్తమైంది.


స్థానికేతరుల మీద దాడులు రెండు మూడేళ్లుగా జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కొద్దికాలం ఏ సంఘటనా లేకపోయేసరికి, కశ్మీర్ పూర్తి ప్రశాంత స్థితికి వచ్చిందని, తమ విధానాలు ఫలించాయని కేంద్ర ప్రభుత్వం చెప్పుకోసాగింది. సాపేక్ష ప్రశాంతపరిస్థితి ఏర్పడింది కాబట్టి, ఎన్నికలను నిర్వహించగలుగుతున్నామని చెప్పింది. నిజానికి ఎన్నికల నిర్వహణకు తీవ్రవాదుల నుంచి ఆటంకాలు వస్తాయని కేంద్రం భయపడలేదు, ఎన్నికలలో, పూర్తి వ్యతిరేక ఫలితాలు వస్తాయని, కొత్తగా వచ్చే ప్రభుత్వం 370 పునరుద్ధరణ కోరే తీర్మానాన్ని రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెడుతుందేమోనని కేంద్రం అనుమానించింది. అటువంటి ప్రమాదాన్ని నివారించడానికి వీలుగా రాష్ట్ర అసెంబ్లీ నిర్మాణాన్ని, గవర్నర్ అధికారాలను పకడ్బందీగా నిర్వచించింది. ఏ తీర్మానం ప్రవేశపెట్టాలన్నా, రాష్ట్రప్రభుత్వం గవర్నర్ అనుమతి కోరవలసిందే.

తమకు ఉన్న అవకాశాల మేరకు ప్రజలు కేంద్రానికి వ్యతిరేక తీర్పే ఇచ్చారు. అదే సమయంలో, భారతీయ జనతాపార్టీ జమ్మూ ప్రాంతంలో తన ప్రాబల్యాన్ని పెంచుకున్నది. 370 సంగతి పక్కనబెట్టినా, స్థానికులకు వనరులపై, ఉపాధిపై ఉన్న ప్రత్యేక హక్కును పునరుద్ధరించాలని కోరిన పక్షంలో కాంగ్రెస్‌కు జమ్మూలో కొంత ఆదరణ లభించి ఉండేది. కానీ, కాంగ్రెస్ ఆచితూచి, భయంభయంగా కశ్మీర్‌లో పోటీచేసింది. రాజకీయంగా వ్యక్తీకరణకు ఆస్కారం లేకపోయేసరికి, మిలిటెంట్లకు అవకాశం చిక్కుతుంది. స్థానికేతరుల మీద దాడులు గురిపెట్టి వారు తమ ఉనికిని, ఉద్దేశ్యాలను చాటుతున్నారు.

పొట్టకూటి కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చి పనిచేసే నిరుపేద కార్మికులను లక్ష్యం చేసుకుని దాడులు చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. ఉద్యోగులు, నిపుణులు విషయంలో అయినా సరే, తుపాకులు గురిపెట్టడం అమానుషం. ప్రభుత్వ విధానాలకు వారు ఏ విధంగానూ బాధ్యులుకారు. ప్రభుత్వం నిర్మిస్తున్న రహదారి, సొరంగ మార్గాలలో కార్మికులకు వైద్య సేవలందించే ఒక వైద్యుడిని కూడా తీవ్రవాదులు చంపారు. స్థానికుడైన ఆ డాక్టర్ అంత్యక్రియలకు వేలాది మంది హాజరయ్యారు. హతులైన ఇంజనీర్ల భార్యాబిడ్డల రోదనలు హృదయవిదారకంగా ఉన్నాయి.

చిన్న పోలీసు కానిస్టేబుల్‌ను కూడా బదిలీచేసే, నియమించే, తొలగించే అధికారం ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వానికి లేదు. ఆయన ఏ విధంగానూ ఇటువంటి చర్యలను నిరోధించలేరు, అణచివేయలేరు. కానీ, నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం వచ్చిన తరువాత హింస పెరిగిందన్న అపవాదు మాత్రం క్రమంగా పెరిగి పెద్దదవుతుంది. ఏదో ఒక సమయంలో తిరిగి గవర్నర్ పాలనకు సమర్థన పెరుగుతుంది. కశ్మీర్ మౌలిక సమస్యలు, ఆకాంక్షలను పట్టించుకుని, ఏదో ఒక స్థాయి పరిష్కారాన్ని అన్వేషించకపోతే, ఈ హింసా వలయం కొనసాగుతూనే ఉంటుంది.

నోబెల్ గ్రహీతల రాజకీయోపనిషత్తులు!



ప్రవచనాల్లేని యుగం లేదు! ఒక్కో యుగంలో ఒక్కో ప్రవచనం ప్రబలంగా ఉంటుంది. స్వామి భక్తినీ ప్రభు భక్తినీ ప్రదర్శించాలన్న ప్రవచనం మధ్యయుగాల్లో రాజ్యమేలింది. ఎంతో సాహిత్యం దీనిపైనే వచ్చింది. ఆధునిక యుగంలో బాగా ప్రచారమున్న ప్రవచనం ఏదైనా ఉందంటే అది ఆర్థిక వ్యవస్థకు చెందిందే! ఆర్థిక అంశాలను రాజకీయాలకు దూరంగా ఉంచాలన్నదే ఆ ప్రవచనం! ఆర్థిక శాస్త్రానికి ఆద్యుడిగా భావించే ఆడమ్‌స్మిత్ కాలం నుంచీ అది వినిపిస్తున్నా 1990ల్లో బాగా ఊపందుకుంది. రాజకీయాలకు అతీతంగా ఉండే ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో ఎప్పుడైనా, ఎక్కడైనా ఉందా? అని ఎంత శోధించినా లభించే జవాబు ఒక్కటే! అట్లాంటిది ఎక్కడా లేదు. వారం క్రితం ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని పొందిన డారా అసిమొగ్లు, జేమ్స్ ఎ. రాబిన్‌సన్, సైమన్ జాన్సన్ రచనలు చూసినా ఇదే అర్థం అవుతుంది. ఆర్థిక వ్యవస్థపై రాజకీయాల మంచిచెడుల ప్రభావాన్ని వివరించటానికి చేసిన కృషికే ఆ ముగ్గురికీ నోబెల్ వచ్చింది.

ఇంతకీ రాజకీయాల్లో మంచేమిటి? చెడేమిటి? ఈ రెంటికీ వివిధ దేశాల మధ్య నెలకొన్న అసమానతలకు సంబంధం ఏమిటి? కొన్ని దేశాలు అద్భుతమైన ప్రగతిని ఎందుకు సాధించాయి? మరికొన్ని అట్టడుగున ఎందుకున్నాయి? కారణాలేమిటి? ఆ దేశాలకున్న వనరుల్లో ఉన్న తేడానా? లేక అత్యుత్తమ ఆర్థిక విధానాలను అర్థం చేసుకుని చేపట్టటంలో నాయకుల వైఫల్యమా? కొన్ని దేశాల్లో వంద లేళ్ల పాతుకుపోయిన సంప్రదాయ సంస్కృతి సాహసోపేత అడుగులు వేయకుండా ప్రజల చొరవను నీరుగారుస్తోందా? ఈ మూడు ప్రశ్నలకు జవాబులిస్తూ.. ఆర్థిక ప్రగతికి తోడ్పడే రాజకీయాలను, సంస్థాగత ఏర్పాట్లను వివరిస్తూ 12 ఏళ్ల క్రితం "వై నేషన్స్ ఫేల్" అనే పుస్తకాన్ని డారా అసిమొగ్లు, జేమ్స్ ఎ. రాబిన్‌సన్ రాశారు.

సంపన్న దేశాలు ఇప్పుడు 30 దాకా కనపడతాయి. వీటిలో యూరప్, ఉత్తర అమెరికాలో ఉన్నవే ఎక్కువ. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, తైవాన్‌లు కూడా ఈ జాబితాకు చెందినవే. ఇక అట్టడుగున ఉన్న 30 దేశాల జాబితాను పరిశీలిస్తే అవన్నీ చాలా మేరకు సబ్-సహారా ఆఫ్రికాలోనే కనపడతాయి. వీటికి అఫ్ఘనిస్థాన్, హైతీ, నేపాల్ లాంటి దేశాలు కూడా కలపొచ్చు. 50 ఏళ్ల వెనక్కి వెళ్లినా జాబితాలో కొన్ని మార్పులే కనపడతాయి. సింగపూర్, దక్షిణ కొరియా లాంటి కొన్ని దేశాలు 50 ఏళ్లలో ధనిక దేశాల జాబితాలో చేరాయి. అలాగే పేద దేశాల జాబితాలో ఆనాడు వేరేవి కొన్ని ఉండేవి. ఇవి మినహా 100–150 ఏళ్ల వెనక్కి వెళ్లినా జాబితాలో స్వల్పమార్పులే కనపడతాయి! 2008 నాటికి పేద దేశాల సగటు తలసరి వార్షిక ఆదాయం 2000 డాలర్లు కాగా ధనిక దేశాల ఆదాయం 20000 డాలర్లు. అమెరికా ఖండంలో యూఎస్‌ఏ, కెనడాలు ఆదాయపరంగా పైభాగాన ఉంటే చిలీ, అర్జెంటీనా, బ్రెజిల్, మెక్సికో, ఉరుగ్వే, వెనెజులా తర్వాతి స్థానంలో నిలిచాయి. మూడో స్థానంలో కొలంబియా, డొమినికన్ రిపబ్లిక్, ఈక్వెడార్, పెరూ ఉంటే అట్టడుగున బొలీవియ, గ్వాటమాల, పరాగ్వేలు నిలిచాయి. ఈ ఖండంలో సైతం 50 నుంచి 150 ఏళ్లు వెనక్కి వెళ్లినా దేశాల మధ్య పరిస్థితిలో పెద్ద మార్పు కనపడదు. సౌదీ అరేబియా, కువైత్ లాంటి చమురు ఆధారిత మధ్య ప్రాచ్య దేశాల్లో తలసరి ఆదాయం ధనిక దేశాలకు కాస్త అటుఇటుగానే ఉంటుంది. కానీ చమురు ధరల్లో తేడా వస్తే వాటి ఆదాయం పడిపోతుంది. మధ్య ప్రాచ్యంలో చమురు నిల్వలు పెద్దగా లేని దేశాలైన ఈజిప్టు, జోర్డాన్, సిరియాల ఆదాయం పెరూ, గ్వాటిమాలకు సమానంగానే ఉంటుంది.

> ఎన్నికల్లో వేలకోట్లు వెదజల్లే రాజకీయ సంస్కృతి, అడుగడుగునా పైరవీలు, అన్నిస్థాయిల్లో లంచాలు, పాలక పార్టీలకు అధికారులకు తోకల్లా మారటం, ప్రజా జీవితంలో నైతికతకు ప్రాధాన్యం ఇవ్వని మత సంస్కృతి, సంకుచిత తత్వాన్ని ప్రోత్సహించే కులభావాలు.. ప్రబలంగా ఉన్నంత వరకూ అసలైన అభివృద్ధికి మనం చాలా దూరంలో ఉండిపోతాం. దేశాల మధ్యా, దేశాల లోపలా అసమానతలకు మూలం రాజకీయ విధానాలు, వ్యవస్థల్లో ఉందన్న విశ్లేషణ.. నిజమైన ప్రజాస్వామ్య పాలన కోసం ఉద్యమించే వారికి కొంతైనా తోడ్పడతాయి! అంతమేరకు నోబెల్ గ్రహీతల సూత్రీకరణలు విలువైనవే!

పారిశ్రామిక విప్లవం ఆరంభం నాటి నుంచి చూస్తే వివిధ దేశాల మధ్య సంపద, ఆదాయాల్లో తేడాలు కొద్ది మార్పులతో కొనసాగుతున్నట్లే కనపడుతుంది. ఆ విప్లవానికి ముందు దేశాల మధ్య ఇంత తేడాల్లేవు. ఇక్కడ నాలుగు ప్రశ్నలు తలెత్తుతాయి. ఒకటి.. పారిశ్రామిక విప్లవం తర్వాత పాశ్చాత్య దేశాలు (అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సహా) ఎందుకు వెనుకంజ వేయలేదు? రెండు.. అమెరికా ఖండంలో దేశాల మధ్య అసమానతలు ఇంకా ఎందుకు కొనసాగుతున్నాయి. మూడు.. సబ్-సహారా, మధ్యప్రాచ్య దేశాలు పాశ్చాత్య దేశాల వేగాన్ని ఎందుకు అందుకోలేకపోయాయి. నాలుగు.. తూర్పు ఆసియా దేశాలు ఆర్థికంగా ఎందుకు పురోగమించాయి.


■ రాహుల్ కుమార్

ఈ ప్రశ్నలకు సామాజిక శాస్త్రవేత్తల వివరణలు పరిశీలిస్తే అందులో ముఖ్యమైనవి మూడే కనపడతాయి. లోతుగా చూస్తే అవేవి సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వవు. భౌగోళిక పరిస్థితులకు పెద్దపీట వేస్తూ అందించిన వివరణను మొదటిదిగా చెప్పుకోవచ్చు. దక్షిణాసియా, ఆఫ్రికా, మధ్య అమెరికాలోని పేద దేశాలన్నీ ఉష్ణమండల ప్రాంతంలోనూ ధనిక దేశాలన్నీ సమశీతోష్ణ ప్రాంతాలలోనూ ఉన్నాయనీ అసమానతలకు ఈ భౌగోళిక తేడాలనే కారణాలుగా చెప్పే వాదన 18వ శతాబ్దంలో ఫ్రెంచ్ రాజకీయ శాస్త్రవేత్త మాంటెస్క్యూతో మొదలైంది. ఉష్ణమండలాల ప్రజలు స్తబ్దులు.. సోమరులు.. కొత్త విషయాలపై కుతూహలం ఉండదు... నియంతల పాలన కింద కొనసాగుతారు... ఇలా చాలానే ఆ ప్రాంత ప్రజల స్వాభావిక లక్షణాలుగా చెప్పారు. సోమరితనం నుంచి దారిద్ర్యం, కుతూహల లోపంతో విజ్ఞానాల్లో వెనుకబడటం... ఫలితంగా సంపద సృష్టిలో అట్టడుగున ఉండటం... ఉష్ణమండల దేశాలకు సహజం అన్నట్లుగా సూత్రీకరించారు. మాంటెస్క్యూనే కాదు జెఫ్రీసాక్స్ లాంటి కొందరు సమకాలీన ఆర్థికవేత్తలదీ ఇదే ధోరణి. వాతావరణం ఆలోచనలు, పనితీరును ప్రభావితం చేస్తుందని చెప్పటమే కాదు.. ప్రజల ఆరోగ్యం, వ్యవసాయ ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావాన్ని చూపిందనీ వాదించారు. ఈ వివరణ సమర్థనీయం కాదని చెప్పటానికి ఇటీవల పరిణామాలనే పేర్కొనొచ్చు. ఇప్పటి దక్షిణ–ఉత్తర కొరియాలను, ఒకనాటి తూర్పు–పశ్చిమ జర్మనీలను పరిశీలిస్తే అభివృద్ధిలో తేడాలకు భౌగోళిక అంశాలు కారణాలు కాదని తేలికగానే తెలుస్తుంది. ఆ దేశాల్లోని వేర్వేరు రాజకీయ వ్యవస్థలు అభివృద్ధి స్థాయిని విపరీతంగా ప్రభావితం చేశాయి. అలాగే ఉత్తర–దక్షిణ అమెరికా, యూరపు–ఆఫ్రికాల మధ్య తేడాలను భౌగోళిక అంశాల ప్రాతిపదికనే వివరించలేం. చరిత్రలోకి చూస్తే ఉష్ణమండల దేశాలు ఎల్లకాలం పేద దేశాలుగా లేవు. ఉత్తర అమెరికా కంటే ఒకనాడు (500 ఏళ్ల క్రితం) మెక్సికో, మధ్య అమెరికా, పెరు, బొలివియా దేశాలే ఆర్థికంగా పైస్థాయిలో ఉండేవి. అజ్‌టెక్, ఇన్కా నాగరికతలు అక్కడే విలసిల్లాయి. చైనా, భారత్‌లు గొప్ప ప్రాచీన నాగరికతలకు నిలయాలు. ఉష్ణమండలాలు వ్యాధులకు నిలయాలనీ, ఇక్కడి నేలలు పోషకాలను నిలుపుకోలేవన్న వాదనలు కూడా పరిశీలనలకు నిలబడవు. ప్రభుత్వాలు చేపట్టే ప్రజారోగ్య పరిరక్షణ చర్యలతో చాలా దేశాల్లో అనేక వ్యాధులు అదుపులోకి వచ్చాయి. ఆ చర్యలు చేపట్టక ముందు బ్రిటన్ కూడా ఒకప్పుడు చాలా అనారోగ్యకరంగా ఉండేది.

సంస్కృతికీ సంపద సృష్టికీ సంబంధం ఉందనే వాదన జర్మన్ సామాజిక శాస్త్రవేత్త మాక్స్ వెబర్ చాలా ప్రాచుర్యంలోకి తెచ్చారు. క్యాథలిక్ చర్చి వ్యవస్థలో సంస్కరణలు కోరుతూ 16వ శతాబ్దంలో మొదలైన మత ఉద్యమం (ప్రొటెస్టంట్ రెఫమేషన్) నైతికవర్తనకు దారితీసిందనీ అది చివరికి పశ్చిమ యూరపులో పారిశ్రామిక సమాజం పురోగమించటానికి కారణమైందనీ వెబర్ సూత్రీకరించారు. 'కష్టం చేస్తే దేవుడు ఆశీర్వదిస్తాడు.. సంపాదనతో పాటు పొదుపు కూడా చేయాలి... సమయపాలనతో కచ్చితంగా పనిచేయాలి'... ఈ మూడు బోధనలు ప్రొటెస్టంట్ నైతికతలో ప్రధానమైనవిగా చెబుతారు. పెట్టుబడిదారులు ప్రధాన పాత్ర వహించే ఆర్థిక వ్యవస్థకు ఇవి ప్రాణప్రదమైనవి. అయినా ప్రొటెస్టంట్ మతం ఉన్నచోటల్లా ఈ బోధనలు అభివృద్ధికి దారితీశాయని చెప్పలేం. ఈ మతమే ప్రధానంగా ఉన్న తూర్పు, పశ్చిమ జర్మనీల మధ్య ఒకనాటి ఆర్థికపరమైన తేడాలే ఇందుకు నిదర్శనం. అభివృద్ధిలో ఆ రెండిటి మధ్య చాలా అంతరం ఉండేది. రెండు దేశాల్లో విభిన్నంగా ఉన్న రాజకీయ సంస్థలు, విధానాలు, ఎన్నికలు– పాలనా పద్ధతులు, పౌరహక్కులు, న్యాయవ్యవస్థ లాంటివి ఆర్థికాభివృద్ధిపై ఎంతో ప్రభావాన్ని చూపించాయి. చైనా సంస్కృతి, కన్ఫ్యూషన్ విలువలను ఒకనాడు ఆర్థిక ప్రగతికి అడ్డంకిగా భావించేవారు. కానీ ఆ ప్రభావం ఉన్న దేశాలు కూడా ఆర్థిక ప్రగతిలో ముందుకు వెళుతున్నాయి. ఫ్రాన్స్ క్యాథలిక్ దేశమైనా ప్రగతికి అది అడ్డంకి కాలేదు.

పేద దేశాల విధానకర్తలు, ఆర్థికవేత్తలు అవగాహన లేమితో సరైన విధానాలను అనుసరించకపోవటం వల్లే అభివృద్ధిలో వైఫల్యం చెందుతున్నారన్న సూత్రీకరణ కూడా విశ్లేషణకు నిలబడదు. వెనుకబడిన ఏ దేశాన్ని తీసుకున్నా అక్కడ అవగాహనా లోపం కంటే అప్పటికే ఆర్థికంగా ఆధిపత్యం ఉన్న వర్గాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉద్దేశపూర్వకంగానే సరైన విధానాలు చేపట్టలేదనేది స్పష్టమవుతుంది. లాటిన్ అమెరికా దేశాల్లో ఇది స్పష్టంగా కనపడుతుంది. భారత్‌లో భూసంస్కరణల విషయంలోనూ దీన్నే చూడొచ్చు.

రాజకీయ విధానాలు, సంస్థలు కల్పించే అవకాశాలు, అడ్డంకులను పక్కనపెట్టి ఆర్థిక అసమానతలను అర్థం చేసుకోలేం. రాజకీయ విధానాల్లోనే విషయమంతా ఉంది. సమన్యాయ పాలనలో లోపాలు, ఆశ్రిత పక్షపాతాలు, మార్కెట్‌లో గుత్తాధిపత్యాలు, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణలో వైఫల్యాలు, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు పగ్గాలు, విద్యావ్యాప్తికి అవరోధాలు, కొత్త ఆవిష్కరణలు చేసే వారికి కొరవడే ప్రోత్సాహకాలు, వ్యక్తుల చొరవకు అడ్డంకులు.. వీటన్నిటినీ అసిమొగ్లు బృందం అభివృద్ధికి నిరోధకాలుగా పేర్కొంది. వీటి కోణం నుంచి చూస్తే భారత్ ప్రయాణం అస్తవ్యస్తంగానే కనపడుతుంది. ఎన్నికల్లో వేలకోట్లు వెదజల్లే రాజకీయ సంస్కృతి, అడుగడుగునా పైరవీలు, అన్నిస్థాయిల్లో లంచాలు, పాలక పార్టీలకు అధికారులకు తోకల్లా మారటం, ప్రజా జీవితంలో నైతికతకు ప్రాధాన్యం ఇవ్వని మత సంస్కృతి, సంకుచిత తత్వాన్ని ప్రోత్సహించే కులభావాలు.. ప్రబలంగా ఉన్నంత వరకూ అసలైన అభివృద్ధికి మనం చాలా దూరంలో ఉండిపోతాం. దేశాల మధ్యా, దేశాల లోపలా అసమానతలకు మూలం రాజకీయ విధానాలు, వ్యవస్థల్లో ఉందన్న విశ్లేషణ.. నిజమైన ప్రజాస్వామ్య పాలన కోసం ఉద్యమించే వారికి కొంతైనా తోడ్పడతాయి! అంత మేరకు నోబెల్ గ్రహీతల సూత్రీకరణలు విలువైనవే!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడడానికే ఈ యుద్ధోన్మాదం!

ప్రపంచం అల్లకల్లోలంగా ఉంది. అమెరికా సామ్రాజ్యవాదుల నేతృత్వంలో పాశ్చాత్య సామ్రాజ్యవాదులు బరితెగించి ఫాసిస్టు శక్తులను ఎగదోసి ప్రపంచ యుద్ధానికి కాలు దువ్వుతున్నారు. ప్రపంచ యుద్ధ కారుమేఘాలు దట్టంగా అలముకున్నాయి. సామ్రాజ్యవాదులు ప్రపంచ యుద్ధం ద్వారానే తీవ్రతరమవుతున్న ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలనీ ఉవ్విళ్లూరుతున్నారు. ప్రాంతీయ యుద్ధాలను రావణకాష్ఠంలా మండిస్తూ ప్రపంచ శాంతి సుస్థిరతలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నారు.

1991లో సోవియట్ యూనియన్ కూలిపోయి, సామ్రాజ్యవాదంలో సాపేక్షిక స్థిరత్వం ఏర్పడడం వల్ల గ్లోబలైజేషన్ ఒక ముఖ్య పరిణామంగా ముందుకొచ్చింది. సామ్రాజ్య వాదానికి సంబంధించి ఒక రూపమే ప్రపంచీకరణ. రష్యా, చైనా వైఫల్యాల కారణంగా సామ్రాజ్యవాదులు తమకు అనుకూలంగా ఏర్పడిన పరిస్థితులను ఉపయోగించుకుని ఆర్థిక కార్యకలాపాలను విస్తరించుకుంటూనే నయా ఉదారవాద విధానాల ముసుగులో వెనుకబడిన దేశాల మీద, అక్కడి ప్రజల మీద పాశవికమైన దాడులు చేశారు. ఇరాక్, అఫ్ఘానిస్తాన్, లిబియా, యుగొస్లావియా దేశాల మీద యుద్ధాలు ప్రకటించారు. మూడవ ప్రపంచ దేశాధినేతల నివాస భవనాల మీదనే బాంబుల వర్షం కురిపించి, వాటిని ధ్వంసం చేసి వాళ్లను లొంగదీసుకోవాలని, ఆ నాయకులను తరిమి కొట్టి, నిర్బంధించి, ఉరితీయడం వంటి దమనకాండలను కొనసాగించారు. కానీ ఈ దురాక్రమణ చర్యలేవీ వారిని సంక్షోభ సుడిగుండం నుంచి కాపాడలేకపోయాయి. ప్రపంచ ఆర్థిక పరిస్థితి క్రమక్రమంగా మారుతూ వస్తోంది. 2008లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మొదలైన మాంద్యం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. దాని నుంచి ఇంపీరియలిజం బయటపడలేకపోవడం, సంక్షోభం రోజురోజుకూ విస్తరిస్తున్న పరిస్థితుల పూర్వరంగంలో మూడవ ప్రపంచ యుద్ధం సంభవించే దిశలో పరిణామాలు జరుగుతున్నాయి. అదే ప్రస్తుత పరిస్థితికి సంబంధించిన ప్రధాన లక్షణం.



> ప్రపంచవ్యాప్తంగా ప్రజలు నయా ఉదారవాద విధానాలను తిప్పికొడుతూ పోరాటాలలో సమైక్యమవుతున్నారు. ఈ పరిణామాలన్నీ అమెరికా, యుకె, యూరప్ పాశ్చాత్య సామ్రాజ్యవాదుల ప్రపంచాధిపత్యానికి తీవ్ర అవరోధంగా తయారయ్యాయి. ప్రపంచ శాంతి, సుస్థిరత, సామాజిక న్యాయం, సోషలిజం లక్ష్యాలుగా పెంపొందుతున్న ఈ ఉద్యమాలను నిర్మూలించాలనే పథకంలో భాగంగానే నేడు సామ్రాజ్యవాదులు ప్రపంచ యుద్ధ సన్నాహాలను ముమ్మరం చేస్తున్నారు.

సోవియట్ యూనియన్‌ను విచ్ఛిన్నం చేయడమే గాక ఆ యూనియన్‌లోని పలు దేశాలను నాటో మిలిటరీ కూటమిలో చేర్చుకుని రష్యా ఆర్థిక వనరులను కొల్లగొట్టడానికి వీలుగా దానిని పాదాక్రాంతం చేసుకోవడం కోసం అమెరికన్ సామ్రాజ్యవాదులు ఉక్రెయిన్‌లో అక్రమంగా ఫాసిస్టు రాజ్యాన్నే నెలకొల్పి, రష్యాపై పాశవిక దురాక్రమణకు పాల్పడ్డారు. రెండు సంవత్సరాలకు పైగా అక్కడ భీకర యుద్ధం కొనసాగుతూనే ఉంది. అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ ఫాసిస్టు పాలకులు గత పది నెలలుగా గాజాలో కొనసాగిస్తున్న హత్యాకాండలో నలభై వేల మంది పాలస్తీనా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అత్యధికులు నిరాయుధులైన స్త్రీలు, పిల్లలే. యుద్ధ బాధితులకు అండగా నిలిచిన ఐరాస స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలను కూడా పెద్దయెత్తున మట్టుబెట్టడం కనీవినీ ఎరుగనిది. ఇరాన్‌పై ప్రత్యక్షంగా క్షిపణులతో దాడులు చేస్తూ అది యుద్ధానికి తలపడేలా కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదులు చైనాను చుట్టుముట్టి దెబ్బతీయాలని శతవిధాల ప్రయత్నిస్తున్నారు. మిత్ర దేశాలతో సైనిక ఒప్పందాలు చేసుకుని అనేక సైనిక స్థావరాలను నెలకొల్పి విధ్వంసకరమైన మారణాయుధాలు పోగు చేసుకుని టెర్రరిస్టులుగా పేరొందిన ఫాసిస్టు గ్యాంగులను పెంచి పోషిస్తున్నారు. వెనుకబడిన దేశాలను తమ నయా వలసలుగా మార్చుకుని దోపిడీ పీడనలను నిరాటంకంగా కొనసాగించాలనేది వారి వ్యూహం.

అమెరికా యుద్ధోన్మాద చర్యలన్నీ కదిలిపోతున్న తమ ఏక ధృవ ప్రపంచ ప్రాబల్యాన్ని కాపాడుకోవడానికే ఉద్దేశించినవి. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా గణనీయంగా వృద్ధి చెందింది. పాశ్చాత్య దేశాలకు దీటుగా చైనా బలమైన ఆర్థిక శక్తిగా పెంపొందింది. లాటిన్ అమెరికా దేశాలలో వామపక్ష శక్తుల విజయపరంపర కొనసాగుతోంది. మాలి, బుర్కినాఫాసో, నైజర్ మొదలైన ఆఫ్రికా దేశాలలో స్వాతంత్ర్య పోరాటాలు బలోపేతమవుతున్నాయి. రష్యాపై ఆంక్షలు విధించి దానిని ఆర్థికంగా కృంగదీయాలనే ప్రయత్నాలు విఫలమయ్యాయి. యూరప్ ప్రజలు తమ జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవడం కోసం పెద్దయెత్తున సంఘటితపడి వీధుల్లోకి వచ్చి పోరాడుతున్నారు. భారత ప్రజానీకం హిందుత్వ ఫాసిస్టు పాలకుల విధానాలను ప్రతిఘటిస్తున్నారు. చైనా, క్యూబా, వియత్నాం, ఉత్తర కొరియా దేశాలలో ప్రజలు సోషలిస్టు లక్ష్యాలకు పునరంకితమవుతున్నారు. ఒక్క దేశమేమిటి, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు నయా ఉదారవాద విధానాలను తిప్పికొడుతూ పోరాటాలలో సమైక్యమవుతున్నారు. ఈ పరిణామాలన్నీ అమెరికా, యుకె, యూరప్ పాశ్చాత్య సామ్రాజ్యవాదుల ప్రపంచాధిపత్యానికి తీవ్ర అవరోధంగా తయారయ్యాయి. ప్రపంచ శాంతి, సుస్థిరత, సామాజిక న్యాయం, సోషలిజం లక్ష్యాలుగా పెంపొందుతున్న ఈ ఉద్యమాలను నిర్మూలించాలనే పథకంలో భాగంగానే నేడు సామ్రాజ్యవాదులు ప్రపంచ యుద్ధ సన్నాహాలను ముమ్మరం చేస్తున్నారు.

సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం. సామ్రాజ్యవాదం ఉన్నంతవరకు ప్రపంచ యుద్ధ ప్రమాదాలు సమసిపోవు. రెండవ ప్రపంచ యుద్ధం ముందు కాలం నాటి పరిస్థితులు నేడు పునరావృతమవుతున్నాయి. గత సంవత్సరం రోమ్ నగరంలో 40 దేశాల కమ్యూనిస్టు నాయకులు, వర్కర్స్ పార్టీల ప్రతినిధులు సమావేశమై ప్రపంచ ప్రజలు సమైక్యంగా ఫాసిస్టు శక్తులను ఓడించాలనీ పిలుపునివ్వడం గమనించదగిన పరిణామం. హిట్లర్ నాజీ సైన్యాలను మట్టికరిపించిన సోవియట్ ప్రజల త్యాగాన్నీ, సాహసాన్నీ స్ఫూర్తిగా తీసుకుని ప్రపంచ కార్మికులు, కమ్యూనిస్టులు, ప్రజాస్వామికవాదులు, అభ్యుదయకాముకులు, వామపక్షీయులు సంఘటితమై మూడవ ప్రపంచ యుద్ధ ప్రమాదాన్ని నివారించడానికి ముందుకు రావాలి. అందుకు అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటన ఏర్పాటు బాటలు వేస్తుంది. ఇంపీరియలిస్టు మిలిటరిజాన్నీ, నయా ఫాసిజాన్నీ, నయా వలసవాదుల యుద్ధోన్మాదాన్నీ నిరసిస్తూ కలిసివచ్చే శక్తులన్నింటినీ కలుపుకుని కమ్యూనిస్టులు అగ్రభాగాన నిలిచి పోరాడినపుడే విస్తృత ప్రజా ఐక్యసంఘటన సుసాధ్యమవుతుంది.

• డాక్టర్ శ్రీనివాస్
కె.ఎస్. మెమోరియల్ కమిటీ

సోమసుందర్ శతజయంతి సదస్సు

సాహిత్య అకాడమీ – క్రియ సొసైటీ, కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఆవంత్స సోమసుందర్ శత జయంత్యుత్సవ సదస్సు అక్టోబర్ 26 ఉదయం 10 గంటల నుంచి గాంధీ భవన్, కాకినాడలో జరుగుతుంది. ప్రారంభ సమావేశంలో అధ్యక్షోపన్యాసం సి. మృణాళిని; ముఖ్య అతిథి చందు సుబ్బారావు; గౌరవ అతిథులు కె. వెంకట్రావు, ఎర్రమిల్లి ఉషాకుమారి; కీలకోపన్యాసం నందిని సిధారెడ్డి, వందన సమర్పణ ఎస్.ఎస్.ఆర్ జగన్నాథరావు. జి. సీతా రామస్వామి అధ్యక్షత వహించే మొదటి సమావేశంలో వక్తలు– ఎస్. ఈశ్వరరెడ్డి, బొల్లోజు బాబా, వాడ్రేవు వీరలక్ష్మీ దేవి. వాడ్రేవు వీరలక్ష్మీదేవి అధ్యక్షత వహించే రెండవ సమావేశంలో వక్తలు– కస్తూరి నాగమురళి శంకర్, నందూరి రాజగోపాల్, ఆర్. సీతారామారావు. మేకా మన్మథరావు అధ్యక్షత వహించే ముగింపు సమావేశంలో ముగింపు సందేశం శిఖామణి.

– సాహిత్య అకాడమీ

సవరణ: ఆంధ్రజ్యోతి సాహిత్య పేజీ వివిధ నిన్నటి సంచికలో (21.10.2024) జి.ఎస్. సాయిబాబా ఇంగ్లీష్ కవితకు శివప్రసాద్ తెలుగు అనువాదాన్ని అచ్చు వేశాం. కానీ అచ్చులో సాయిబాబా పేరు రాలేదు. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం. – ఎడిటర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ప్రజాపాలనలో రేవంత్ విప్లవం

> ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన మొదలుపెట్టి కేవలం 300 రోజులలోనే అద్భుతాలు చేస్తున్నారు. అటు అభివృద్ధి–ఇటు సంక్షేమం, సంస్కరణలు, భారీ మార్పులు, ఉద్యోగాల కల్పన, ఎన్నికల ముందు పార్టీ ఇచ్చిన హామీల అమలు, ప్రతిపక్షాల రాజకీయ అవాంతరాలను అధిగమించి, తాను అనుకున్న లక్ష్య సాధన దిశగా దూసుకుపోతున్నారు.



మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలి అని టీపీసీసీ అధ్యక్షులుగా పిలుపునిచ్చిన రేవంత్‌రెడ్డి మాటను విశ్వసించి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి నీరాజనం పలికారు. డిసెంబర్ 7న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన, గత 300 రోజులుగా పాలనపై తనదైన ముద్ర వేస్తూ, విరామమెరుగక పరిశ్రమిస్తూ, తన లక్ష్యాలకు అనుగుణంగా పాలనలో మార్పులు తెస్తూ... ప్రజాపాలనలో ఒక విప్లవకారుడిలా దూసుకుపోతున్నారు.

ఒకటి కాదు రెండు కాదు రోజుకొక కొత్త ఆలోచన.. రోజుకొక కొత్త పథకం.. తెలంగాణలో అత్యంత ప్రాధాన్యం గల నిరుద్యోగ సమస్య ఎలా పరిష్కరించాలి, నాణ్యమైన విద్యను ఎలా అందించాలి, మెరుగైన వైద్యాన్ని ప్రజలకు ఎలా అందుబాటులోకి తేవాలి, ప్రజా సంక్షేమం–రాష్ట్ర అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు చేయాలి, రాష్ట్రాన్ని ఆర్థికంగా ఎలా పరిపుష్టి చెయ్యాలి... ఇలా అన్ని రంగాల అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని రేవంత్‌రెడ్డి ఒక విప్లవకారుడిలా దూసుకుపోతున్నారు. తెలంగాణను మూడు ప్రాంతాలుగా విభజించి ఔటర్ రింగ్ రోడ్డు లోపల అర్బన్ తెలంగాణగా, రీజనల్ రింగ్ రోడ్డు లోపల సబ్ అర్బన్ తెలంగాణగా, రీజనల్ రింగ్ రోడ్ అవతల రూరల్ తెలంగాణగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు చేస్తున్నారు.

విప్లవం అంటే లక్ష్యసాధన వైపు వేగంగా వచ్చే మార్పు. అలాంటి మార్పు కోసం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయోగాలు, వేస్తున్న ప్రణాళికలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేసరికి ఖజానా ఖాళీ.. పార్టీ ఇచ్చిన హామీలు చాలా ఉన్నాయి. రేవంత్‌రెడ్డి స్వతహాగా ఒక గొప్ప వ్యూహకర్త. తనకంటూ కొన్ని ఆలోచనలున్నాయి. ఒక పెద్ద మార్పు తేవాలి.. అందుకు తన ప్రయత్నాల్లో ఎక్కడా ఆలస్యం ఉండొద్దు.. ఒక్క పొరపాటు ఉండొద్దు.. ఫైనల్‌గా రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి కావాలి, ప్రజలకు అన్ని సంక్షేమ కార్యక్రమాలు అందాలి. అదే ధ్యాస, అదే శ్వాసగా రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారు.

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తూనే ప్రగతి భవన్ ఇనుప కంచెలను కూల్చేశారు. నియంత కోటగోడలను బద్దలు కొట్టి ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చేశారు. ప్రజాపాలన అనే నామకరణంతో తొలి రోజునే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం పెట్టి, అధికారులను కేటాయించి, ప్రజల ముంగిటకు పాలన తెచ్చి... తన లక్ష్యం దిశగా అడుగులు వేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలోనే ఒక వికలాంగురాలికి తాను ఎప్పుడో ఇచ్చిన హామీని గుర్తుపెట్టుకొని ఉద్యోగం ఇచ్చారు. అలా మొదలైన ప్రజాపాలన గత 300 రోజుల నుంచి నిరంతరం ఆ లక్ష్యం దిశగా అడుగులు వేస్తోంది. అసెంబ్లీ సమావేశాల్లో ప్రధాన ప్రతిపక్ష నేత, ముఖ్యమంత్రిగా అనుభవమున్న కేసీఆర్ సభకు రావాలని విజ్ఞప్తి చేసారు. భేషజాలు లేవు కలిసికట్టుగా పని చేద్దామని ప్రకటించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కేవలం ఓట్ల కోసం కాదని, అవి ప్రజలకు ఇచ్చిన హామీలు కాదు నమ్మకాలు అని రేవంత్‌రెడ్డి ప్రబలంగా నమ్ముతూ ఎవ్వరు అడగక ముందే హామీల అమలుకు శ్రీకారం చుట్టారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని వెంటనే అమలులోకి తెచ్చారు. 5 లక్షల వరకు ఉన్న ఆరోగ్యశ్రీ వైద్య సౌకర్యాన్ని 10 లక్షల రూపాయలకు పెంచారు. 200 యూనిట్ల వరకు ఉన్న ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని వెంటనే అమలు చేశారు. 500 రూపాయలకే దేశంలో ఎక్కడా లేని విధంగా వంటగ్యాస్ సౌకర్యం కలిగించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తుంటే నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసి మోడల్ హౌస్‌లను కూడా ఆవిష్కరించారు. ఇందిరమ్మ కమిటీలకు గైడ్‌లైన్స్ ఇచ్చారు.

ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌లో మరో అభివృద్ధి కేంద్రం ఏర్పాటు కోసం ఇటీవల విదేశీ పర్యటనలో భారీగా పెట్టుబడులు ఆకర్షించి వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు పూనుకున్నారు. ఇటు హయత్‌నగర్, అటు పటాన్‌చెరు, అలాగే పాతబస్తీ మీదుగా శంషాబాద్ వరకు మెట్రో విస్తరణతో హైదరాబాద్‌ను మరింత ప్రతిష్ఠాత్మకంగా మార్చే ప్రణాళికలు సిద్ధం చేశారు.

అన్నింటినీ మించి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఫ్యామిలీ డిజిటల్ కార్డ్స్, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ పాలసీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, హ్యాండ్లూమ్ టెక్నాలజీ యూనివర్సిటీ లాంటి కార్యక్రమాలు గొప్ప ఆలోచనలు. పట్టుదల, మంచి చేయాలన్న తలంపు ఉంటే ఏదైనా చేయొచ్చు అని రేవంత్‌రెడ్డి నిరూపించారు. కేసీఆర్ సీఎంగా 3,500 రోజులలో చేయలేని అనేక పనులను కేవలం 300 రోజులలో రేవంత్‌రెడ్డి చేసి చూపిస్తున్నారు. రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఏకకాలంలో చేసి, 18 వేల కోట్ల రూపాయలు రైతులకు బ్యాంకుల్లో వేయడంతో పాటు, మళ్ళీ రైతులకు రెండు లక్షల రూపాయలు వ్యవసాయ ఋణంగా ఇప్పించి, దేశంలోనే ఆదర్శంగా నిలిచారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు విద్యారంగంలో ఒక అద్భుతమైన కార్యక్రమం, ఒక విద్యారంగ విప్లవం. అలాగే నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ఒక్క ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాకుండా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా వారిని ఉపాధి రంగం వైపు, ప్రైవేట్ ఉద్యోగాల కల్పన అవకాశాలు కల్పించే ప్రక్రియ ఏర్పాటు చేశారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటులో భాగంగా ప్రధానంగా నగరం ఒక వైపే కాకుండా అన్ని వైపులా విస్తరించాలి, ట్రాఫిక్ సమస్య నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలనే వ్యూహంతో ముందుకు పోతున్నారు. అందుకోసం విదేశాలలో పెట్టుబడుల సభలకు వెళ్లి బడా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి, ఇప్పటికే దాదాపు 86 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేలా పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకున్నారు.

చెరువులు, కాలువలు పరిరక్షించాలని, ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్న బాధ్యతతో హైడ్రా ఏర్పాటు చేశారు. భారీ వరదలు వచ్చినపుడు హైదరాబాద్ నగరం అల్లాడిపోకుండా భవిష్యత్ తరాలు భద్రతతో ఉండే విధంగా గొప్ప కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. మూసి నదీ ప్రక్షాళన కార్యక్రమం ఒక గొప్ప ముందడుగు. అక్కడ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తూ, వారిని తరలించి మూసీ పరివాహక ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా హైదరాబాద్‌ను ఒక సురక్షిత, సుందర నగరంగా చేయవచ్చునని ప్రణాళిక చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి'తో లక్షలాది ఎకరాల భూమి అనేక సమస్యలతో గందరగోళ పరిస్థితుల్లో పడిపోయింది. అనేక అవకతవకలు జరిగాయి. దీంతో ధరణి సమస్యల పరిష్కారానికి ఒక మంత్రివర్గ కమిటీ, అధికారుల కమిటీ వేసి గ్రామసభల ద్వారా వెంటనే భూమి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారం దిశగా 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల నియామక పత్రాలు ఇవ్వడంతో పాటు డీఎస్సీ పరీక్షలు నిర్వహించి 11 వేలకు పైగా మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చారు. ఈ పది నెలల కాలంలో దాదాపు 40 వేల మంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగస్తులయ్యారు అంటే రేవంత్‌రెడ్డి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎంతగా కృషి చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

ఇక ఎంతో కాలంగా పెండింగ్ ఉన్న ఎస్సీ a b c d వర్గీకరణ విషయంలో ఒక పెద్ద ముందడుగు వేశారు. ముందుగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశారు. అనంతరం కమిటీ సిఫారసుతో ఏకసభ్య కమిటీ వేయడం, బీసీ కుల గణనకు కమిషన్ ఏర్పాటు చేసి కాలపరిమితి పెట్టి ఒక తీవ్రమైన సమస్యకు పరిష్కారం వెతికారు. ఇలా కేవలం 300 రోజులలోనే అద్భుతాలు చేస్తున్నారు. అటు అభివృద్ధి, ఇటు సంక్షేమం, సంస్కరణలు, భారీ మార్పులు, ఉద్యోగాల కల్పన, ఎన్నికల ముందు పార్టీ ఇచ్చిన హామీల అమలు, ప్రతిపక్షాల రాజకీయ అవాంతరాలను అధిగమించి, తాను అనుకున్న లక్ష్య సాధన దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దూసుకుపోతున్నారు.

■ కప్పర హరిప్రసాద్‌రావు
సీపీఆర్‌ఓ, టీపీసీసీ







నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద, అమర వీరుల కుటుంబ సభ్యులు

పోలీసు అమరులు
ప్రజల గుండెల్లోనే ఉంటారు

- వారి త్యాగాలు చిరస్మరణీయం
- సంస్మరణ దినోత్సవంలో సీపీ అంబర్ కిశోర్ ఝా
- హాజరైన కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, అమరుల కుటుంబాల సభ్యులు

8

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని అమర వీరుల స్తూపం వద్ద వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, ప్రావీణ్య తదితర అధికారులతో కలిసి అమ రులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి అమరుల కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. అనంతరం కమిషనరేట్ నుంచి జీఎంహెచ్ వరకు ర్యాలీ నిర్వహించారు.
- హనుమకొండ, ఆంధ్రజ్యోతి



జలమయమైన హనుమకొండలోని నిట్ ప్రాంతం

నగరంలో భారీ వర్షం

- జలమయమైన రోడ్లు
- లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు
- వాహనాల రాకపోకలకు అంతరాయం

హనుమకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, హనుమకొండలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన ఈ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు చోట్ల రోడ్లపై నీళ్లు నిలిచాయి. వాహనాల రాకపోకలకు కొద్ది సేపు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 5 గంటల నుంచి గంట పాటు ఈ వర్షం పడింది. దీంతో హనుమకొండ బస్‌స్టాండ్, కాకాజీ కాలనీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచింది. మోకాలు ఎత్తు వరకు నిలిచిన ఈ నీటిలో ప్రయాణికులు నడవడానికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. హనుమకొండ ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డుపై వరద నీరు ప్రవహించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ రోడ్డును ఆనుకొని ఉన్న కాలనీలోనూ వరద నీరు ప్రవేశించింది. ములుగు రోడ్డులో కూడా నీరు నిలిచింది. కమలాపూర్, ఎల్కతుర్తి, శాయంపేట తదితర మండలాల్లో కూడా కొద్ది పాటి వర్షం పడింది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 18 మిమీ వర్షం పడినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వరంగల్‌లోని పలు లోతట్టు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు స్వల్ప అంతరాయం కలిగింది. రానున్న రెండు మూడు రోజుల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



జలమయమైన బాల సముద్రంలోని ఓ రోడ్డు

సంక్షిప్తంగా..

ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఓటర్లుగా అర్హత కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ ఆశావహులు తీకుళ్ల సాయిరెడ్డి కోరారు. వరంగల్, ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించి ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని అభ్యర్థిస్తూ అందుకు సంబంధించిన సమాచారాన్ని అందించారు. వరంగల్ జిల్లాలోని రాయపర్తి, వర్ధన్నపేట, హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి, హనుమకొండ మండలా ల్లోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలను సందర్శించి ఓటర్ల నమోదుపై వారికి అవగాహన కల్పిం చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని వినాయక నగర్, కేఎల్ఎన్‌రెడ్డి కాలనీ, సర్క్యూట్ హౌజ్ రోడ్డు, కోర్టు బ్యాక్‌సైడ్ ఏరియాలో ఉదయం 8.30 నుంచి 10.30 వరకు, నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, ఏకశిల పార్కు రోడ్డు ఏరియాలో ఉదయం 10.30 నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.





ఈ ఏడాదీ.. కొనుగోస తప్పదా?

- సీజన్లు మారుతున్నా మారని తీరు
- కేంద్రాల వద్ద కానరాని వసతులు
- టార్పాలిన్లు లేక అకాల వర్షాలకు పంట నీటిపాలు
- గోనె సంచులు, రవాణాలోనూ అస్తవ్యస్తం
- ధాన్యం అమ్మకాల ప్రక్రియలో రైతులకు తప్పని అవస్థలు
- నాణ్యత సాకుతో తీసుకోవడానికి మిల్లర్ల నిరాకరణ
- ఉమ్మడి జిల్లాలో ఈ సారి 1,137 కేంద్రాల ఏర్పాటు
- 12లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం

హనుమకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పంట వేసిన నాటి నుంచి చేతికొచ్చే వరకు.. చివరకు ఆ పంటను అమ్ముకునే సమయంలోనూ రైతన్నలకు అవస్థలు తప్పవు. అలాంటి అవస్థల నుంచి రైతులకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలతోనూ పెద్దగా ఒనగూరిందేమీ లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీ సీజన్‌లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలు నిండా ముంచుతున్నాయి. టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం తడిసి ముద్దవుతోంది. తెచ్చిన ధాన్యాన్ని ఆరబోసేందుకు చాలినంత స్థలం లేకపోవడంతో తేమ సమస్యను ఎదుర్కొంటున్నారు. తేమ శాతం సాకుగా చూపి కేంద్రాల నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారు. కొన్న తర్వాత ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలోనూ రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. తీరా రైస్‌మిల్లులకు తీసుకువెళ్లిన తర్వాత మిల్లర్లు ధాన్యం సరిగా లేదని తీసుకోవడానికి కొర్రీలు పెడుతున్నారు. ఇలా అడుగడుగడుగునా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఇబ్బందులను తొలగించే విషయంపై పౌరసరఫరాల శాఖ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిపెట్టడం లేదు. కనీసం ఈ సీజన్‌లో అయినా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఏర్పాట్లపై స్పష్టత కరవు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. తగినన్ని ఏర్పాట్లు చేయకపోతే గత సీజన్‌లో మాదిరిగానే ఈ సారి కూడా రైతులకు కష్టాలు తప్పవు. గతేడాది కేంద్రాలకు టార్పాలిన్లను సరిగా అందించకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిచి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల సమస్యలు, వారి ఇబ్బందులను ఎలా అధిగమించాలనే విషయంపై ప్రస్తుతం అధికారుల్లో స్పష్టత కనిపించడం లేదు. కేవలం ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వస్తుంది, కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేయాలి, సన్న రకాలను గుర్తించేందుకు ఎన్ని సూక్ష్మ మీటర్లను ఉపయోగించాలి అనేవాటిపై దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో 1,137 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం.

వేధిస్తున్న స్థల సమస్య

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థల సమస్య వేధిస్తోంది. అరకొరగా ఉన్న స్థలాల్లో ధాన్యం ఆరబోసేందుకు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రహదారులపై ధాన్యం ఆరబోయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో మాదిరిగా ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్లను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అందించడం

▸▸ మిగతా 6వ పేజీలో..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించండి

6

- బల్దియా ప్రజావాణిలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నాటుకోళ్లతో.. కాసుల గలగల
వివరాలు : 8లో..

ప్రణాళికాబద్ధంగా ఓటరు జాబితా చేపట్టాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఓటర్ జాబితా సవరణ 2024-25కు సంబంధించి ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటర్ విచారణ, ఓటర్ జాబితా రూపకల్పనపై కలెక్టర్‌లతో సోమవారం ఎన్నికల అధికారి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు వస్తున్న దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఉపాధ్యాయుల స్థానానికి 2730 దరఖాస్తులు వస్తే అన్ని పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ ఎమ్మెల్సీ స్థానాల ఓటర్ నమోదు దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్‌లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలలో పాల్గొనేందుకు అర్హులైన ఓటర్లు తమ పేర్లను నవంబర్ 6వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు.

స్వీప్ కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలి..

ఓటర్ జాబితా సవరణ 2024-25 కోసం స్వీప్ కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలని, దీని కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలని అన్నారు. యువ ఓటర్ల నమోదుతో పాటు దివ్యాంగులు, థర్డ్ జెండర్, సెక్స్‌వర్కర్ మొదలగు వరాలు, ఆదివాసీ, గిరిజనుల ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటర్ జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని, ఏ ఒక్కరిని కూడా వదలకుండా ఓటు హక్కు కల్పించాలన్నారు. అక్టోబరు 29న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల చేస్తామని, దీనిపై అభ్యంతరాలను, నూతన ఓటర్ నమోదు దరఖాస్తులను నవంబరు 29 వరకు స్వీకరిస్తామని, డిసెంబరు 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటర్ జాబితా ప్రచురించాలన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

- చివరి పత్తి బస్తా వరకు కొనుగోలు చేస్తాం
- మూడు రోజుల్లోనే బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ములు
- తేమశాతం నిర్ధారణకు ప్రత్యేక కమిటీలు
- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ
- ఏనుమాముల మార్కెట్లో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేఖ, చిత్రంలో ఎమ్మెల్యే నాగరాజు, తదితరులు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని, పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులకు ఆందోళన అవసరం లేదని, చివరి పత్తి బస్తా వరకు కొనుగోలు చేస్తామని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ సత్యశారదతో కలిసి సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఈ సీజన్‌లోనే మొదటి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని వరంగల్‌లో ప్రారంభించడం ఆనందంగా ఉందని, రేవంత్‌రెడ్డి పాలనలో రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. నాణ్యమైన పత్తిని రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చి గరిష్ఠ ధరను పొందాలని సూచించారు. పత్తిలో తేమ శాతాన్ని నిర్ధారించడానికి ప్రత్యేక కమిటీలు వేస్తామని, తద్వారా రైతుకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గతంలో సీసీఐ కొనుగోలు చేసిన తర్వాత పది, పదిహేను రోజులకు రైతులకు డబ్బులు వచ్చేవని, ఇప్పుడు అలా కాకుండా రెండు, మూడు రోజుల్లోనే సీసీఐ రైతుల ఖాతాల్లో డబ్బులు వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. మొబైల్ యాప్ కూడా పెట్టడం జరిగిందన్నారు. కాంటా పెట్టిన దగ్గర నుంచి రైతుల డబ్బులు పడేంత వరకు ట్రాకింగ్ అవుతూనే ఉంటుందన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని పత్తి, ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా వ్యాప్తంగా సీసీఐ 27 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, మొదటి విడతలో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో 14 కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. మిగిలినవి నర్సంపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు సులోచన సారయ్య, పోశాల పద్మ, బోగి సువర్ణ, చింతాకుల అనిల్, ఉమా దామోదర్ యాదవ్, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్, సీసీఐ జనరల్ మేనేజర్ అర్జున్ దవే,

▸▸ మిగతా 6వ పేజీలో..

సంక్షిప్త వార్తలు

పీజీ 1, 2 సెమిస్టర్ షెడ్యూల్ వెల్లడి

కేయూ క్యాంపస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంసీజే, ఎంటీఎం, ఎంహెచ్ఆర్ఎం, ఎంఎస్సీ(సీఎస్)ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎల్ఎస్సీ, ఎంసీఏ మొదటి, రెండో సెమిస్టర్ అల్మానాక్ షెడ్యూల్‌ను వర్సిటీ ఉన్నతాధికారులు సోమవారం విడుదల చేశారు. అక్టోబరు 21 నుంచి మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమౌతాయని, నవంబరు 21 వరకు మొదటి సెమిస్టర్‌కు రీ అడ్మిషన్ల గడువు ముగింపు, నవంబరు 27 నుంచి 30 వరకు మొదటి ఇంటర్నల్ పరీక్షలు, 11 జనవరి-2025 నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులు, ఆన్‌లైన్ క్లాస్‌ల నిర్వహణ, జనవరి 16న కళాశాల రీ ఓపెనింగ్, జనవరి 21 నుంచి 23 వరకు రెండో ఇంటర్నల్ పరీక్షలు, ఫిబ్రవరి 11 తరగతుల నిర్వహణతో పాటు ఫిబ్రవరి 13 నుంచి మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు 2025 మార్చి 1న ప్రారంభమవుతాయని ఏప్రిల్ 1 వరకు రీ అడ్మిషన్లకు అవకాశం ఉందని జూలై 11 నుంచి రెండో సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని వర్సిటీ అల్మానాక్‌ను అధికారులు వెల్లడించారు.

24న కేయూకు మంద కృష్ణమాదిగ

కేయూ క్యాంపస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో ఈ నెల 24న నిర్వహించే మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రానున్నారని ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి తెలిపారు. సోమవారం కేయూ అతిథిగృహం వద్ద మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. సదస్సును మాదిగ ఉద్యోగులు, మేధావులు, విద్యార్థులు, నిరుద్యోగులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఏప్‌సెట్ బైపీసీ కౌన్సిలింగ్ ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏప్‌సెట్-2024 బైపీసీ విభాగం కౌన్సిలింగ్ సోమవారం నుంచి ప్రారంభం అయ్యింది. వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌లో సెంటర్ కోఆర్డినేటర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ కౌన్సిలింగ్‌ను ప్రారంభించారు. కౌన్సిలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు ధృవపత్రాలు అందజేశారు. ఈ నెల 23 వరకు నిర్వహించే కౌన్సిలింగ్ ప్రక్రియలో విద్యార్థుల సర్టిఫికేట్లు వెరిఫికేషన్ జరుగుతుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. 25 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉందని, 28న సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని, 30 లోపు సంబంధిత కళాశాలలో విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి : సీపీ

శంభునిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా సూచించారు. సోమవారం కమిషనరేట్ పరిధిలోని మామునూరు పోలీసు స్టేషన్‌ను సీపీ తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులతో పాటు దర్యాప్తులో ఉన్న కేసుల గురించి సీఐ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు.

కొత్త టీచర్లకు ఒక్కరోజు శిక్షణ

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2024 ద్వారా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులతో పాటు ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో డి. వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా కార్యక్రమాలపై అవగాహన కోసమే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 22న తెలుగు ఉపాధ్యాయులకు ఎర్రగట్టు గుట్ట వద్దగల తేజస్వీ పాఠశాలలో, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అక్కడే ఉన్న గ్రీన్‌వుడ్ పాఠశాలలో, 23న హిందీ ఉపాధ్యాయులు తేజస్వీలో, గణిత ఉపాధ్యాయులు గ్రీన్‌వుడ్‌లో, 24న జీవశాస్త్ర ఉపాధ్యాయులు తేజస్వీలో, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు గ్రీన్‌వుడ్‌లో 25న ఎస్జీటీలు తేజస్వీలో, సోషల్ టీచర్లు గ్రీన్‌వుడ్‌లో హాజరుకావాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నత ఆలోచనలతో చదవాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు


విద్యార్థులకు డైరీలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత ఆలోచనలతో చదివితేనే సమాజంలో గొప్పగా జీవిస్తారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే స్వంత నిధులతో విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని సత్ప్రవర్తన కలిగిన వారిగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ విద్యార్థి నడవడికను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యపై ఆసక్తి కలిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రజిత, ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, నాయకులు నర్సింహరాములు, ప్రభాకర్, చరణ్, వెంకన్న, వెంకటస్వామి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందనలు

హైదరాబాద్ షేక్‌పేట్ మున్సిపల్ ఇండోర్ బాక్సింగ్ హాలులో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన హసన్‌పర్తి జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థి ఎన్.ఇసాక్‌ను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అభినందించారు. గోల్డ్‌మెడల్ సాధించడంలో కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు శీలం పార్థసారధికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుమాదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పట్టా..

పది మందిపై కేసు నమోదు

భీమదేవరపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా భూమి పట్టా చేసిన డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో పాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదైన ఘటన మండలంలో సోమవారం జరిగింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సామల మల్లాచారి ఏఆర్ ఎస్ఐగా పని చేసి 2017లో రిటైర్డ్ అయ్యాడు. మల్లాచారి మొదటి భార్య భారతి గతంలో మృతి చెందగా, వనమాలను రెండో వివాహం చేసుకున్నాడు. 2022లో మల్లాచారి కూడా మృతి చెందారు. ఆయన మృతి చెందిన నాటికి ఆయన సర్వీస్ బుక్‌లో వనమాల పేరు నమోదై ఉంది. మల్లాచారి పేరు మీద ఉన్న 54గుంటల భూమి ఉమ్మడి ఆస్తిగా ఉంది. అట్టి భూమిలో ఆయన మొదటి భార్య కుమారుడైన సతీష్ పేరు మీద 33 గుంటల భూమిని అప్పటి డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, ఆర్ఐ నరసింహనాయక్‌లు పట్టా చేశారు. అదే విధంగా మల్లాచారి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో తన పేరు లేకుండా తప్పుడు ధృవీకరణ చేసిన ఉద్యోగులు రఫీ, తిరుపతితో పాటు సాక్షులుగా సంతకాలు చేసిన మరో ఆరుగురిపై వనమాల స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మొత్తం పది మందిపై కేసు నమోదు చేశారు.

కేంద్ర పథకాల పరిశీలన

దుగ్గొండి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం, గిర్నిబావి, పొనకల్ గ్రామాల్లోని కేంద్ర పథకాల అభివృద్ధి పనులను సోమవారం కేంద్ర బృంద సభ్యులు సందర్శించి పరిశీలన చేశారు. ఆయా గ్రామాల్లో కేంద్ర బృందానికి మహిళలు బతుకమ్మలతో పాటు కోలాట పాటలతో స్వాగతం పలికారు. మహాత్మా గాంధీ జాతీయ పథకం పనులైన వర్మి కంపోస్టు, నర్సరీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆహారం పంపిణీ తీరు, గ్రామాల్లోని పొదుపు సంఘాల పని తీరును పరిశీలించారు. పొదుపు సంఘాల సభ్యులు, సమైక్య సంఘాల ద్వారా పొందిన రుణాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకునే తీరును సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. పరిశీలన బృందంలో టీం లీడర్ సుబ్రమణ్యరెడ్డి, సభ్యుడు ప్రకాశ్, ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, ఏపీఎం రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నయీంనగర్ నాలా ముంపును నివారించేందుకు ప్రారంభించిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. నాలాకు ఇరువైపుల చాలా మంది ఆక్రమణలు చేసి నిర్మాణాలు చేయడంతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. రిటైనింగ్ వాల్ కు అక్కడక్కడ నిర్మాణాలు అడ్డుపడటం, వాటి యాజమానులు తొలిగింపునకు నిరాకరిస్తుండటంతో కొంత జాప్యం జరుగుతోంది. నాలా 5, 6, 52, 53, 54, 57 డివిజన్‌ల గుండా ప్రవహిస్తుండటంతో చాలా చోట్ల నాలా కుదించుకపోయింది. కొన్ని చోట్ల కోర్టును ఆశ్రయించడంతో అక్కడ తాత్కాలికంగా పనులు నిలిపివేస్తున్నట్లుగా తెలుస్తోంది దినయీంనగర్ బ్రిడ్జిని ఏ విధంగా అయితే వేగంగా నిర్మించారో అదే తీరుగా రిటైనింగ్ వాల్ నిర్మాణంను పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని ముంపు ప్రజలు కోరుతున్నారు.

నిధులిస్తేనే మరమ్మతులట..

ఐనవోలు ఎంపీడీవో కార్యాలయంపై నిర్లిప్తత

ఎట్టకేలకు హనుమకొండలోని భవనం ఖాళీ


ఐనవోలు కార్యాలయంను పరిశీలిస్తున్న అధికారులు

ఐనవోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐనవోలులో ఏర్పాటు చేస్తున్న ఎంపీడీవో కార్యాలయం భవనం మరమ్మతుల విషయంలో నిర్లిప్తత కనిపిస్తోంది. కలెక్టర్ నిధులు ఇస్తే తప్ప మరమ్మతులు జరిగే పరిస్థితులు కనిపించడంలేదని అధికారులు తేగిసి చెబుతున్నారు. ఏడేళ్లుగా హనుమకొండ వడ్డేపల్లిలో కొనసాగుతున్న ఐనవోలు ఎంపీడీవో కార్యాలయాన్ని తక్షణమే ఐనవోలుకు మార్చాలని ఇటీవల కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఐనవోలులో విద్యార్థులు లేక ఖాళీగా ఉన్న హాస్టల్ భవనంలో సగభాగం తహసీల్దార్ కార్యాలయానికి వినియోగిస్తుండగా మరో సగభాగం ఖాళీగా ఉంది. అందులో ఎంపీడీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తుండగా భవనం మరమ్మతు పనులకు కావల్సిన నిధుల విడుదలకు ఎస్టిమేషన్ వేసి పంపించాలని కలెక్టర్ గతంలో సూచించారు. పీఆర్ ఏఈ రూ.5 లక్షల నిధులు అవసరం ఉంటాయని అంచనాలు పంపారు. ఈలోపు నాలుగు రోజుల కిందట హాస్టల్‌లో ఉన్న సామగ్రిని ఆ సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారులు తీసుకెళ్లగా వడ్డేపల్లిలో ఉన్న ఎంపీడీవో కార్యాలయం సామాగ్రిని ఐనవోలు హాస్టల్ భవనానికి తీసుకొచ్చారు. కలెక్టర్ ఇస్తానన్న నిధులు రాకపోవడం, ఎంపీడీవో చేతిలో చిల్లి గవ్వలేక మరమ్మతులు చేయలేక బేల చూపులు చూస్తున్నారు. దీనికితోడు ఇన్నాళ్లు హనుమకొండ పట్టణంలో ఉండి విధులు నిర్వహించిన వివిధ శాఖల అధికారులు ఐనవోలుకు వచ్చి పనిచేయడంలో ఆసక్తి చూపడటం లేదని, బలవంతంగానే వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే శనివారమే హనుమకొండలోని కార్యాలయాన్ని ఖాళీ చేసి సామగ్రిని ఐనవోలుకు తీసుకువచ్చినా.. అధికారులు, సిబ్బంది సోమవారం ఐనవోలు నుంచి విధులు నిర్వహించకపోవడం గమనార్హం. హనుమకొండలో కార్యాలయం ఖాళీ కావడం ఐనవోలులో కార్యాలయం ఏర్పాటు చేయలేకపోయారు. హాస్టల్ భవనం సమీపంలోనే రైతు వేదిక, కమ్యూనిటీ హాల్ ఉన్నాయి, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది సమావేశాలు అందులో నిర్వహించుకునే సదుపాయం ఉన్నా హాస్టల్ భవనంలోనే అన్ని సదుపాయాలు ఉండాలని పనులను ముందుకు సాగనియ్యకపోవడం శోచనీయం. కొత్త ఎంపీడీవో భవనం నిర్మాణం చేపట్టితే అందులోకి వెళ్లాల్సిందే అప్పటి వరకు ఉన్న దాంట్లో సర్దుకుంటే సమస్య తీరుతుంది తప్ప మరోమార్గం లేదు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించండి

బల్దియా ప్రజావాణిలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బల్దియా ప్రజావాణికి వచ్చే బాధితుల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. పజల సమస్యలపై స్పందించని అధికారులు, సిబ్బందిని ఇకపై సహించేది లేదని విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి సమస్య పరిష్కరించాలని అధికారులను సూచించారు. కమిషనర్ నేరుగా ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తు స్వీకరించి వెంటనే అక్కడి ఆయా విభాగాల అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 78 ఫిర్యాదులు స్వీకరించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, డిప్యూటీ కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టీవో బిర్రు శ్రీనివాస్‌తో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో ప్రజాపాలన ఫిర్యాదులు..

గతంలో ఎన్నడూ లేని విధంగా బల్దియా కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యాలయంలో నగరంలో నివసించే ప్రజలు ప్రజాపాలన దరఖాస్తు ఫారాలతో వచ్చారు. గతంలో తాము ఆరు పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నామని, జీరో కరెంటు బిల్లు, రూ. 500 గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ. 2500 ఆర్థిక సహాయం ఇప్పటికీ అందడం లేదని విన్నవించారు. ఇంజనీరింగ్ విభాగానికి 10, హెల్త్, శానిటేషన్ 7, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ 8, టౌన్ ప్లానింగ్ 47, తాగునీటి సరఫరా -4 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

- హనుమకొండ 48వ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన కాలనీవాసులు రాములు, చంద్రశేఖర్, షాబీర్, కిషన్‌లు కాలనీకి పైప్ లైన్ లేకపోవడం వల్ల మంచి నీటికి చాలా ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు.
- వచ్చేనెల 2న మా పూర్వికుల ఆత్మల పండగ ఉంది, సమాధుల వద్ద శానిటేషన్ సిబ్బందితో శుభ్రం చేయించాలని హనుమకొండ 4వ డివిజన్ పెద్దమ్మగడ్డకు చెందిన యువకులు కమిషనర్‌ను కలిశారు.
- వరంగల్ 29వ డివిజన్ రామన్నపేటలో పైసమ్మగుడి వద్ద నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ బోర్‌ను రిపేరు చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాలనీవాసులు ఫిర్యాదులు
- వరంగల్ నగరంలో 6, 49, 7, 52 డివిజన్‌లలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలను జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దొగ్గెల తిరుపతి ఫిర్యాదులు చేశారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, డీడీఎం పద్మావతి, డీఎంవో సురేఖ, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, సీసీఐ సెంటర్ అధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోసం మంత్రి నిరీక్షణ

సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు గాను మంత్రి కొండా సురేఖ నిర్దేశిత సమయానికి వ్యవసాయ మార్కెట్‌కు చేరుకున్నారు. కానీ మంత్రి ఎమ్మెల్యే నాగరాజు రాక ఆలస్యం కావడంతో ఆయన కోసం మంత్రితో పాటు కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, సీసీఐ జనరల్ మేనేజర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఇలా అందరూ సుమారు 20 నిమిషాల పాటు ఎదురు చూశారు.

మంత్రి, ఎమ్మెల్యేకు పలువురి వినతులు

తమ సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులు ఇనుముల మల్లేశం తదితరులు మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఇక బస్తాల్లో పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, మంత్రి సురేఖతో పాటు వ్యవసాయశాఖ మంత్రి సీసీఐ అధికారులతో మాట్లాడి 10 బస్తాల వరకు రైతు తీసుకువచ్చిన పత్తిని తీసుకోవాలని రవీందర్‌రెడ్డి మంత్రిని కోరారు. అలాగే మార్కెట్‌కు అనుసంధానంగా ఉన్న రోడ్లు పూర్తిగా పాడైపోయాయని, వాటిని పునః నిర్మించాలని మంత్రి, ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

రంగాయ చెరువు రిజర్వాయర్ ప్రతిపాదన విరమించుకోవాలి

వరంగల్ కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా


వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నల్లబెల్లి మండలం గోవిందాపూర్ శివారులోని రంగాయ, ఎర్రాయ చెరువులను కలిపి రిజర్వాయర్ చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని రైతులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రంగాయ చెరువు నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు గూబ రాజు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు గంగుల దయాకర్, రాచర్ల బాలరాజు, రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు ఈర్ల పైడి మాట్లాడారు. 2009లో రంగాయ చెరువు రిజర్వాయర్ నిర్మాణానికి పూనుకోగా ప్రజలు వ్యతిరేకించగా కేసులు సైతం నమోదైనట్లు తెలిపారు. ఇటీవల జరిగిన దేవాదుల ప్రాజెక్టు సమావేశంలో నర్సంపేట ఎమ్మెల్యే రంగయ చెరువును రిజర్వాయర్ చేయాలని ప్రతిపాదనలు పెట్టారన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే చుట్టుపక్కల పది గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. రిజర్వాయర్ నిర్మాణ ప్రతిపాదనను విరమించి దళిత, గిరిజన, ఆదివాసీ ప్రజలను ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పరికి రత్నం, లావుడ్యా తిరుపతి, తడక కోమల, కె.ప్రతాప్, బాదావత్ బాలు, గుండెబోయిన తిరుపతి, ఏ సదయ్య, సాంబయ్య, రమేశ్, పుష్పమ్మ, మమత, అంబాలి, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రెండు రోజులుగా జరగుతున్న అంతర్ కళాశాలల క్రీడల పోటీలు సోమవారంతో ముగిశాయి. క్రీడల ముగింపు కార్యక్రమానికి సుబేదారి స్టేట్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ అచ్యుత్ పాల్గొన్నారు. ఈ క్రీడల పోటీల్లో ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలకు చెందినక్రీడాకారులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

హనుమకొండ సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ జిల్లా ఇస్సీపేట గ్రామానికి చెందిన రైతు యార రాజిరెడ్డి కుటుంబానికి రూ.8 లక్షల బీమా చెక్కును టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అందచేశారు. సోమవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో రాజిరెడ్డి సతీమణి పద్మకు బీమా సొమ్ము చెక్కును ఇచ్చారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 28 మంది కి సోమవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. వారికి రూ. 43,200 జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 10 మందికి రూ. 9,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఈ ఏడాదీ.. కొను'గోస తప్పదా?'

(5వ పేజీ తరువాయి)

లేదు. అలాగే మార్కెటింగ్ అధికారులూ కేంద్రాలకు సరఫరా చేయడం లేదు. గోనె సంచులు, లారీల సమస్య ప్రతీ సారీ వేధిస్తూనే ఉంది. ధాన్యం కొనుగోళ్లకు సంచుల కొరత లేదని అధికారులు అంటున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం ఈ సమస్య తీవ్రంగానే ఉంది. ఈ విషయంలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంచులు లేవనే నెపంతో వారంలో ఓ రోజు కొనుగోళ్లను నిలిపి వేసిన సందర్భాలున్నాయి. లారీల కొరత కారణంగా కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించకపోవడంతో అకాల వర్షాలకు తడుస్తున్నాయి. తడిసిన ధాన్యాన్ని తీసుకోవడానికి మిల్లర్లు తిరస్కరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో జీవో ప్రకారం అయిదుగురు సిబ్బంది ఉండాలి. కేవలం ఒకరిద్దరితో కొనుగోళ్లు చేస్తుండడంతో అలస్యం జరుగుతోంది. కొన్ని చోట్ల బస్తాలు భారీగా చోరికి గురవుతున్నాయి. గత ఏడాది కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం బస్తాలు చోరీకి గురైన సంఘటనలున్నాయి.

కొనుగోలుకు సన్నాహాలు

2024-25 వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి గత నెల 25వ తేదీనే సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్టోబరు మొదటి వారం నుంచే కొనుగోళ్లు ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే సాధారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాస్త ఆలస్యంగా నవంబరు మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. అయినా ముందస్తుగా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. హనుమకొండ జిల్లాలో రెండు రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు. అక్టోబరు నెలాఖరు నాటికి కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభం కావాలని ఆయా జిల్లాల కలెక్టర్లు పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు.

సుమారు 12 లక్షల మెట్రిక్‌టన్నుల సేకరణ

ఉమ్మడి జిల్లాలో అక్టోబరు చివరి వారం నుంచి పంట దిగుబడులు మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉంది. గన్నీ బ్యాగులు, వాహనాలు, కూలీలను సమకూర్చుకునేందుకు ఇప్పటికే ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో సుమారు 19లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నారు. ఇందులో స్థానిక అవసరాలకు పోను కొనుగోలు కేంద్రాలకు సుమారు 14లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశాలుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కేంద్రం మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్ రకం క్వింటాలుకు రూ.2320 కాగా సాధారణ రకానికి రూ. 2300 ధరలు లభించే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ క్వింటాలుకు రూ.500ను ఈ సీజన్ నుంచే రైతులకు అందించేందుకు పౌరసరఫరాల శాఖ మంత్రి సుముఖత వ్యక్తం చేయడంతో ధాన్యం క్వింటాలు ధర రూ.2800 ప్రకారం రైతులకు దక్కనుంది. బోనస్‌కు ఆశపడి పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి కేంద్రాలకు తీసుకురాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ సీజన్‌లో 1,137 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా సన్నరకం, దొడ్డు రకం కలుపుకొని మొత్తం సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు.

ధాన్యం సేకరణ ప్రణాళిక ఇలా..

జిల్లా	కేంద్రాలు	లక్ష్యం (లక్షల మెట్రిక్‌టన్నుల్లో)
హనుమకొండ	154	1.50
జనగామ	208	2.30
వరంగల్	203	2.10
మహబూబాబాద్	236	2.35
ములుగు	153	1.50
భూపాలపల్లి	183	2.00

ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- ప్రజావాణికి 106 దరఖాస్తులు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య బాధితుల నుంచి దరఖాస్తులు తీసుకుని పరిశీలించి సంబంధిత అధికారులను పిలిచి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. సోమవారం ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాలు, గ్రామాల నుంచి వివిధ సమస్యలపై 106 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఎక్కువగా రెవెన్యూకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. హనుమకొండ ఆర్డీవో కార్యాలయానికి 13, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌కు 13, హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయానికి 6, ఎల్కతుర్తి, హనుమకొండ, ఐనవోలు, కమలాపూర్, కాజీపేట తహసీల్దార్ కార్యాలయాలకు 5 చొప్పున దరఖాస్తులు రాగా మిగతా దరఖాస్తులు ఇతర డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించినవి వచ్చాయి. కాజీపేట బైపాస్ రైల్వేలైన్ నష్కల్-హసన్‌పర్తి వరకు ఉన్న అలైన్‌మెంట్ వల్ల ధర్మసాగర్ మండలంలోని 7 గ్రామాలు, హసన్‌పర్తి మండలంలోని 3 గ్రామాల రైతుల భూములు పోతున్నాయని, రైల్వేలైన్‌కు భూములు ఇవ్వమని బాధిత రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

జ్యోతిబస్ నగర్, భగత్‌సింగ్ నగర్ ప్రజలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఎం పార్టీ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం ఇచ్చారు. నూతన విద్యావిధానం 2020 రాష్ట్రంలో అమలు చేయవద్దని ఏఐఎస్ఎఫ్ నాయకులు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో నడుస్తున్న డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు, జిల్లాలో ఉన్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



బాధితుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దరఖాస్తును చూపిస్తున్న వృద్ధ దంపతులు

నా కొడుకుతో ప్రాణహాని ఉంది

కలెక్టర్‌కు వృద్ధ దంపతుల ఫిర్యాదు

తమ పెద్ద కొడుకు బిట్ల శ్రీనివాస్‌తో తమకు ప్రాణహాని ఉందని హనుమకొండ బాలసముద్రానికి చెందిన వృద్ధ దంపతులు బిట్ల భాగ్యలక్ష్మీ శేఖర్‌లు కలెక్టర్ పి. ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. హనుమకొండ టైలర్ స్ట్రీట్‌లో ఉన్న తన షాపునకు ఇటీవల శ్రీనివాస్ తన అనుచరులు, గుండాలతో వచ్చి దౌర్జన్యంగా కొట్టి బయటకు గెంటేసి తమ ఆస్తి లాక్కొని తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడని కలెక్టర్ ఎదుట వృద్ధ దంపతులు విలపించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నామని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

ప్రజావాణి వినతులు వెంటనే పరిష్కరించాలి

వరంగల్ కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి వినతులను వెంటనే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ప్రజల వినతులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ వాటిని సకాలం పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో ఎక్కువ శాతం రెవెన్యూ శాఖకు సంబంధించిన వినతులే వస్తున్నాయని, వాటిని సాధ్యమైనంత మేరకు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 118 వినతులు అందగా ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 62, జిల్లా వ్యవసాయశాఖ 9, ఉపాధి కల్పన శాఖకు 6, జిల్లా గ్రామీణాభివృద్ధి, విద్య, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, పౌరసరఫరాల శాఖలు, మహానగర పాలక సంస్థ, వైద్య ఆరోగ్యశాఖలకు కలిపి 41 వినతులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్డీవో కౌసల్యాదేవి, వరంగల్, ఖిలా వరంగల్ తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, కలెక్టరేట్ ఏవో, సూపరింటెండెంట్ శ్రీకాంత్, రమేష్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, వ్యవసాయశాఖ అధికారి అనురాధ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పునే వినియోగించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

వరంగల్ మెడికల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అయోడిన్ కలిగిన ఉప్పునే వినియోగించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లలితాదేవి సూచించారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం హనుమాన్ జంక్షన్‌లో మానవహారం నిర్వహించి డాక్టర్స్ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో లలితాదేవి మాట్లాడుతూ.. అయోడిన్ లోపం వల్ల వచ్చే వివిధ రకాల ఆరోగ్య సమస్యలను ప్రజలకు వివరించాలన్నారు. అయోడిన్ ఉప్పు వాడకం వల్ల సరైన పెరుగుదల, చురుకుదనం, మంచి శారీరక, మానసిక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి ఉంటుందన్నారు. అయోడిన్ లోపం వల్ల గర్భస్రావం, మృతశిశువు జననం, మరుగుజ్జుతనం, బుద్ధిమాంద్యం, గొంతువాపు తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్‌మోహన్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఇష్తాకర్ అహ్మద్, డాక్టర్ నాగరాజు, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామ్‌చందర్, నరేశ్, ఏఎన్ఎంలు, ఆశాలు, శివాని ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అవసరమైతేనే టెస్టులు నిర్వహించాలి

వరంగల్ మెడికల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆస్పత్రులు, డయాగ్నస్టిక్స్ సెంటర్లు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నియమాలు తప్పనిసరిగా పాటించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా యాజమాన్యాలు వివిధ సేవలకు సంబంధించిన తారీఫ్ లిస్టును తప్పకుండా విజిటర్స్‌కు కనిపించేలా ప్రదర్శించాలన్నారు. వివిధ రకాల స్కాన్స్, ఆస్పత్రులకు రెఫర్ చేసిన వారికి కమీషన్లు ఇస్తూ పేషెంట్స్‌పై భారం మోపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తప్పనిసరి అయితేనే టెస్టులు, స్కాన్స్ చేయాలని సూచించారు. అవసరం లేకున్నా పరీక్షలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో హెచ్చరించారు.

పోలీసుల రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ

హనుమకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక భీమారంలోని శుభం కళ్యాణ వేదికలో ఎంజీఎం రక్తనిధి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ప్రారంభించారు. హనుమకొండ, కాజీపేట, కేయూసీ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీసు సిబ్బంది, పోలీసు అధికారులు ఉత్సాహంగా ఈ రక్తదానంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదాన చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి పోలీసు కమిషనర్ సర్టిఫికెట్లు, పండ్లు హెల్త్ డ్రింక్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, సత్యనారాయణ రెడ్డి, సతీష్, ఎంజీఎం రక్తనిధి ఇంచార్జి ఆశతో పాటు ఎస్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

కాశిబుగ్గ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్లు, పాలసీదారుల సమస్యలను పరిష్కరించాలని లియాఫీ (ఎల్ఐఏఎఫ్ఐ) వరంగల్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ అధ్యక్షుడు పబ్బా రాజశ్రీనివాసరావు కోరారు. సోమవారం వరంగల్ ములుగురోడ్‌లోని వరంగల్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఆఫీస్ ఎదుట మధ్యాహ్నం లంచ్ అవర్‌లో గేట్ ధర్నా నిర్వహించారు.

ఏడీఈ రాజుకు మిత్రుల సన్మానం



ఏడీఈ రాజును సన్మానిస్తున్న చిన్ననాటి మిత్రులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 21 : నయీంనగర్ ఏడీఈగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కొండమీది రాజును 10 వ తరగతి స్నేహితులు సోమవారం సన్మానించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన రాజు 2012లో ఎలక్ట్రిసిటీలో ఏఈగా విధుల్లో చేరి వివిధ ప్రాంతాల్లో పనిచేసి 2021లో ఏడీఈగా పదోన్నతి పొంది భీమదేవరపల్లి ఏడీగా పనిచేశాడు. ఎన్పీడీసీఎల్‌లో ఇటీవల జరిగిన బదిలీల్లో నయీంనగర్ ఏడీఈగా బాధ్యతలు చేపట్టడంతో తన చిన్ననాటి మిత్రులు రాజును నయీం నగర్‌లో ఏడీఈ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో సన్మానించారు. రాజును సన్మానించిన వారిలో ఇజ్జగిరి దేవేందర్, ఎండపల్లి మల్లారెడ్డి, నూక నాగరాజు, గుండా రమేశ్‌బాబు, కలకోటి మహేందర్, గోలి రవి, ఇస్మాయిల్, కిషోర్‌కుమార్, మల్లేశ్, వంశీకృష్ణ ఉన్నారు.



సోమిడి హనుమాన్ జంక్షన్ వద్ద విద్యుత్ వైరుకు అల్లుకున్న మొక్కల తీగలు

అల్లుకున్న నిర్లక్ష్యపు తీగలు

కాజీపేట, అక్టోబరు 21 : కాజీపేట 62వ డివిజన్ సోమిడి హనుమాన్ జంక్షన్ వద్ద కరెంట్ తీగలకు గుబురుగుబురుగా మొక్కల తీగలు అల్లుకున్నాయి. గత ఆరునెలలుగా సుమారు యాభై అడుగుల మేర కరెంట్ తీగలకు గుబురుగా మొక్కల తీగలు అలుకున్నాయి. దీంతో వర్షం కురిసినా.. పెద్దగాలులు వీచినా కరెంట్ తీగలు ఒకదానికొకటా తాకి మెరుపులు రావడంతో స్థానికులు, సమీపంలోని ఉన్నవారు భయాందోళనలకు గురవుతున్నారు. కొన్ని సమయాల్లో గాలులు వీచినపుడు తీగలు ఒకదానికొకటి తాకడంతో ఇంట్లోని ఫ్యూజ్‌లు కొట్టేస్తున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. విద్యుత్ సిబ్బంది కరెంట్ తీగలకు అల్లుకున్న మెక్కల తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

హనుమకొండ టౌన్, అక్టోబరు 21 : ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడానికి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్శిటీ చైర్మన్ సిహెచ్. పురుషోత్తంరెడ్డి అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని తన క్లాస్‌మెట్స్ ప్రొఫెసర్ టి. రతన్‌సింగ్ ఠాకూర్, సిహెచ్. ఆగారెడ్డి, వసంత్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆహారం కలుషితం అరికట్టడంపై ముద్రించిన కరపత్రా లను సోమవారం కళాశాల ఆవరణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికి సమతుల్య ఆహారం అందించడానికి ఆధునిక వ్యవసాయం అవసరం అన్నారు. కార్యక్రమంలో చైతన్య యూనివర్శిటీ ఉప కులపతి గుర్రపు దామోదర్, రిజిస్ట్రార్ రవీందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచండి

- వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ట్రేడ్‌లైసెన్స్ వసూళ్ల పురోగతిపై అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను సూచించారు. సోమవారం బల్దియా కౌన్సిల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతిపై టీపీఎస్‌లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఒక టీపీఎస్ ప్రతీ రోజు 120 దరఖాస్తుల పరిశీలనే లక్ష్యంగా పని చేయాలన్నారు. కేటాయించిన వార్డు అధికారులను సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. టీపీఎస్‌లకు అటెండెన్స్ మానిటరింగ్ సిస్టంను అమలు చేయాలన్నారు. భువన్ యాప్‌లో సమాచారం నమోదు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ల వారీగా పని చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డిమాండ్ నోటీసులు అందించి ట్రేడ్ లైసెన్స్ బకాయిలు వసూళ్లలో పురోగతి సాధించాలన్నారు. బల్దియాకు చెందిన చెత్త రవాణా వాహనాలు మరమ్మతులు చేసి వాహనాలు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వీధి దీపాలకు వెంటనే మరమ్మతులు చేసి నగరంలో అంధకారం లేకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, హెచ్‌వో రమేష్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్, డిప్యూటి కమిషనర్‌లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో రాజేశ్, టీవో బిర్రు శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేసిన వ్యక్తులకు జరిమానా

హనుమకొండ టౌన్, అక్టోబరు 21: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 22 మంది వ్యక్తులకు న్యాయమూర్తి విద్యాసాగర్ జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. తనిఖీల్లో పట్టుబడ్డ 23మందిని సోమవారం కోర్టులో హాజరుపరచగా 22మందికి రూ.32,500 జరిమానా, ధర్మసాగర్ మండలం సోమదేవరపల్లికి చెందిన మౌటం శ్రీకాంత్‌కు శిక్షలో భాగంగా రెండు రోజుల కమ్యూనిటీ సర్వీసింగ్ కింద హనుమకొండ తహసీల్దార్‌కు అప్పగించడం జరిగిందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ మరో 9మంది వ్యక్తులకు రూ.5,000 జరిమానా విధించడం జరిగిందన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన శ్రీచేతన్ శౌర్య



జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఆల్ ఇండియా ద్వితీయ ర్యాంకు సాధించిన శ్రీచేతన్‌శౌర్యను అభినందిస్తున్న కోచ్ శ్రీధర్

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 21 : జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ అండర్-13 బాలుర డబుల్స్ బ్యాడ్మింటన్ విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సామల శ్రీచేతన్‌శౌర్య ఆల్ ఇండియాలో ర్యాంకింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. శ్రీచేతన్‌శౌర్య బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ద్వితీయ ర్యాంకుతో పాటు సింగిల్స్ విభాగంలో ఆల్ ఇండియా 4వ ర్యాంకు సాధించి అందరి మన్ననలు పొందుతున్నాడు. ప్రస్తుతం వరంగల్‌లోని జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో కోచ్ శ్రీధర్ వద్ద 5 సంవత్సరాలుగా తర్ఫీదు పొందుతున్నాడు. కాగా, శ్రీచేతన్‌శౌర్య ఎస్ఎస్ కాన్సెప్ట్ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు సోమవారం జాతీయస్థాయిలో ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ డబుల్స్‌లో 2వ ర్యాంకింగ్, సింగిల్స్‌లో విభాగంలో 4వ ర్యాంకింగ్ సాధించిన శ్రీచేతన్‌శౌర్యను బ్యాడ్మింటన్ కోచ్ శ్రీధర్, వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అధక్ష కార్యదర్శి డాక్టర్ రమేష్‌కుమార్, పి.రమేష్‌రెడ్డి, కోశాధికారి నాగ కిషన్, ప్రిన్సిపాల్ రమేష్, క్రీడాకారులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

మామునూరు పీటీసీ ప్రిన్సిపాల్ పూజ

శంభునిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని మామునూరు పోలీ సు శిక్షణ కళాశాల (పీటీసీ) ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పీటీసీలోని స్మారక స్థూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు.

ఫోర్త్ బెటాలియన్‌లో....

మామునూరులోని టీజీఎస్పీ ఫోర్త్ బెటాలియన్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సోమవారం ఫ్లాగ్ డే నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ రామ్‌ప్రకాశ్ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

వడ్డెపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మహిళల పాత్ర ఎంతో కీలకమని అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) సంజీవ్ అన్నారు. సోమవారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని సంస్కృతం, హిందీ విభాగాల ఆధ్వర్యంలో ఏ స్టడీ ఆఫ్ ఉమెన్ క్యారెక్టర్స్ ఇన్ రామాయణ అండ్ ఇట్స్ రిలవెన్స్ ఇన్ మోడ్రన్ ఎరా (రామాయణంలో స్త్రీ పాత్రల అధ్యయనం, వర్తమాన కాలంలో వాటి ఔచిత్యం) అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు.

కోటలో ఓపెన్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరణ

ఖిలావరంగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వివిధ కారణాలతో చదువు మానేసిన విద్యార్థులు 10వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశం పొందడానికి ఈనెల 31 వరకు సమయం ఉందని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు. సోమవారం ఖిలావరంగల్ మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శైలేంద్రకుమార్ అధ్యక్షతన ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వివరాల కోసం 9603686850 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు

మడికొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం సోమవారం పీఆర్‌టీయూ-టీఎస్ కాజీపేట మండల శాఖ అధ్యక్షుడు దేవిరెడ్డి మాలకొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కాజీపేట మండలంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ -టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రారంభించి మాట్లాడారు.

బీజేపీతోనే దేశ భద్రత, అభివృద్ధి

శంభునిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ అధికారంలో ఉంటేనే దేశం అభివృద్ధితో పాటు భద్రంగా ఉం టుందని పార్టీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అ న్నారు. బీజేపీ 41వ డివిజన్ అధ్యక్షుడు కర్నె వాసుదేవ్ ఆ ధ్వర్యంలో రంగశాయిపేట, శంభునిపేట ప్రాంతాల్లో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

రచయిత కుమారస్వామికి సత్కారం

శంభునిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలోని ఉర్సు ప్రాంతానికి చెందిన కవి, రచయిత, సామాజిక విశ్లేషకుడు పాల కుమారస్వామికి అరుదైన గౌరవం దక్కింది. ఏపీ పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో రెండు రోజుల పాటు సాహిత్య సాంస్కృతిక కళా జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. శని, ఆదివారాల్లో జరిగిన ఈ కళాజాతరలో కుమారస్వామి తెలుగు కవితా గానంతో పాటు భాషా నైపుణ్యాలను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమంలో కుమారస్వామిని నిర్వాహకులు సత్కరించి, ప్రశంసా పత్రం, మెమెంటో అందించారు.

మహిళా ప్రయాణికులకు బహుమతులు ప్రదానం

బాలసముద్రం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ డీలాక్స్ బస్సులలో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు సోమవారం హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో లక్కీడ్రా నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ రీజినల్ మేనేజర్ డి. విజయభాను పాల్గొని మహిళా ప్రయాణీకులకు బహుమతులు, గిఫ్ట్ బాక్సులు అందించారు.

సమస్యలను పోరాడి సాధించుకోవాలి..

కాజీపేట జంక్షన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలంలో సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నేడు మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వంపై పోరాడి సాధించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ అన్నారు. సంఘం ఆవిర్భవించి అక్టోబరు 21 నాటికి 24 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని అనేక ప్రాంతాల్లో చేపల అడ్డాలలో జెండా ఆవిష్కరణల కార్యక్రమాలు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

గీత కార్మికుల భద్రతకే కాటమయ్య కిట్లు

అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖల మంత్రి కొండా సురేఖ

వరంగల్‌సిటీ, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తుందని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో బీసీ సంక్షేమ శా ఖ ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సత్య శారద కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కులవృత్తులకు చేయూతనందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో పది వేల మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా రూ.55 లక్షలతో 550 మందికి కి ట్లను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోశాల పద్మ, భోగి సువర్ణ, చింతాకుల అనిల్, ఉమా దామోదర్ యాదవ్, జిల్లా బీసీ సంక్షే అధికారి పుష్పలత, జిల్లా అబ్కారి అధికారి చంద్రశేఖర్, గౌడ సం ఘం నాయకులు నర్సయ్య, శ్రీనివాస్, యుగేందర్ పాల్గొన్నారు.

బొడ్రాయి వేడుకల్లో మంత్రి

కరీమాబాద్ (ఆంధ్రజ్యోతి): నగరంలోని 33వ డివిజన్ శాంతినగర్, సాకరాశికుంట, హనుమాన్ నగర్, ఏకశిలా నగర్‌లకు సంబంధించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు ముష్కమళ్ల సుధాకర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. వేడుకల్లో సోమవారం మంత్రి కొండా సురేఖ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

యాగాలతో ప్రపంచ శాంతి

వరంగల్ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): హోమాలు , యాగాలతో ప్రపంచ శాంతి చేకూరుతుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఐదు రోజుల పాటు లోక కల్యాణార్థం సహస్ర చండీ యాగాన్ని రామన్నపేట పోతన రోడ్డు మణిదీప్ గార్డెన్‌లో సోమవారం ప్రారంభించారు. మంత్రి యాగ ప్రాంగణాన్ని సందర్శించారు. యాగ నిర్వాహకులు, పండితులు శ్రీకాంత్ అడిగ, వంశీకృష్ణ మంత్రికి శేష వస్త్రాలు అందించి ఆశీర్వచనం చేశారు. మంత్రి వెంట చింతాకుల సునీల్, బత్తిని వసుంధర, 28వ డివిజన్ అధ్యక్షుడు కురిమిళ్ల సంపత్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



గీతా కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి సురేఖ, కలెక్టర్ సత్యశారద తదితరులు

కష్ట జీవి..



షెడ్డులో ఉన్న పిల్లలు

పందెం కోడిని చూపిస్తున్న రాంబాబు



నాటు కోడిగుడ్లు

నాటుకోళ్లతో.. కాసుల గలగల

- ఏడాదికి రూ.5లక్షలకు పైగా సంపాదిస్తున్న ప్రైవేట్ లెక్చరర్
- వ్యవసాయం, కోళ్ల పెంపకంలో ఆదర్శంగా నిలుస్తున్న రాంబాబు

భీమదేవరపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆయన ఓ ప్రైవేట్ లెక్చరర్.. ఉద్యోగ బాధ్యతలోనే కాదు వ్యవసాయంలోనూ, నాటు కోళ్ల పెంపకంలోనూ బేష్ అనిపించుకుంటున్నారు. ఒక్క నాటుకోళ్ల పెంపకం ద్వారానే ఏడాదికి రూ.5లక్షలకు పైగా ఆదాయం ఆర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ముల్కనూర్‌కు చెందిన నీలం రాంబాబు. రాంబాబు ఎంకామ్, బీఈడీ పూర్తి చేసి.. 20ఏళ్లుగా హనుమకొండ, ముల్కనూర్ ప్రాంతాల్లోని ప్రైవేట్ కళాశాల్లో కామర్స్, అకౌంట్స్ పాఠాలు బోధిస్తుంటారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కళాశాలలో విద్యాబోధన చేస్తారు. దీంతో పాటు తనకు వారసత్వంగా వచ్చిన ఆరెకరాల భూమిలో వ్యవసాయం చేస్తుంటాడు. అయితే ఆరేళ్ల క్రితం ఒక నాటుకోడిని పందెం కోడితో క్రాస్ చేయించగా.. మేలైన నాటుకోడి పిల్లలు రావడంతో ఆయన నాటుకోళ్ల పెంపకంపై దృష్టి సారించారు. అనుకున్నదే తడవుగా తన మామిడి తోటలో సుమారు 20గుంటల్లో నాటు కోళ్ల పెంపకానికి షెడ్డు వేసి నాటుకోడి గుడ్లను పొదిగేయడం, పిల్లలు ఉత్పత్తి చేయించడం ప్రారంభించారు. అయితే ఆ పిల్లలు నాణ్యంగా ఉండడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వారు వచ్చి ఆ పిల్లలను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఒక్కో నాటుకోడి పిల్లను రూ.100వరకు అమ్ముతుండగా ఇలా ఏడాది 3వేల నాటుకోడి పిల్లలను అమ్ముతున్నారు. అలాగే మరో 400 నాటుకోళ్ల ద్వారా ఇతర ప్రాంతాలకు అమ్ముతున్నారు. హోల్‌సేల్‌గా కిలో నాటుకోడిని రూ.350చొప్పున విక్రయిస్తుండగా హైదరాబాద్, హుజూరాబాద్, సిద్దిపేట, జనగామ, భూపాలపల్లి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలా సంవత్సరానికి నాటుకోళ్లు, పిల్లల అమ్మకం ద్వారా రూ.5 లక్షల నుంచి రూ.7లక్షల వరకు ఆర్జిస్తున్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో పెంపకం..

ఆహ్లాదకరమైన వాతావరణంలో కోళ్ల పెంపకం చేయడంతో నాటుకోళ్లు ఎలాంటి రోగాల బారిన పడడం లేదు. చుట్టూ మామిడి తోట, పచ్చని పొలాలు ఉండడంతో అవి ఆరోగ్యంగా పెరుగుతున్నాయి. వీటికి తక్కువ ఖర్చుతోనే ఆహారాన్ని సైతం అందిస్తున్నారు. కేవలం వడ్లు, బియ్యంతో పాటు తన పొలంలో పండిన చెడిపోయిన టమాటాలను దాణాగా వేస్తున్నారు. అయితే పసుపు కలిపిన బియ్యాన్ని వేయడం ద్వారా వాటికి రోగాలు దరిచేరవని రాంబాబు పేర్కొంటున్నాడు.

మీకు తెలుసా?



ఒక మండలం.. మూడు రైల్వేస్టేషన్లు

సాధారణంగా ఒక మండలం పరిధిలో ఒకటి, రెండు రైల్వేస్టేషన్లుంటాయి. ఇందుకు భిన్నంగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం మండలంలో మూడు రైల్వే స్టేషన్లు ఉండడం విశేషం. కాజీపేట-విజయవాడ రైల్వేసెక్షన్ మధ్య జాతీయస్థాయిలో ప్రముఖమైన గ్రాండ్‌ట్రంక్ మార్గంలో ఇంటికన్నె, కేసముద్రం, తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్లు కేసముద్రం రెవెన్యూ మండల పరిధిలో ఉండడం గమనార్హం. మండల విస్తీర్ణంలో యాదృచ్ఛికంగా ఒక చివరి నుంచి మరో చివర వరకు 18 కిలోమీటర్ల పొడవైన రైల్వేట్రాక్ ఉంది. ఈ ట్రాక్ పరిధిలో అవాస ప్రాంతాలు మూడుచోట్ల ఉండడంతో కొన్ని దశాబ్దాల క్రితమే ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు అనుకూలంగా మూడు రైల్వేస్టేషన్లను రైల్వేశాఖ ఏర్పాటు చేసిందని ఒకే మండల పరిధిలో మూడు రైల్వే స్టేషన్లుండడం రాష్ట్రంలో ఎక్కడా లేదని పలువురు రైల్వే అధికారులు చెబుతున్నారు. ఇటీవలి భారీ వరదల సమయంలో ఇంటికన్నె-కేసముద్రం, తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్ కొట్టుకుపోయి నాలుగు రోజులపాటు రైళ్లరాకపోకలు బంద్‌కావడం జాతీయస్థాయి ఘటనగా నిలిచింది.

- కేసముద్రం

ఆదర్శం



ప్రభుత్వ పాఠశాలలో కూతురికి అడ్మిషన్ తీసుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సుమతి

తాను పనిచేసే బడిలోనే కూతురికి అడ్మిషన్

ఆదర్శంగా నిలిచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

ఆమె ఇటీవలే ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగంలో చేరారు. అంతేకాదు తాను పనిచేసే పాఠశాలలోనే తన కూతురిని కూడా చేర్పి ఆదర్శంగా నిలిచారు మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారానికి చెందిన వెన్నెం సుమతి. 2024 డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా తన స్వగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే విధుల్లో చేరిన ఆమె తన కుమార్తె అద్వినికకు కూడా ఒకటో తరగతిలో అడ్మిషన్ తీసుకొని పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సుమతిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధరావత్ కిషన్‌నాయక్ అభినందించారు.

- దంతాలపల్లి

నేటి దృశ్యం



ఇంద్రధనస్సు విరిసె..

ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత.. మధ్యాహ్నానికి వాతావరణం ఒక్కసారిగా మారింది. అనుకోని అతిథిలా వర్షం కురిసింది. ఆ సమయంలో నల్లని మబ్బులు కమ్మిన ఆకాశంలో ఇంద్రధనస్సు విరిసింది. హనుమకొండ బాలసముద్రం ప్రాంతంలోని చూడముచ్చటైన ఈ దృశ్యాన్ని చూసిన పట్టణ వాసుల మనసులు పులకించాయి.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

మత్స్యకారుల పూజలందుకునే మహా వృక్షం

- 200ఏళ్ల కట్టమైసమ్మ చింత చెట్టుకు ప్రత్యేకత



అది వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట గ్రామం. ఆ గ్రామంలోని గుండం చెరువు కట్టపై ఉన్న కట్టమైసమ్మ చింత చెట్టుకు సుమారు 200 ఏళ్ల ఉన్నట్టు గ్రామస్థులు చెబుతుంటారు. స్థానికులు కట్టమైసమ్మ చింతచెట్టుగా పిలుచుకునే ఈ మహావృక్షం మత్స్యకారుల పూజలందుకుంటోంది. గ్రామంలోని సుమారు 300 మంది మత్స్యకారులు.. చెరువులో చేపలు పట్టే సమయంలో ఈ చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తారు. కోళ్లు, గొర్రెలను బలిచ్చిన ఆనంతరమే చేపలు పట్టుకుంటారు. గొర్రెల, కోళ్లను బలిచ్చిన తర్వాత వాటి కాళ్లను వేరుచేసి చెట్టు కొమ్మలకు కట్టి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఒక్క మత్స్యకారులే కాదు గ్రామంలోని మిగతా కులాల వారు కూడా మైసమ్మ చింత చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తారు. మరో విశేషం ఏంటంటే.. కాకతీయుల కాలంలో ఈ చెరువును నిర్మించారని, అదే సమయంలో కట్టపై చింత చెట్టు మొలిచిందని, తమ పూర్వీకుల నుంచే మైసమ్మ చింత చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.

- దుగ్గొండి

ఐదేళ్ల చిన్నారి.. అదరహో..

కూచిపూడిలో సత్తా చాటుతున్న రిహాన్షి



కలెక్టర్ రిజ్వాన్ బాషా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రిహాన్షి



కళ

జనగామ కల్చరల్, అక్టోబరు 21 : ఆ చిన్నారి వయసు ఐదేళ్లు. అయితేనేం కూచిపూడి నాట్యం చేయడంలో దిట్ట. చిన్నతనంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ అందరి మన్ననలు పొందుతోంది. అంతే కాదు వివిధ రాష్ట్రాల్లోని ప్రముఖ దేవస్థానాలు, వేదికలపై నృత్య ప్రదర్శనలిస్తూ ప్రముఖుల నుంచి సత్కారాలు, ప్రశంసాపత్రాలు, అవార్డులు అందుకుంటోంది. ఆమే.. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన నరసింహమూర్తి, శ్వేతాలక్ష్మి దంపతుల కుమార్తె కె.ఎల్.ఆర్.రిహాన్షి. ప్రైవేటు ఉద్యోగి అయిన నరసింహమూర్తి తన కుమార్తెకు నాట్యంపై ఉన్న ఆసక్తిని గమనించి జనగామ జిల్లా కేంద్రంలోని మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రంలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రస్తుతం రెండో తరగతి చదువుతున్న రిహాన్షి నృత్యంతో పాటు చదువులోనూ ప్రతిభ కనబరుస్తోంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఫిబ్రవరిలో జనగామలో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాల్లో 41 నిమిషాల పాటు నిరంతర నృత్య ప్రదర్శన చేయడంతో పాటు 42వేమన పద్యాలను చెప్పి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకుంది. దీంతో ఐదేళ్ల వయసులో ఈ రికార్డు నమోదు చేయడం మొదటిసారి కావడంతో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడెమీ వారు 'స్ట్రాంగ్ గర్ల్' పేరుతో హీరో సుమన్ చేతుల మీదుగా రుద్రమదేవి అవార్డు ఇచ్చి గౌరవించారు.

రిహాన్షి ఇచ్చిన ప్రదర్శనల్లో కొన్ని..

రాంకోటిలోని తెలంగాణ సరస్వత పరిషత్‌లో హీరో సుమన్ సమక్షంలో మొదటి ప్రదర్శన ఇచ్చిన రిహాన్షి.. కడ్తాల్‌లో పిరమిడ్ ఆధ్యాత్మిక సంస్థ వేదికపై అనేక ప్రదర్శనలు ఇచ్చింది. అలాగే బెంగళూరు, షిరిడీ సాయినాథుడు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో పలుమార్లు ప్రదర్శనలు ఇచ్చింది.

వీటితో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న రిహాన్షి గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ఆధ్వర్యంలో కళాకారుల సమ్మేళనంలో నృత్య ప్రదర్శన ఇచ్చి గవర్నర్ ప్రశంసలందుకుంది. బుద్ధ గయ లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పర్యావరణ శాఖ మంత్రి ప్రేమ్‌కుమార్ సమక్షంలో ప్రదర్శనలో పాల్గొంది. రిపబ్లిక్‌డే, పంద్రాగస్టు, గురుపూజోత్సవ కార్యక్రమాల్లో ప్రదర్శనలిచ్చి పూర్వ, ప్రస్తుత కలెక్టర్లు శివలింగయ్య, షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ సీతారాంల నుంచి ప్రశంలందుకుంది.

పోలీసు అమరులు ప్రజల గుండెల్లోనే ఉంటారు

- వారి త్యాగాలు చిరస్మరణీయం
- సంస్మరణ దినోత్సవంలో సీపీ అంబర్ కిశోర్ ఝా
- హాజరైన కలెక్టర్లు ప్రావీణ, సత్యశారద, అమరుల కుటుంబాల సభ్యులు



నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా





నివాళులర్పిస్తున్న కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద



శోక శస్త్రేతో నివాళులర్పిసున్న పోలీసులు





నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

హనుమకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాణత్యాగాలు చేసిన పోలీసు అమర వీరులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. సోమవారం వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆవరణలోని పోలీసు అమర వీరుల స్థూపం వద్ద పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవావం సందర్భంగా గతే డాది నుంచి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 241 మంది పోలీసు అమర వీరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. అనం తరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీతో పాటు వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, ప్రావీణ్య, కల్నల్ రవి కుమార్, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, అదనపు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, అ మరుల కుటుంబాల సభ్యులు, ఇతర పోలీసు సిబ్బంది స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆర్ఐ స్పర్జన్ సారథ్యంలో సా యుధ పోలీసులు శోక్ శ్రస్త్ర చేసి మరణించిన పోలీసు అమర వీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది, అమర వీరుల కుటుంబ సభ్యులు రెండు నిమి షాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ ఝా మాట్లాడుతూ పోలీసు అమర వీరుల త్యాగాలను మరువలేమని, వారు ఎల్లప్పుడు మన గుండెల్లోనే ఉంటారన్నారు.

పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నప్పుడు కొందరు కుటుంబ సభ్యులు కన్నీళ్లు ఆపుకోలేక పోయారు. స్థూపం ముందు విలపించిన దృశ్యాలు హృదయాలను ద్రవింప చేశాయి. ఆ తర్వాత పోలీసు కమిషనరేట్ కార్యాలయం నుంచి మిషన్ ఆస్పత్రి వరకు నిర్వహించిన ర్యాలీలో పోలీసులు, అధికారులు, సిబ్బంది పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులతో పాటు పోలీసు జాగృతి కళా బృందం సభ్యులు పాల్గొని అమర వీరులకు జోహార్లు అర్పించారు.





ఎమర్జెన్సీ మెడిసిన్

అత్యవసర చికిత్స అవసరం ఏ మేరకు?

అత్యవసర వైద్యం అందవలసిన సమయాల్లో, ఎమర్జెన్సీ మెడిసిన్‌ను ఆశ్రయించక తప్పదు. అయితే అంతకంటే ముందు ఆస్పత్రికి చేరేలోగా, తక్షణ చికిత్సనెలా అందించాలో తెలుసుకోవాలి. అప్పుడే పరిస్థితి మరింత దిగజారకుండా కాపాడుకోగలుగుతాం!

ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలిపోతే మొదట కంగారు పడిపోతాం! బెంబేలెత్తిపోతాం! అయోమయంలో పడిపోతాం! తర్వాత హడావుడిగా ఆస్పత్రికి పరుగులు తీస్తాం! సాధారణంగా ఎవరైనా ఇలాగే ప్రవర్తిస్తారు. కానీ ఆస్పత్రికి చేరేలోగా పరిస్థితి విషయమించవచ్చు. దారిలోనే ప్రాణాలూ పోవచ్చు. మరీ ముఖ్యంగా గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైనప్పుడు ఏ కాస్త సమయం కూడా వృథా కాకుండా చూసుకోవాలి. లక్షణాలను బట్టి సమస్య తీవ్రతను గుర్తించి, తక్షణ చికిత్సను అనుసరించాలి. అదే సమయంలో వీలైనంత త్వరగా ఎమర్జెన్సీ మెడిసిన్ సేవలను అందించాలి.

ఎమర్జెన్సీ మెడిసిన్ అంటే?

గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్, ట్రామా, తీవ్రమైన రక్త స్రావం జరగడం లాంటి ప్రాణాంతక సందర్భాలన్నీ ఎమర్జెన్సీ మెడిసిన్ కోవలోకే వస్తాయి. ఈ సందర్భాల్లో మొదట రోగిని స్టెబిలైజ్ చేసి, ప్రాణాలు పోకుండా కాపాడడాన్నే వైద్యులు లక్ష్యంగా పెట్టుకుంటారు. నిజానికి చాలా సందర్భాల్లో అసలు చికిత్స అంబులెన్స్‌లోనే మొదలవుతూ ఉంటుంది. రోగి ఆస్పత్రికి చేరుకునేలోపే అవసరమైన ఏర్పాట్లన్నీ వైద్యులు సిద్ధం చేసుకుంటారు. లక్షణాలు, సమస్య తీవ్రత ఆధారంగా, ఓ పక్క పరీక్షలతో కారణాన్ని నిర్ధారిస్తూనే, మరోపక్క సంబంధిత అవయవాన్ని కోల్పోకుండా రక్షణ చికిత్సలను మొదలుపెడతారు. ఇంతటి కీలకమైన సమయాల్లో, ఎక్కువ మంది వైద్యులు సమిష్టిగా సమస్యను విశ్లేషించి, తదనుగుణ చికిత్సతో రోగి ఆరోగ్య పరిస్థితిని కుదేలవకుండా కాపాడతారు. ఊపిరి పీల్చుకోలేని పరిస్థితిలో ఆస్పత్రికి చేరుకోబోయే రోగి కోసం వెంటిలేటర్‌ను సిద్ధం చేయడం, బిపి పడిపోయిన రోగి కోసం ఫ్లూయిడ్స్, రక్తపోటును పెంచే మందులు సిద్ధం చేసుకుంటారు.

గుండె పోటు వస్తే?

గుండె పోటును గ్యాస్ట్రిక్ సమస్యగా పొరబడే సందర్భాలు ఎక్కువ. దాంతో అజీర్తిని తొలగించే మందులు లేదా అసిడిటీ మందులు వాడుకుని, వాటితో అసౌకర్యం తగ్గకుండా పెరిగిపోయినప్పుడు మాత్రమే, రోగులను వైద్యుల దగ్గరకు తీసుకొస్తూ ఉంటారు. కానీ అప్పటికే గుండెకు జరగవలసిన నష్టం జరిగిపోతుంది. కాబట్టి గుండె పోటు లక్షణాలను కచ్చితంగా కనిపెట్టడం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి. గుండె పోటును తగ్గించడం కోసం వెంటనే యాస్పిరిన్ మాత్రను తినిపించవచ్చు. గుండె ఆగిపోయిన సందర్భాల్లో సిపిఆర్ చేయాలనే విషయం కూడా అందరికీ తెలిసిందే! ఆగిపోయిన గుండెను కృత్రిమంగా పని చేయించడమే సిపిఆర్. ఛాతీ మీద నొక్కడం ద్వారా గుండె మీద ఒత్తిడి పెరిగి, పని చేయడం మొదలుపెడుతుంది. అయితే సిపిఆర్ చేసే సమయంలో కొన్ని అంశాలు గుర్తు పెట్టుకోవాలి. కొన్నిసార్లు సిపిఆర్ చేసిన తర్వాత, సదరు వ్యక్తిలో స్పందన గమనించాలి. వాళ్లను పిలిచి, తట్టి మేల్కొనేలా చేయాలి. వాళ్లు స్పందించినా, లేకపోయినా అత్యవసర సేవల విభాగానికి వీలైనంత త్వరగా తీసుకువెళ్లాలి. కొన్ని వాణిజ్య ప్రదేశాల్లో, మాల్స్‌లో ప్రస్తుతం డిఫిబ్రిలేటర్స్ అందుబాటులో ఉంటున్నాయి. సిపిఆర్ కోసం వాటిని కూడా వినియోగించుకోవచ్చు.

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైతే?

బ్రెయిన్ స్ట్రోక్ వేర్వేరు లక్షణాల రూపంలో బయల్పడుతూ ఉంటుంది. అయితే ప్రధానంగా ఒక లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది. నవ్వినప్పుడు ముఖంలో సగ భాగంలో ఎలాంటి మార్పూ లేకపోవడం, లేదా ఒక చేయి బాగా పని చేస్తున్నా, మరో చేయి సరిగా పని చేయకపోవడం, కాళ్లలో కూడా ఇదే లక్షణం కనిపించడం బ్రెయిన్ స్ట్రోక్‌లో సర్వసాధారణం. ఇలా సగభాగం శరీరంలో బలహీనత కనిపించడం (పక్షవాతం), వస్తువులను పట్టుకోలేకపోవడం, నడక తడబడడం మొదలైన లక్షణాలను గమనించాలి. ఇంకొన్ని బ్రెయిన్ స్ట్రోక్స్‌లో మగతగా ఉండడం, నిలబడలేకపోవడం, నడిచినప్పుడు ఒక పక్కకు పడిపోవడం, ఒకటి లేదా రెండు కళ్లలో కంటి చూపు కోల్పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటప్పుడు ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. మెదడులోని రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం మూలంగా తలెత్తే ఈ సమస్యకు సత్వర చికిత్స అవసరమవుతుంది. వీలైనంత త్వరగా మందులతో లేదా సర్జరీతో రక్తపు గడ్డను కరిగించడం లేదా తొలగించడం చేయగలిగితే మెదడుకు జరిగే నష్టం తగ్గుతుంది. లక్షణాలు కూడా మెరుగు పడతాయి. ఆలస్యమయ్యేకొద్దీ తిరిగి సరిదిద్దలేని దుస్థితికి పరిస్థితి దిగజారుతుంది. కాబట్టి ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు తక్షణమే స్పందించాలి.

అవయవం కోల్పోతే?

రోడ్డు ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయినప్పుడు, లేదా వంటింట్లో ప్రమాదవశాత్తూ వేలు పూర్తిగా తెగిపోయినప్పుడు కూడా వేగంగా స్పందించాలి. అలాంటి సమయాల్లో రక్తస్రావం మూలంగా ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే అవకాశాలు ఎక్కువ. కాబట్టి వెంటనే తెగిపోయిన ప్రదేశానికి పైన తాడు, బెల్టు లేదా చున్నీతో గట్టిగా కట్టేసి, రక్తస్రావాన్ని ఆపేయాలి. తెగిన అవయవాన్ని పైకి లేపి ఉంచాలి. అలాగే తెగి పడిన అవయవాన్ని శుభ్రమైన ప్లాస్టిక్ సంచిలో ఉంచి, మరో సంచిలో చల్లని నీళ్లను నింపి, దాన్లో అవయవం ఉంచిన సంచిని వేసి, రోగితో పాటు ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.

ఎమర్జెన్సీ వైద్య విధానం ఇదే!

గుండెపోటుతో ఎమర్జెన్సీకి చేరుకున్న రోగి విషయంలో, గుండె రక్తనాళంలో ఏర్పడిన రక్తపు గడ్డను తొలగించడమే ప్రధాన లక్ష్యంగా వైద్యులు నడుచుకుంటారు. సిటి స్కాన్, ఎమ్మారై చేస్తూనే, రక్తపు గడ్డను కరిగించే మందులు ఇస్తారు. తీవ్రతను బట్టి స్టెంట్ వేయడం కోసం క్యాథ్ ల్యాబ్‌కు తీసుకువెళ్తారు. ఈ పనులన్నిట్లో వైద్యుల బృందం ప్రమేయం ఉంటుంది. ఈ బృందంలో ఎమర్జెన్సీ వైద్యులతో పాటు, రేడియాలజిస్టులు, న్యూరాలజిస్టులు కలిసి రోగిని స్టెబిలైజ్ చేస్తారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వ్యక్తికి నాలుగున్నర గంటల్లోపు మెదడులోని రక్తపు గడ్డను కరిగించే మందులు ఇవ్వాలి. ఈ మందులతో గడ్డ కరిగిపోతుంది. ఆ కీలక సమయం దాటితే పరిస్థితి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. కాబట్టి ఈ సమస్యతో ఎవరైనా ఎమర్జెన్సీకి చేరుకుంటే, వెంటనే ఆస్పత్రిలో 'స్ట్రోక్ కోడ్'ను ప్రకటిస్తారు. దాంతో ఆస్పత్రిలోని సిబ్బంది మొత్తానికీ బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వ్యక్తి ఆస్పత్రికి చేరుకున్న విషయం తెలిసిపోతుంది. దాంతో ఎమ్మారై కోసం, రేడియాలజిస్ట్ సిద్ధంగా ఉంటాడు. ఎమ్మారై చేస్తూనే రక్తపు గడ్డను గుర్తించి, వెంటనే చికిత్స మొదలుపెడతారు. ఇక అవయవాలు తెగిపోయిన సందర్భాల్లో ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జన్ల బృందం పరిస్థితిని విశ్లేషిస్తుంది. తెగిపోయిన అవయవాన్ని తిరిగి అతికించే అవకాశాలను కూడా పరీక్షిస్తుంది. ఇలా అన్ని సందర్భాల్లో సాధ్యపడకపోవచ్చు. వయసు, గాయం రకం, తీవ్రత.. ఇలా ఎన్నో అంశాలను వైద్యులు పరిగణలోకి తీసుకుంటారు. అలా సాధ్యాసాధ్యాలను విశ్లేషించుకున్న వైద్యులు, అంతిమ నిర్ణయం తీసుకుంటారు.



డాక్టర్ ఇమ్రాన్ షరీఫ్
క్లినికల్ హెడ్, ఎమర్జెన్సీ మెడిసిన్,
స్టార్ హాస్పిటల్స్,
బంజారాహిల్స్ హైదరాబాద్.

గుడ్ ఫుడ్

బి12 లోపిస్తే?

శాకాహారులు ఎదుర్కొనే ప్రధాన సమస్య బి12 లోపం. కొన్ని స్పష్టమైన లక్షణాల రూపంలో ఈ లోపం బయటపడుతూ ఉంటుంది. వాటిని గమనిస్తూ, వైద్యుల సూచన మేరకు బి12ను భర్తీ చేస్తూ ఉండాలి.

నాడుల ఆరోగ్యం, ఎర్ర రక్తకణాల ఉత్పత్తి, మెదడు పనితీరులకు బి12 అవసరం. ఈ విటమిన్ లోపిస్తే, పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. భిన్నమైన లక్షణాలు, మూల కారణాన్ని కచ్చితంగా కనిపెట్టే వీలు లేకుండా, అయోమయానికి గురి చేస్తాయి. కాబట్టి బి12 లోపంతో తలెత్తే లక్షణాల మీద అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం.

చేతుల్లో, పాదాల్లో చిత్రమైన సమస్య

విటమిన్ బి12 లోపం ప్రారంభంలో చేతుల్లో, పాదాల్లో సూదులతో పొడుస్తున్నట్టు అనిపిస్తుంది. ఈ చిత్రమైన లక్షణానికి కారణం బి12 లోపం మూలంగా, నాడీ కణాలు సమర్థంగా పని చేయకపోవడమే! ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే, నాడులకు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి చేతుల్లో, పాదాల్లో సూదులతో గుచ్చుతున్నట్టు అనిపిస్తే, వెంటనే వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.



గుండె దడ దడ

విటమిన్ బి12 తగ్గితే, రక్తంలో ఆక్సిజన్ మోతాదు కూడా తగ్గుతుంది. దాంతో రక్తాన్ని సరఫరా చేయడం కోసం గుండె అవసరానికి మించి కష్టపడవలసి వస్తుంది. దాంతో గుండె దడ పెరుగుతుంది. అకస్మాత్తుగా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టినా, గుండె వేగంలో హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నా బి12 లోపంగా భావించాలి.

పాలిపోయిన చర్మం

నవనవలాడే చర్మం ఆరోగ్య లక్షణం. కానీ బి12 లోపంతో బాధపడే వ్యక్తుల చర్మం పాలిపోయి, జీవం కోల్పోతుంది. ఇందుకు కారణం ఎర్ర రక్తకణాల ఉత్పత్తి తగ్గడమే! రక్తకణాల ఉత్పత్తికి బి12 దోహదపడుతుంది. ఈ విటమిన్ లోపిస్తే, రక్తలేమి తలెత్తి, చర్మం పాలిపోతుంది. ఈ విటమిన్ లోపంతో ఎర్ర రక్త కణాలు ఛిద్రమైపోతూ ఉంటాయి. దాంతో చర్మం లేత పసుపు రంగులోకి మారుతుంది. ఇలా చర్మం అకారణంగా రంగు మారితే, విటమిన్ బి12 లోపంగా గ్రహించాలి.

నోట్లో పుండ్లు

విటమిన్ బి12 ఆరోగ్యకరమైన కణ నిర్మాణానికి సహాయపడుతుంది. ఈ విటమిన్ లోపం వల్ల, నోట్లో తరచూ పుండ్లు ఏర్పడుతూ, తగ్గడానికి ఎక్కువ సమయం పడుతూ పడుతూ ఉంటుంది. అలాగే పుండ్లు తరచూ తిరగబెడుతూ ఉంటాయి. ఇలా పెదవులు, బుగ్గల లోపల పుండ్లు తలెత్తుతూ ఉంటే, విటమిన్ బి12 లోపంగానే పరిగణించాలి.

ఇబ్బంది పెట్టే చలి

రక్తంలో ఆక్సిజన్ మోతాదు తగ్గడం వల్ల చర్మంలోని రక్తనాళాలకు సరిపడా ఆక్సిజన్ అందక చలి పెరుగుతుంది. ఇతరులకు సౌకర్యంగా ఉన్న తాపమానం, మనల్ని అసౌకర్యానికి గురి చేస్తోందంటే విటమిన్ బి12 లోపంగా భావించాలి. చల్లదనాన్ని తట్టుకోలేకపోవడం, తక్కువ తాపమానాలను ఏమాత్రం తట్టుకోలేకపోవడం బి12 లోపంలో కనిపించే ప్రధాన లక్షణం.

ఘోస్ట్ పూప్

కాలకృత్యాల్లో ఇలా...

టాయిలెట్‌కు వెళ్లినప్పుడు సుఖ విరోచనం మీదే దృష్టి పెడతాం! కానీ మన జీర్ణవ్యవస్థ పనితీరు ఎంత భేషుగ్గా ఉందో తెలుసుకోవాలంటే, కమోడ్ మీద కూడా దృష్టి పెట్టాలి.

టాయిలెట్‌కు వెళ్లిన తర్వాత ఫ్లష్ ఆన్ చేస్తాం. ఆ నీళ్లతో టాయిలెట్ పూర్తిగా శుభ్రపడాలి. అంటే, అశుద్ధం ఆనవాళ్లేవీ దాన్లో కనిపించకూడదు. అలా కాకుండా అశుద్ధం టాయిలెట్ గోడలకు అంటుకుని ఉండిపోతున్నా, నీళ్లతో వదిలించడం కష్టంగా ఉన్నా, మన జీర్ణ వ్యవస్థ అవసరమైనంత సమర్థంగా పని చేయడం లేదని అర్థం చేసుకోవాలి అంటున్నారు గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు. ఇలా వదలని అశుద్ధాన్ని సులువుగా సంబోధించడం కోసం, వైద్యులు, ఘోస్ట్ పూప్ లేదా, ఫాంటమ్ పూప్ అనే పేర్లు కూడా పెట్టుకున్నారు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉన్నప్పుడు, మనం తినే ఆహారంలోని ప్రతిదీ పూర్తిగా జీర్ణమౌతుంది. దాంతో అశుద్ధంలో ఎలాంటి వాయువులూ, కొవ్వులూ చేరుకోవు. దాంతో టాయిలెట్‌కు వెళ్లినప్పుడు, అశుద్ధం ఎటువంటి ఆనవాళ్లూ లేకుండా తేలికగా నీళ్లతో కొట్టుకుపోతుంది. పరిపూర్ణమైన జీర్ణవ్యవస్థకు ఇదే సూచన. ఇందుకు విరుద్ధమైన లక్షణాలు టాయిలెట్‌లో కనిపిస్తే, మన జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని అనుమానించాలి. సమస్యను సరిదిద్దుకోవడం కోసం వైద్యుల సూచన మేరకు ఆహారపుటలవాట్లను సరిదిద్దుకుని, జీర్ణ వ్యవస్థను మెరుగు పరుచుకోవాలి.



గట్ హెల్త్

కడుపు ఉబ్బరం.. ఉఫ్

భారతీయులకు పిండిపదార్థాల పట్ల మక్కువ ఎక్కువ. పప్పుదినుసులు, పిండ్లు, బియ్యం... మన ప్రధాన ఆహారం. కాబట్టే కడుపు ఉబ్బరం అత్యంత సాధారణమైన ఆరోగ్య సమస్యగా మారిపోయింది. అయితే ఈ సమస్యను పరిష్కరించుకునే మార్గాలు కూడా ఉన్నాయి.

పప్పుదినుసులు, తృణధాన్యాల్లో పిండిపదార్థాలు ఎక్కువ. వీటిని పేగులు శోషించుకోడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో పేగుల్లో బ్యాక్టీరియా ఉత్పత్తై కడుపుబ్బరం, త్రేన్పులు వేధిస్తాయి. పేగుల్లోని మంచి, చెడు బ్యాక్టీరియల్లో హెచ్చుతగ్గులు, సున్నితమైన జీర్ణాశయం, వేగంగా తినడం, ఆహారాన్ని సరిగా నమలకపోవడం వల్ల కూడా పొట్టలో వాయువులు ఉత్పత్తవుతాయి.

ఒత్తిడి కూడా కారణమే!

ఒత్తిడి అజీర్తిని పెంచుతుంది. కడుపులోని కండరాలు బిగుతుగా మారతాయి. వ్యాధినిరోధకశక్తి కూడా కుంటుపడుతుంది. పొట్టలో ఆమ్లం ఉత్పత్తి కూడా



పెరుగుతుంది. దాంతో అవసరానికి మించి పిండిపదార్థాల మీద యావ పెరగడం, అవి జీర్ణం కాలేకపోవడం వల్ల కడుపులో వాయువులు ఉత్పత్తవడం మొదలవుతుంది. ఇవన్నీ కడుపుబ్బరానికి దారి తీస్తాయి.

వంటింటి చిట్కాలు

గోరువెచ్చని నీళ్లలో జీలకర్ర, వాము, సోంపు గింజలు నానబెట్టి తాగితే కడుపుబ్బరం తగ్గుతుంది. అలాగే దాల్చినచెక్కలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. కాబట్టి దాల్చినచెక్క తీసుకుంటే, ఇన్‌ఫ్లమేషన్, రక్తంలో చక్కెర, ట్రైగ్లిజరైడ్స్ తగ్గుతాయి. వాంతులను తగ్గించి, జీర్ణశక్తిని పెంచే గుణం కూడా దాల్చినచెక్కకు ఉంటుంది. వెల్లుల్లి, తోటకూర విత్తనాలు, అరటిపండు, వంకాయలు ప్రిబయాటిక్స్‌కు కోవకు చెందుతాయి. గ్రీన్‌టీ, యాపిల్స్‌లో ఉండే పాలిఫినాల్స్ పేగుల్లో ప్రొబయాటిక్స్‌ను పెంచి, పేగుల ఆరోగ్యాన్ని కాపాడతాయి. కాబట్టి ప్రొబయాటిక్స్, పాలిఫినాల్స్‌ను తీసుకుంటూ ఉండాలి. నెయ్యి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. కాబట్టి జీర్ణశక్తిని పెంచుకోడానికి, కల్తీ లేని తాజా నెయ్యి పరిమితంగా తీసుకోవాలి. నూనెలో వేయించే పదార్థాలు పేగుల్లో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి. జీర్ణశక్తిని కుంటుపరుస్తాయి. కడుపుబ్బరాన్ని పెంచుతాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలి.

వీటికి దూరం

గ్లూటెన్, డైరీ, ప్రాసెస్డ్ ఫుడ్స్‌ను తగ్గిస్తే, కడుపుబ్బరం అదుపులోకొస్తుంది. తరచూ యాంటీబయాటిక్స్ వాడుతూ ఉండడం, సలాడ్స్ తింటూ ఉండడం వల్ల పేగుల్లోని బ్యాక్టీరియాలో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలి.


అడిక్షన్

మందులు వ్యసనంగా మారితే?

నొప్పి తగ్గించే మందులతో తక్షణ ఉపశమనం దొరికే మాట నిజమే! అయితే వాటికి అలవాటు పడే ముప్పు కూడా పొంచి ఉంటుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి. దీర్ఘకాలంలో అంతర్గత అవయవాలను సైతం దెబ్బతీసే ప్రమాదం ఉన్న ఈ మందులతో అప్రమత్తంగా వ్యవహరించాలంటున్నారు వైద్యులు.

తలనొప్పి వేధిస్తే మందుల షాపుకు వెళ్లి పెయిన్ కిల్లర్ కొని వాడుకుంటాం! అంతే తప్ప వెంటనే డాక్టర్ల దగ్గరకు పరుగులు తీయం. అయితే నొప్పిని తగ్గించే ఈ మందుల వాడకంతో రెండు రకాల సమస్యలు పొంచి ఉంటాయి. వీటితో తక్షణ ఉపశమనం దక్కుతుంది కాబట్టి నొప్పికి మూల కారణాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడంతో, దాంతో సమస్య మరింత ముదిరిపోయి చికిత్సకు లొంగని పరిస్థితి తలెత్తవచ్చు. అంతే కాకుండా నొప్పి తగ్గడంతో కలిగే ఉపశమనానికి అలవాటు పడిపోయి, నొప్పి నివారణ కోసం అవే మందుల మీద ఆధారపడుతూ, వాటికి వ్యసనపరులుగా మారిపోతూ ఉంటాం. ఇంతకంటే ప్రమాదకరమైన ఇంకొక సమస్య ఏంటంటే, కొన్ని నొప్పి నివారణ మందులు కాలేయం, మూత్రపిండాలు మొదలైన అంతర్గత అవయవాల మీద ప్రభావం చూపిస్తాయి. అప్పటికే ఆ అవయవాల్లో సమస్యలున్న వాళ్లకు, పెయిన్ కిల్లర్స్ మరింత చేటు చేస్తాయి. నిజానికి తలనొప్పి, కాళ్ల నొప్పులు, కడుపు నొప్పి లాంటి సర్వసాధారణమైన నొప్పులు, బాధలను తగ్గించుకోవడం కోసం అడపా దడపా పెయిన్ కిల్లర్స్ వాడితే ఫరవాలేదు. కానీ అన్ని నొప్పులకూ వాటి మీదే ఆధారపడడం ఎంత వరకూ సమంజసమో ఎవరికి వారు ఆలోచించుకోవాలి.

> కొన్ని నొప్పి నివారణ మందులు కాలేయం, మూత్రపిండాలు మొదలైన అంతర్గత అవయవాల మీద ప్రభావం చూపిస్తాయి. అప్పటికే ఆ అవయవాల్లో సమస్యలున్న వాళ్లకు, పెయిన్ కిల్లర్స్ మరింత చేటు చేస్తాయి. గుండె జబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి పైబడే వయసుతో కూడిన ఇతరత్రా ఆరోగ్య సమస్యలుంటే ప్రధాన అంతర్గత అవయవాలు అప్పటికే కొంత మేరకు దెబ్బ తిని ఉంటాయి. కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లు ఎన్ఎస్ఐడి పెయిన్ కిల్లర్స్‌ను వాడుకుంటే నష్టం రెండింతలుంటుంది.



పెయిన్ కిల్లర్స్ ఎప్పుడు?

చికిత్సకు అవకాశం లేకుండా, పూర్తిగా ముదిరిపోయిన కేన్సర్లతో బాధపడే రోగులకు, వాళ్ల జీవన నాణ్యతను పెంచడం కోసం వైద్యులు నొప్పి తగ్గించే మందులు సూచిస్తూ ఉంటారు. ఇంకొందరికి జ్వరంతో పాటు ఒళ్లు నొప్పులు వేధిస్తాయి. ఇంకొందరికి ఆర్థ్రయిటిస్‌తో కీళ్ల నొప్పులు ఇబ్బంది పెడతాయి. మయాల్జియాలో తీవ్రమైన కండరాల నొప్పులు ఉంటాయి. కొందరికి మైగ్రెన్ తలనొప్పులు బాధిస్తూ ఉంటాయి. ఇలాంటి వేర్వేరు సందర్భాల్లో, నొప్పులను అదుపు చేయడం కోసం వైద్యులు తాత్కాలికంగా లేదా దీర్ఘకాలికంగా పెయిన్ కిల్లర్స్‌ను సూచిస్తూ ఉంటారు. అలాగని వేరే సందర్భాల్లో తాత్కాలికంగా నొప్పులను తగ్గించుకోవడం కోసం పెయిన్ కిల్లర్స్ వాడుకోకుండా ఉండవలసిన అవసరం లేదు. నెల మొత్తంలో ఒకట్రెండు సార్లు వాడుకోవడం సురక్షితమే! కానీ ఇష్టారాజ్యంగా వీటిని వాడుకోవడం మాత్రం ఆరోగ్యకరం కాదు.

ఏవి సురక్షితం?

ప్రతి మందుల షాపులో పెయిన్ కిల్లర్స్‌ను ఎటువంటి ప్రిస్క్రిప్షన్‌తో పని లేకుండా కొనుక్కునే వెసులుబాటు ఉంటుంది. అయితే మనం కొనుక్కుంటున్న పెయిన్ కిల్లర్స్ ఏ రకానికి చెందినవో మనకెలా తెలుస్తుంది? ఈ మందుల్లో 'నాన్ స్టిరాయిడల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ' (ఎన్ఎస్ఐడి), ఓపియాయిడ్ అనాల్జెసిక్స్. అనే రెండు రకాలుంటాయి.

ఎన్ఎస్ఐడి:

ఈ మందులతో కాలేయం, మూత్రపిండాల మీద చెడు ప్రభావం పడడంతో పాటు, గ్యాస్ట్రిక్ సమస్యలు కూడా మొదలవుతాయి. అప్పటికే గుండె జబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి పైబడే వయసుతో కూడిన ఇతరత్రా ఆరోగ్య సమస్యలుంటే ప్రధాన అంతర్గత అవయవాలు అప్పటికే కొంత మేరకు దెబ్బ తిని ఉంటాయి. కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లు ఎన్ఎస్ఐడి పెయిన్ కిల్లర్స్‌ను వాడుకుంటే నష్టం రెండింతలుంటుంది. దాంతో మూత్రపిండాలు ఫెయిలైపోవడం, కడుపులో అల్సర్లు ఏర్పడి, పుండ్లు పడడం, కాలేయం ఫెయిలైపోవడం లాంటి తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయి.

ఓపియాయిడ్ ఎనాల్జెసిక్స్:

ట్రెమడాల్ లాంటి ఈ కోవకు చెందిన మందులు సురక్షితమైనవే అయినా వీటికి అలవాటు పడే ప్రమాదం ఉంటుంది. కొందరికి డి విటమిన్ లోపంతో నీరసం, ఒళ్లు నొప్పులు వేధిస్తాయి. నొప్పిని తగ్గించుకోవడం కోసం పెయిన్ కిల్లర్ వేసుకుంటారు. నొప్పి తగ్గగానే, హాయిగా అనిపిస్తుంది. అయితే అది ఆ రోజు వరకే! మరుసటి రోజు మళ్లీ నొప్పులు వేధిస్తాయి. అప్పుడు కూడా ఉపశమనం కోసం అవే మందులను ఆశ్రయిస్తారు. ఇలా ఆ మందులు వ్యసనంగా మారతాయి. కాబట్టి తాత్కాలికంగా ఒకటి రెండు రోజుల కోసం నొప్పి తగ్గించే మందులు వాడుకున్నా, తర్వాత నొప్పికి మూల కారణాన్ని తెలుసుకోవడం కోసం వైద్యులను కలవాలి. వయసు, ఆరోగ్య పరిస్థితులు, అప్పటికే వాడుతున్న మందులు, వాటి దుష్ప్రభావాలు, నొప్పిని తట్టుకునే తత్వాల ఆధారంగా ఎన్ని రోజుల పాటు, ఏ మోతాదు మేరకు పెయిన్ కిల్లర్స్‌ను సూచించవచ్చో వైద్యులు మాత్రమే కచ్చితంగా నిర్ణయించగలుగుతారు.

మానసిక సమస్యల మందులు కూడా...

కొన్ని రకాల మానసిక సమస్యలకు వైద్యులు సూచించే మందులకు వ్యసనపరులయ్యే ప్రమాదం ఉంటుంది. డిప్రెషన్‌తో బాధపడే వాళ్లు అందుకు అవసరమైన మందులు వాడుకున్నప్పుడు, సమస్య క్రమేపీ తగ్గుముఖం పట్టి, డిప్రెషన్ నుంచి బయట పడతారు. అయితే ఈ మందులకు మత్తు స్వభావం ఉంటుంది. కాబట్టి కొందరు వీటికి వ్యసనపరులుగా మారే ప్రభావం ఉంటుంది. ఈ తరహా వ్యసనం నుంచి బయటపడేలా చేయడం వైద్యులకే సాధ్యపడుతుంది. కాబట్టి వైద్యుల పర్యవేక్షణలో, వాళ్లు సూచించిన మోతాదును, సూచించినంత కాలం మాత్రమే వాడుకుంటూ, క్రమేపీ మోతాదును తగ్గించుకుంటూ సమస్య నుంచి కోలుకోవాలి.




డాక్టర్ సోమనాథ్ గుప్తా
సీనియర్ జనరల్ ఫిజీషియన్,
యశోద హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



పుట్టినరోజున కొత్త కబురు

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'రాజా సాబ్' చిత్రం నుంచి అభిమానులు ఎదురు చూస్తున్న అప్‌డేట్ వస్తోంది. ఈ నెల 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అప్‌డేట్ ఉంటుందని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. ప్రభాస్ ఇంతవరకూ టచ్ చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో 'రాజా సాబ్' ను దర్శకుడు మారుతి రూపొందిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రభాస్ అల్ట్రా స్టయిలిష్‌గా కనిపిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రీకరణ తుది దశలో ఉంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు నిర్మాత చెప్పారు.



పెళ్లి పనులు మొదలయ్యాయి...

అక్కినేని నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల త్వరలో పెళ్లి పీటలెక్కనున్న విషయం తెలిసిందే. ఇటీవల వీరి నిశ్చితార్థం వేడుకగా జరిగింది. తాజాగా పెళ్లి పనులు మొదలయ్యాయి. పసుపు దంచుతున్న ఫొటోలను శోభిత తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. 'గోధుమరాయి పసుపు దంచడంతో పనులు ప్రారంభమయ్యాయి' అని క్యాప్షన్ పెట్టారు. ఎరుపు రంగు పట్టు చీరలో శోభిత సంప్రదాయబద్ధంగా మెరిసిపోతూ కనిపించారు. తాను ధరించిన చీర అత్తగారైన లక్ష్మీ(నాగచైతన్య తల్లి) ఇచ్చారని శోభిత కామెంట్స్‌లో పేర్కొన్నారు. ఈ ఫొటోలు వైరల్‌గా మారాయి. పెళ్లి ఎక్కడ, ఎప్పుడు అనేది ఇంకా వెల్లడించలేదు. ఈ ఫొటోలు చూసిన అభిమానులు అదే ప్రశ్న అడుగుతున్నారు.



ఈ చిత్రం.. నాకెంతో ప్రత్యేకం



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్, మీనాక్షీ చౌదరి జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతోంది. సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ "ఈ చిత్రం.. నాకెంతో ప్రత్యేకం. ఓ సాధారణ బ్యాంక్ ఉద్యోగి డబ్బు కోసం ఏం చేశాడు అనేది చాలా ఆసక్తికరంగా చూపించాం. వినోదంతో పాటు భావోద్వేగాలు కలగలిసిన చిత్రమిది. సినిమా మీ అందరికీ తప్పక నచ్చుతుంది. కుటుంబమంతా కలసి చూడవలసిన చిత్రమిది" అని చెప్పారు. "సినిమాలో ప్రతీ సన్నివేశం కొత్తగా ఉంటుంది" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. "ఇప్పటివరకు నేను చేసిన పాత్రల్లో ఈ సినిమాలో పోషించిన సుమతి రోల్ నాకు చాలా ఇష్టం" అని హీరోయిన్ మీనాక్షీ చౌదరి చెప్పారు.

బుజ్జమ్మ పాత్ర అందరికీ నచ్చేస్తుంది

హీరోయిన్ అనన్య నాగళ్ల నటించిన తాజా చిత్రం 'పొట్టేల్'. యువచంద్రకృష్ణ కథానాయకుడు. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో సురేశ్‌కుమార్ సడిగె నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతున్న సందర్భంగా అనన్య మీడియాతో ముచ్చటించారు. "ఈ కథ విన్నప్పుడే ఇందులో తప్పకుండా భాగం అవ్వాలనుకున్నా. ఇందులో బుజ్జమ్మ అనే పాత్రలో నటించాను. నేను ఇదివరకు నటించిన సినిమాలతో పోలిస్తే ఇందులో నా పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సినిమాలో నటించిన



ప్రతీ ఒక్కరికీ మంచి గుర్తింపు తెచ్చే చిత్రమిది. ప్రతీ పాత్రకూ ప్రాధాన్యం ఉంటుంది. ఇందులో కథానాయకుడు యువచంద్రది 'పొట్టేల్' లాంటి మనస్తత్వం. ఎంత కష్టమొచ్చినా... ధైర్యంతో ముందుకెళ్లి ఢీకొనడమే తన నైజం. ఆయనతో కలిసి నటించడం మరిచిపోలేని అనుభూతి. దర్శకుడు సాహిత్ మోత్కూరి తన మేకింగ్ స్కిల్స్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తారు. అజయ్ నటన ఈ సినిమాకు హైలెట్‌గా ఉండనుంది. శేఖర్ చంద్ర అందించిన సంగీతం సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లింది. చక్కటి సందేశంతో పాటు తగినన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌ను మిక్స్ చేసిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది.

ప్రతి పాత్రకూ ప్రాముఖ్యం



వరుణ్ తేజ్ హీరోగా కరుణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మట్కా'. డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మాతలు. మీనాక్షి చౌదరి, నవీన్ చంద్ర, అజయ్ ఘోష్ ఇతర పాత్రల్లో నటించారు. ఈ సినిమా నవంబరు 14న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మూవీ టీజర్, సలోని క్యారెక్టర్‌ను పద్మగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. సినిమాలో ప్రతి పాత్రకూ చాలా ప్రాముఖ్యం ఉంటుందని చిత్ర బృందం తెలిపింది.



అలియా కొత్త ఇల్లు ఖరీదెంతో తెలుసా?

రణబీర్ కపూర్, అలియా కట్టుకుంటున్న కొత్త ఇల్లు రెడీ అయింది. రూ. 250 కోట్ల ఖర్చుతో ఆరు అంతస్తులతో తయారైన ఈ భవనానికి వాళ్ల నాయనమ్మ కృష్ణరాజ్ పేరు పెట్టాలని ఈ దంపతులు నిర్ణయించుకున్నారు. తమ కలల సౌధం ఎలా ఉండాలని అలియా కోరుకుందో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సరిగ్గా అలాగే కట్టించుకుంది. తనకు తీరిక దొరికనప్పుడల్లా భర్తతో కలసి వచ్చి నిర్మాణాన్ని పర్యవేక్షించేది. ఈ భవంతి పూర్తి కావడానికి రెండేళ్లు పట్టింది. ఇటీవలే భర్త, కూతురు రెహాతో కలిసి కొత్త ఇంటికి వెళ్లి వచ్చింది అలియా. దీపావళి రోజున అలియా దంపతులు గృహప్రవేశం చేయనున్నారు. ఈ ఖరీదైన భవనాన్ని కూతురికి కానుకగా ఇవ్వాలని అలియా ఆలోచన.


ఆమీర్‌తో కిశోర్‌కుమార్ బయోపిక్





బాలీవుడ్ గాయక సంచలనం కిశోర్‌కుమార్ బయోపిక్ తీయాలని బాలీవుడ్ నిర్మాత భూషణ్ కుమార్ ఆలోచన. ఈ బయోపిక్ తీసే బాధ్యతను దర్శకుడు అనురాగ్ బసుకు అప్పగించారు. కిశోర్‌కుమార్ పాత్రను ఆమీర్‌ఖాన్ పోషిస్తే బాగుంటుందని దర్శకనిర్మాతల ఆలోచన. ఆమీర్‌కు కూడా కిశోర్‌కుమార్ అంటే ఎంతో అభిమానం ఉండడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముఖ్యంగా అనురాగ్ ఈ సబ్జెక్ట్‌ను డీల్ చేసే విధంగా ఆమీర్‌ను కదిలించింది. ట్రీట్‌మెంట్ కొత్తగా ఉండడం కూడా ఆమీర్‌కు నచ్చింది. ఇప్పటికి నాలుగైదు సార్లు ఈ సబ్జెక్ట్ విషయమై కలసి చర్చించారు. ఒకేసారి ఐదు చిత్రాల్లో నటించాలని ఆమీర్‌ఖాన్ నిర్ణయించుకుని ఆ యా చిత్రాల దర్శకులకు ఓకే చెప్పేశారు. ఇప్పుడు ఆ జాబితాలో కిశోర్‌కుమార్ బయోపిక్ ఆరో చిత్రమవుతుంది.

సగం వాటా అమ్మేశారు



బాలీవుడ్ టాప్ డైరెక్టర్, ప్రొడ్యూసర్, హోస్ట్ కరణ్ జోహార్ తన నిర్మాణ సంస్థ 'ధర్మ ప్రొడక్షన్స్'లో సగ భాగం వాటా అమ్మేశాడు. కొన్ని రోజులుగా కరణ్ జోహార్ 'ధర్మ ప్రొడక్షన్స్'ని అమ్మకానికి పెట్టినట్లు వార్తలొచ్చాయి. తాజాగా ఆ వార్తలు నిజమయ్యాయి. కరణ్‌కు చెందిన 'ధర్మ'లోని 50 శాతం వాటాని ప్రముఖ టీకాల తయారీ సంస్థ అధినేత అదర్ పూనావాలా రూ.1000 కోట్లకు దక్కించుకున్నాడు. మరో 50 శాతం వాటా కరణ్ పేరు మీదే ఉండనుంది. ఈ డీల్ తరవాత ధర్మ ప్రొడక్షన్స్ విలువ ఏకంగా రూ. రెండు వేల కోట్లకు పెరుగుతుందని సెరీన్ ప్రొడక్షన్స్ పేర్కొంది. ధర్మ ప్రొడక్షన్స్ కొంత కాలంగా భారీ నష్టాలను చవిచూస్తోంది. అలియా భట్‌తో నిర్మించిన ఇటీవలి చిత్రం జిగ్రా నష్టాల కారణంగా ధర్మ సంస్థ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతోంది. జిగ్రా ఇప్పటి వరకు టోటల్ కలెక్షన్ రూ.21 కోట్లు మాత్రమే వసూలు చేసింది. బాలీవుడ్ మీడియా కథనాల ప్రకారం.. రూ.80 కోట్ల బడ్జెట్‌తో జిగ్రా నిర్మించారు. పబ్లిసిటీకి మరో రూ.10 కోట్లు కేటాయించారు. కాగా, 'ధర్మ ప్రొడక్షన్స్'కి ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కరణ్ ఉండగా, ఆయన స్నేహితుడు అపూర్వ మెహతా సీఈవోగా కొనసాగుతున్నాడు.



అందుకే హిందీలో మాట్లాడను

సమంత

'నేను హిందీలో మాట్లాడగలను కానీ ఉచ్చారణ దోషాలు ఉంటాయి. అందుకే వేదికలపై హిందీలో మాట్లాడను' అని చెప్పారు సమంత. అసలు విషయం ఏమిటంటే 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ 'హనీ.. బన్నీ' సిరీస్ దర్శకులు రాజ్, డీకే ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ సిరీస్‌లో కథానాయిక మొదట సమంతను అనుకోలేదని చెప్పారు. 'మేం రూపొందిస్తున్న 'ఫ్యామిలీ మ్యాన్ 2' నిర్మాణ సమయంలోనే 'సిటాడెల్' స్క్రిప్ట్ దశలో ఉంది. అయినా ఈ విషయం సమంతకు చెప్పలేదు. ఎందుకంటే హీరోయిన్‌గా హిందీ బాగా మాట్లాడగలిగే వ్యక్తి ఉంటే బాగుంటుందని అనుకున్నాం. 'ఫ్యామిలీ మ్యాన్ 2' షూటింగ్‌లో సమంత హిందీలో మాట్లాడకపోవడంతో ఆమెకు రాదేమో అనుకుని మరో హీరోయిన్ ని తీసుకోవాలని అనుకున్నాం. కానీ సమంత ఓ రోజు స్వచ్ఛమైన హిందీలో మాట్లాడడంతో ఆశ్చర్యపోయి ఆమెని ఎంపిక చేశాం' అని చెప్పారు. అప్పుడు సమంత అలా కామెంట్ చేశారు.



మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా...

రాకేశ్ గలేబి, భార్గవ్ గోపినాథం, స్రవంతి ప్రత్తిపాటి, మానసవీణ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రహస్యం ఇదం జగత్'. కోమల్.ఆర్. భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మిస్తున్నారు. ఇటీవలే టీజర్‌ను విడుదల చేసిన చిత్రబృందం, సోమవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు కోమల్.ఆర్.భరద్వాజ్ మాట్లాడుతూ "శ్రీ చక్రం ప్రేరణతో ఈ కథను తయారు చేశాను. ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా విజువల్స్ ఉంటాయి" అని చెప్పారు. నవంబర్ 8న చిత్రం విడుదలవుతోంది.

కొత్తగా..

క్రైమ్ కామెడీ థ్రిల్లర్



నూతన నటుడు సన్నీ హీరోగా తెలుగుతెరకు పరిచయమౌతున్న చిత్రం 'తస్కరించుట'. ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌ను శివప్రసాద్ చలువాది దర్శకత్వంలో షేక్ అఫ్రీన్ నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకాశ్ పూరి మాట్లాడుతూ "సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

లక్ష్మీరాయ్ త్రిపాత్రాభినయం



లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో గురుప్రసాద్ దర్శకత్వంలో తమిళ, కన్నడ భాషల్లో విడుదలై ఘనవిజయం సాధించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. త్వరలోనే తెలుగులోనూ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. సోమవారం ట్రైలర్‌ను సుమన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ చిత్రం తెలుగులోనూ ఘనవిజయం సాధిస్తుంది" అని చెప్పారు. "లక్ష్మీరాయ్ త్రిపాత్రాభినయం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. ఇందులో ఆమె సమాజంలో జరిగే అన్యాయాలను అంతమొందించే శక్తిమంతమైన పాత్రను పోషించారు" అని చిత్ర నిర్మాత డా॥ప్రతాని రామకృష్ణగౌడ్ అన్నారు.

మత్స్యకారుల జీవితాలను ప్రతిబింబించేలా...



రమాకాంత్, అవంతిక, భానుశ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సముద్రుడు'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో బదావత్ కిషన్ నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో నిర్మాత బదావత్ కిషన్ మాట్లాడుతూ "మత్స్యకారుల జీవితాలను ప్రతిబింబించేలా ఉండే చిత్రమిది. ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలున్న మంచి కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ఇది" అని అన్నారు.

స్పోర్ట్స్

'కామన్వెల్త్' నుంచి హాకీ అవుట్?

మెల్‌బోర్న్: స్కాట్లాండ్‌లోని గ్లాస్గో‌లో జరిగే 2026 కామన్వెల్త్ క్రీడల్లో హాకీకి చోటుదక్కే అవకాశం లేదని తెలుస్తోంది. ఖర్చుల నియంత్రణ భాగంగా నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకోనున్నట్టు పత్రికలు కథనాలు వెలువరించాయి. అయితే, అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్), కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీజీఎఫ్) ఈ విషయంపై పెదవి విప్పడం లేదు. రోస్టర్ విడుదల చేసిన తర్వాత మాట్లాడతామని ఎఫ్ఐహెచ్ చెప్పింది. 1998 నుంచి కామన్వెల్త్ క్రీడల్లో హాకీ కొనసాగుతోంది. అయితే ఈసారి హాకీతోపాటు హ్యాండ్‌బాల్, రోడ్‌రేసింగ్ ఈవెంట్లను కూడా తొలగించాలని నిర్వాహకులు భావిస్తున్నారట. మొత్తంగా 2022 బర్మింగ్‌హామ్ క్రీడల్లో 19 క్రీడలకు చోటు కల్పించగా.. గ్లాస్గోలో ఆ సంఖ్యను 10కి కుదించే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం.

భక్తి సంగీత విభావరికి విరాట్



ముంబై: బెంగళూరులో న్యూజిలాండ్‌తో టెస్ట్ మ్యాచ్ ఓడిన కొన్ని గంటల్లోనే కోహ్లీ ముంబైలో ప్రత్యక్షమయ్యాడు. భార్య అనుష్క శర్మతో కలిసి కృష్ణదాస్ నిర్వహించిన భక్తి సంగీత విభావరికి హాజరయ్యాడు. వీరి ఫొటోలను నిర్వాహకులు షేర్ చేశారు.

పుజార రికార్డు 'డబుల్'



రాజ్‌కోట్: ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక (18) ద్విశతకాలు బాదిన నాలుగో ఆటగాడిగా వెటరన్ చటేశ్వర్ పుజార (234) రికార్డులకెక్కాడు. ఛత్తీస్‌గఢ్‌తో సోమవారం డ్రాగా ముగిసిన మ్యాచ్‌లో సౌరాష్ట్ర ఆటగాడు పుజార కెరీర్‌లో 18వ డబుల్ సెంచరీతో మెరిశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఛత్తీస్‌గఢ్ 578/7 డిక్లేర్ చేయగా.. సౌరాష్ట్ర 8 వికెట్లకు 478 పరుగులు సాధించింది. కాగా, 21 వేల పరుగులు చేసిన పుజార.. గవాస్కర్, సచిన్, ద్రవిడ్ తర్వాత ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఈ మైలురాయిని చేరిన నాలుగో భారత క్రికెటర్‌గా నిలిచాడు. మరోవైపు అత్యధిక డబుల్ సెంచరీలు చేసిన వారిలో డాన్ బ్రాడ్‌మన్ (37) టాప్‌లో ఉండగా.. వాలీ హమ్మండ్ (36), పాస్టీ హెండ్రెన్ (22) తర్వాతి స్థానంలో పుజార (18) చోటు దక్కించుకొన్నాడు.



తొలి బ్యాటర్ సమద్..

రంజీల్లో రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు చేసిన తొలి జమ్మూకశ్మీర్ బ్యాటర్‌గా అబ్దుల్ సమద్ (127, 108) అరుదైన ఘనతను అందుకొన్నాడు. ఒడిశాతో డ్రాగా ముగిసిన మ్యాచ్‌లో సమద్ ఈ ఫీట్ చేశాడు. జమ్మూ కశ్మీర్ 270, 270 డిక్లేర్ చేయగా.. ఒడిశా 272, 112/8 స్కోర్లు సాధించింది.

హైదరాబాద్ రెండో ఓటమి

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ 78 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఓవర్‌నైట్ స్కోరు 189/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్ 235 పరుగులకు ఆలౌటైంది. ఆల్‌రౌండర్ మిలింద్ (3/31) టెయిలెండర్ల పనిపట్టాడు. అనంతరం 269 పరుగుల లక్ష్య ఛేదనలో హైదరాబాద్ ఆటగాడు రోహిత్ రాయుడు (47 నాటౌట్) రాణించాడు. రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 190 పరుగులకు ఆలౌటై, ఈ సీజన్‌లో రెండో ఓటమిని నమోదు చేసింది.. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 325, హైదరాబాద్ 292 పరుగులకు ఆలౌటయ్యాయి.

ఆంధ్ర పోరాడినా..

అహ్మదాబాద్: ఆంధ్రతో జరిగిన రంజీ మ్యాచ్‌లో గుజరాత్ ఒక వికెట్‌తో విజయం సాధించింది. 144 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన గుజరాత్ జట్టును ఆంధ్ర స్పిన్నర్ లలిత్ మోహన్ (7/76) ముప్పుతిప్పలు పెట్టాడు. మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లను లలిత్ తన ఖాతాలో వేసుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో గుజరాత్ 9 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసి నెగ్గింది. అంతకు ముందు ఫాలోఆన్‌లో ఓవర్‌నైట్ స్కోరు 203/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 297 రన్స్‌కు ఆలౌటైంది. ఇక, తొలి ఇన్నింగ్స్‌లో గుజరాత్ 367కు, ఆంధ్ర 213 పరుగులకు ఆలౌటయ్యాయి.

స్వియటెక్‌ను దాటేసి.. టాప్ ర్యాంక్ పట్టేసి..

నెంబర్‌వన్ సబలెంక



సెయింట్ పీటర్స్‌బర్గ్ (యూఎస్): యూఎస్ ఓపెన్ చాంపియన్ అరినా సబలెంకా డబ్ల్యూటీఏ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్‌గా అవతరించింది. సోమవారం అధికారికంగా ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో మహిళల సింగిల్స్‌లో ఇగా స్వియటెక్‌ను దాటేసి బెలారస్ స్టార్ సబలెంక టాపర్‌గా నిలిచింది. ఇక గత 11 నెలలుగా టాప్ ర్యాంక్‌లో కొనసాగిన పోలెండ్ క్వీన్ స్వియటెక్ రెండో ర్యాంక్‌కు పడిపోయింది. సబలెంక నెంబర్‌వన్ ర్యాంక్ దక్కించుకోవడం ఇదే తొలిసారి కాదు. గతేడాది సెప్టెంబరు నుంచి నవంబరు దాకా ఆమె టాప్‌లో నిలిచింది. ఇక, కొకొ గాఫ్, జెస్సికా పెగులా, ఎలెనా రిబకినా వరుసగా 3, 4, 5 ర్యాంకులతో టాప్-5లో ఉన్నారు.

ఒకే రోజు 16 వికెట్లు

106కే కుప్పకూలిన బంగ్లాదేశ్



రబాడ

ఢాకా: బంగ్లాదేశ్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య సోమవారం ఆరంభమైన తొలి టెస్టులో ఇరు జట్ల బౌలర్లు పండగ చేసుకున్నారు. ఏకంగా ఒకే రోజు 16 వికెట్లు నేలకూలాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 40.1 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ మహ్మదుల్ (30) టాప్ స్కోరర్. వీరి అత్యధిక భాగస్వామ్యం (26) తొమ్మిదో వికెట్‌కు లభించడం గమనార్హం. పేసర్లు రబాడ, ముల్డర్, స్పిన్నర్ కేశవ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. అలాగే రెండో సెషన్‌లోనే బరిలోకి దిగిన సౌతాఫ్రికా వెలుతురులేమితో ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లకు 140 పరుగులు చేసింది. ప్రస్తుతానికి 34 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతుండగా.. క్రీజులో కైల్ వెరైన్ (18 బ్యాటింగ్), ముల్డర్ (17 బ్యాటింగ్) ఉన్నారు. స్పిన్నర్ తైజుల్‌కు ఐదు వికెట్లు లభించాయి. కాగా టెస్టు క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో (11,817)నే 300 వికెట్లు తీసిన బౌలర్‌గా రబాడ నిలిచాడు. పాక్ దిగ్గజం వఖార్ యూనిస్ (12,602)ను అధిగమించాడు.

100 శాతం ఫిట్‌గా ఉన్నా



న్యూఢిల్లీ: ప్రస్తుతం గాయం నుంచి కోలుకుని, ఎలాంటి నొప్పి లేకుండా ఉన్నానని పేసర్ మహ్మద్ షమి తెలిపాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ తర్వాత అతడు గాయం కారణంగా క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఈనేపథ్యంలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో షమి ఆడాలని భావిస్తున్నాడు. 'నేను గతంలోలా తక్కువ దూరం నుంచి కాకుండా ఆదివారం పూర్తి స్థాయిలో బౌలింగ్ చేశాను. అలాగే 100 శాతం నొప్పినుంచి విముక్తిడినయ్యా. ఆసీస్ టూర్‌లో నేనుంటానా? లేదా? అని అంతా ఆలోచిస్తున్నారు. కానీ దానికింకా సమయం ఉంది. అంతకంటే ముందు నేను ఫిట్‌గా ఉంటూ, ఆ సిరీస్‌కు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే ముందుగా రంజీ మ్యాచ్‌లు ఆడాలనుకుంటున్నా' అని షమి తెలిపాడు.



దీపికకు రజతం

ధీరజ్ విఫలం ● ఆర్చరీ వరల్డ్ కప్ ఫైనల్

న్యూఢిల్లీ: వెటరన్ ఆర్చర్ దీపికా కుమారి మెక్సికోలో జరిగిన వరల్డ్ కప్ ఆర్చరీ ఫైనల్లో రజత పతకం అందుకుంది. అయితే తెలుగు ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర పతకం సాధించడంలో విఫలమయ్యాడు. మూడేళ్ల తర్వాత వరల్డ్ కప్ ఫైనల్ బరిలో దిగిన మూడో సీడ్ దీపిక స్వర్ణ పతక మ్యాచ్‌లో 0-6తో లీ జియామన్ (చైనా) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. తొమ్మిదో సారి ప్రపంచ కప్‌లో తలపడిన ఆమెకిది ఐదో రజతం. ఇవిగాక దీపిక ఓ కాంస్య పతకమూ నెగ్గింది. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో విజయవాడ ఆర్చర్, మూడో సీడ్ ధీరజ్ క్వార్టర్ ఫైనల్లో 4-6తో రెండో సీడ్ లీ వూ సోక్ (కొరియా) చేతిలో పరాజయం పాలై పతకం లేకుండానే టోర్నీని ముగించాడు.

సెమీస్‌లో భారత కుర్రాళ్లు

యూఏఈపై గెలుపు

ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్

అల్‌అమెరాత్ (ఒమన్): ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టీ20 టోర్నీలో జోరు ప్రదర్శిస్తున్న భారత్ 'ఎ' జట్టు వరుసగా రెండో విజయంతో సెమీఫైనల్‌కు దూసుకుపోయింది. గ్రూప్ 'బి'లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఏడు వికెట్లతో యూఏఈని చిత్తు చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న యూఏఈ..పేసర్లు రసిఖ్ (3/15), రమణ్‌దీప్ (2/7) ధాటికి 16.5 ఓవర్లలో 107 పరుగులకే కుప్పకూలింది. రాహుల్ చోప్రా (50) హాఫ్ సెంచరీతోపాటు కెప్టెన్ బాసిల్ హమీద్ (22) రాణించడంతో యూఏఈకి ఆ మాత్రం స్కోరైనా సాధ్యమైంది. కాంబోజ్, వైభవ్ అరోరా, అభిషేక్ శర్మ, నేహల్ వధేరా తలో వికెట్ తీశారు. అభిషేక్ శర్మ (58), కెప్టెన్ తిలక్ వర్మ (21) చెలరేగడంతో స్వల్ప ఛేదనను భారత్ 'ఎ' 10.5 ఓవర్లలో 111/3 స్కోరుతో ముగించింది. రెండు విజయాలతో నాలుగు పాయింట్లు సాధించిన భారత్ 'ఎ' గ్రూప్‌లో టాపర్‌గా నిలిచింది. బుధవారం జరిగే గ్రూప్ ఆఖరి మ్యాచ్‌లో ఒమన్‌తో తలపడనుంది. కాగా..మరో గ్రూప్ 'బి' మ్యాచ్‌లో పాకిస్థాన్ 'ఎ' 74 పరుగులతో ఒమన్‌పై నెగ్గింది.

సంక్షిప్తస్కోర్లు

యూఏఈ: 16.5 ఓవర్లలో 107 ఆలౌట్ (రాహుల్ చోప్రా 50, బాసిల్ హమీద్ 22, రసిఖ్ సలామ్ 3/15, రమణ్‌దీప్ 2/7);
భారత్: 10.5 ఓవర్లలో 111/3 (అభిషేక్ శర్మ 58, తిలక్ వర్మ 21, బదోనీ 12 నాటౌట్, విష్ణు సుకుమారన్ 1/10).



సిరాజ్.. క్యా హువా?



13 టెస్టుల్లో 19 వికెట్లు
నిరాశపరిచిన పేసర్
రెండో టెస్టుకు చోటు కష్టమే

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో భారత్ ఓటమితో జట్టు కూర్పుపై కూడా చర్చ జరుగుతోంది. ప్రత్యర్థి ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగి రోహిత్ సేనను దెబ్బ తీస్తే.. ఆతిథ్య భారత్ మాత్రం ఇద్దరు పేసర్లతోనే ఆడింది. ఇందులో బుమ్రా మాత్రమే ఆకట్టుకోగలిగాడు. మరో పేసర్ మహ్మద్ సిరాజ్ అంచనాలను అందుకోలేక విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఈ మ్యాచ్‌లో అతను రెండు వికెట్లు మాత్రమే తీశాడు. కనీసం అతడి స్థానంలో ఫామ్‌లో ఉన్న ఆకాశ్‌దీప్‌ను ఆడించినా ఫలితం ఉండేదని విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం నుంచి జరిగే పుణె టెస్టులో సిరాజ్‌ను తప్పించాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది. వాస్తవానికి విదేశాల్లో రాణిస్తున్నా.. భారత గడ్డపై జరిగిన టెస్టులో సిరాజ్ ప్రదర్శన సంతృప్తికరంగా లేదు. ఇక్కడ తను 13 టెస్టులు ఆడితే.. తీసింది 19 వికెట్లు మాత్రమే. ఇందులో నాలుగు టెస్టుల్లోనైతే ఒక్క వికెట్ కూడా రాలేదు. ఇక చివరి ఏడు టెస్టుల్లో 12 వికెట్లే తీశాడు. కనీసం టెస్టుకు రెండు వికెట్లు కూడా పడగొట్టలేకపోయాడు. అంతేకాకుండా బుమ్రాతో సమానంగా కొత్త బంతితో ఎలాంటి ప్రభావమూ చూపలేకపోతున్నాడు. అంటే ఉపఖండంలో అతడి తడబాటు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. అయితే సిరాజ్ తన లైన్ అండ్ లెంగ్త్‌ను సరిచేసుకుంటే ప్రభావం చూపగలడని ఓ కోచ్ తెలిపాడు. విదేశీ పిచ్‌లపై అతడి బౌలింగ్ సరిగ్గా సరిపోతుందని, అందుకే బౌన్సీ పిచ్‌లుండే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాల్లో ఐదేసి వికెట్లతో రాణించినట్టు గుర్తుచేశాడు. బౌన్స్ తక్కువగా ఉండే భారత పిచ్‌లపై అందుకే వెనుకబడుతున్నట్టు తెలిపాడు. ఇదిలావుండగా జట్టులో ప్రధాన పేసర్‌గా ఉన్నప్పుడు కొత్త బంతితో వికెట్లను ఆశిస్తారని, అలాగే రెండో కొత్త బంతితోనూ రాణించాలని కోరుకుంటారని మాజీ కీపర్ సబా కరీం అన్నాడు. ఈ విషయంలో ఆకాశ్ దీప్ మెరుగ్గా కనిపిస్తున్నాడని, చాలా ఏళ్లుగా భారత పిచ్‌లపై అతడు ఆడుతున్న విషయం మరువరాదని చెప్పాడు. ఆర్‌సీబీ మాజీ కోచ్ మైక్ హెస్సెన్ కూడా రెండో టెస్టుకు సిరాజ్ స్థానంలో ఆకాశ్‌ను ఆడించే విషయమై టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచించే అవకాశం ఉందన్నాడు.

పుణె టెస్టుకు స్పిన్ వికెట్!



కివీస్‌తో రెండో టెస్టు కోసం స్పిన్ అనుకూల వికెట్‌ను రూపొందిస్తున్నారు. మ్యాచ్ జరిగే పుణె పిచ్‌ను నల్లమట్టితో తయారు చేయడం వల్ల స్లో బౌలర్లకు సహకరిస్తుంది. తక్కువ బౌన్స్‌తోపాటు బంతి నెమ్మదిగా టర్న్ అయ్యే అవకాశం ఉంది. బెంగళూరు ఓటమితో బెంబేలెత్తిన భారత్.. ఇప్పుడు తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఎలాగైనా సిరీస్ సొంతం చేసుకోవాలంటే మిగిలిన రెండు టెస్టులు నెగ్గాలి. ఈ నేపథ్యంలో జట్టు స్పిన్ వికెట్‌తో ఫలితం సాధించాలనే వ్యూహంతో ఉన్నట్టు తెలుస్తోంది. మూడో టెస్టు జరిగే ముంబై వికెట్‌కు కూడా స్పిన్నర్లకు స్వర్గధామం కానుందట. అయితే, వాంఖడే వికెట్ ఎర్రమట్టితో తయారు చేయగా.. పుణె పిచ్‌ను నల్లమట్టితో రూపొందించారు. స్పిన్నర్ల ఆధిపత్యం కొనసాగనున్న నేపథ్యంలో ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను 16వ ఆటగాడిగా బోర్డు ఎంపిక చేసింది. పుణెలో ఇప్పటి వరకు రెండు టెస్టులు జరిగాయి. 2016-17 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో లెఫ్టామ్ స్పిన్నర్ ఓకీఫ్ 12 వికెట్లతో చెలరేగడంతో.. ఆస్ట్రేలియా 333 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. కాగా, 2019లో దక్షిణాఫ్రికాపై టీమిండియా ఇన్నింగ్స్ తేడాతో గెలిచింది. ఆ మ్యాచ్‌లో విరాట్ డబుల్ సెంచరీ చేశాడు. కాగా, ఇప్పుడు మ్యాచ్ జరిగే పిచ్‌పై పచ్చిక కనిపించడం లేదు. తొలి గంట ఆట తర్వాత సీమర్లకు ఏమాత్రం సహకరించే అవకాశం లేకపోయినా.. పొడిగా ఉండడంతో బౌలర్లు రివర్స్ స్వింగ్ రాబట్టే చాన్సులున్నాయి. దీంతో టాస్ గెలిచిన జట్టు తొలుత బ్యాటింగ్ చేయడానికే మొగ్గుచూపవచ్చు.

వినేశ్, బజ్‌రంగ్‌వల్లే..

ఉద్యమ ప్రతిష్ఠ దెబ్బతిన్నది

వారిద్దరూ స్వార్థంగా ఆలోచించారు
బయోగ్రఫీలో సంచలన విషయాలు వెల్లడించిన సాక్షి మాలిక్



ఫైల్ ఫొటో

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌కు వ్యతిరేకంగా స్టార్ రెజ్లర్లు చేపట్టిన ఆందోళనపై సాక్షి మాలిక్ సంచలన వ్యాఖ్యలు చేసింది. గత ఏడాది జరిగిన ఆసియా క్రీడల ఎంపిక పోటీలనుంచి వినేశ్ ఫొగాట్, బజ్‌రంగ్ పూనియా మినహాయింపు పొందడాన్ని ఆమె తప్పుబట్టింది. వారిద్దరి నిర్ణయం వల్ల ఉద్యమ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని అభిప్రాయపడింది. వ్యక్తిగత లబ్ధికోసం ఉద్యమం చేశారన్న అప్రతిష్ఠ ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆవేదన చెందింది. ఈమేరకు తన ఆటోబయోగ్రఫీ 'విట్‌నెస్'లో సాక్షి మాలిక్ తన అభిప్రాయాలను నిష్కర్షగా వెల్లడించింది. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నాడంటూ బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా దేశ మేటి రెజ్లర్లు వినేశ్, సాక్షి, బజ్‌రంగ్ పూనియా 2023లో తీవ్ర స్థాయిలో ఉద్యమం చేసిన విషయం తెలిసిందే. రెజ్లర్ల ఉద్యమం తర్వాతే బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదుకాగా..దానిపై ఢిల్లీ హైకోర్టులో ప్రస్తుతం విచారణ జరుగుతోంది. ఇక ఆ ఆందోళనకు సంబంధించిన పలు విషయాలను తన పుస్తకంలో సాక్షి పంచుకుంది. 'స్వార్థపూరితంగా ఆలోచించే పాత విధానం ఉద్యమంలోకి ప్రవేశించింది. బజ్‌రంగ్, వినేశ్ మనసులలో వారి సన్నిహితులు దురాశను నూరి పోశారు. దాంతో 2023 ఆసియా క్రీడల ఎంపిక పోటీలనుంచి మినహాయింపు పొందే అంశాన్ని వారిద్దరూ లేవనెత్తారు' అని సాక్షి విమర్శించింది. బ్రిజ్‌భూషణ్‌ను తొలగించాక..రెజ్లింగ్ సమాఖ్య వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటైన అడ్‌హాక్ కమిటీ సెలక్షన్ ట్రయల్స్ నుంచి బజ్‌రంగ్, వినేశ్‌లను మినహాయించింది. అయితే సాక్షి మాత్రం ఆ మినహాయింపు పొందేందుకు నిరాకరించింది. ఇక..ఆసియాడ్‌కు ముందు వినేశ్ గాయపడగా, ఆ క్రీడల్లో పతకం సాధించడంలో బజ్‌రంగ్ విఫలమయ్యాడు.

బబితది దురాలోచన..

ఉద్యమ సమయంలో.. బబితా ఫొగాట్ స్వార్థపూరిత ఆలోచన చేసిందని వినేశ్ ఆరోపించింది. ఉద్యమానికి తాను మద్దతు పలుకుతున్నట్టు ప్రకటించడం వెనుక బ్రిజ్‌భూషణ్ స్థానంలో ఆమె డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ పదవి చేపట్టాలనే దురాలోచన ఉన్నదని తెలిపింది. కాగా తోటి రెజ్లర్ సత్యవర్త్ కడియన్‌తో తన వివాహాన్ని కుటుంబ సభ్యులు వ్యతిరేకించారని సాక్షి వెల్లడించింది. కానీ అతణ్నే పెళ్లిచేసుకోవాలని నిర్ణయాన్ని తీసుకున్నానని చెప్పింది. అలాగే తన అవార్డుల సొమ్ములో ఎక్కువ భాగాన్ని తల్లిదండ్రులు తీసుకున్నారని చెప్పింది.

వేధింపులకు గురయ్యా..

బాల్యంలో తాను లైంగిక వేధింపులకు గురయ్యానని సాక్షి వెల్లడించింది. ట్యూషన్ టీచర్ వేధింపులకు పాల్పడ్డాడని తెలిపింది. 'నా ట్యూషన్ సార్ నన్ను లైంగికంగా వేధించాడు. సమయంకాని సమయంలో పాఠాలు చెప్పించుకొనేందుకు తన ఇంటికి రావాలని ఆదేశించేవాడు. దాంతో ట్యూషన్‌కు వెళ్లాలంటే ఎంతో భయపడేదానిని' అని 32 ఏళ్ల సాక్షి వివరించింది.

భారత్ 'ఎ' జట్టులో నితీశ్, రికీ భుయ్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా పర్యటన కోసం ప్రకటించిన భారత్ 'ఎ' జట్టులో ఇద్దరు ఆంధ్ర క్రికెటర్లకు చోటు దక్కింది. ఇటీవలే అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసిన నితీశ్ కుమార్‌తో పాటు రికీ భుయ్‌కి కూడా అవకాశం కల్పించారు. సోమవారం 15 మందితో కూడిన ఈ జాబితాను బీసీసీఐ వెల్లడించింది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్ కోటాలో నితీశ్‌కు చాన్స్ దక్కింది. అలాగే దేశవాళీల్లో రాణించిన ఇషాన్ కిషన్‌ను కూడా ఈసారి పరిగణనలోకి తీసుకున్నారు. ఈనెల 31 నుంచి ఆసీస్ 'ఎ' జట్టుతో యువ భారత్ రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడనుంది. ఆ తర్వాత బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తలపడే టీమిండియాతో మూడు రోజుల ఇంట్రా స్క్వాడ్ గేమ్‌లో తలపడుతుంది.

భారత్ 'ఎ' జట్టు: రుతురాజ్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్, నితీశ్ కుమార్, దేవ్‌దత్ పడిక్కళ్, రికీ భుయ్, బాబా ఇంద్రజిత్, ఇషాన్ కిషన్, అభిషేక్ పోరెల్, ముకేశ్ కుమార్, ఖలీల్, యష్ దయాల్, నవ్‌దీప్ సైనీ, మనవ్, తనుష్ కోటియన్.

యూపీ యోధాస్ బోణీ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): యూపీ యోధాస్ జట్టు ప్రో కబడ్డీ లీగ్ సీజన్‌ను విజయంతో ఆరంభించింది. సోమవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో యోధాస్ 28-23 స్కోరుతో దబాంగ్ ఢిల్లీపై గెలిచింది. ఇరు జట్ల డిఫెండర్లు అద్భుతంగా ఆడడంతో పాయింట్లు సాధించడానికి రైడర్లు చెమటోడ్చారు. యూపీ రైడర్లు భవానీ రాజ్‌పుత్ (7 పాయింట్లు), సురేందర్ గిల్ (4) గెలుపులో ముఖ్యభూమిక పోషించారు. ఢిల్లీ కెప్టెన్, స్టార్ రైడర్ అషు మాలిక్ 15 రైడ్లలో నాలుగే పాయింట్లు సాధించడం ఆ జట్టు అవకాశాలను సన్నగిల్లేలా చేసింది. ఢిల్లీ రైడర్లు అషు, నవీన్, మోహిత్, ఆశీష్‌ను యూపీ డిఫెండర్లు అద్భుతంగా ట్యాకిల్ చేయడంతో ఆ జట్టు ఆలౌటైంది. ఇదే సమయంలో యూపీ రైడర్లు భవానీ, నితిన్ వరుస పాయింట్లు తేవడంతో ఆ జట్టును విజయం వరించింది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 40-25 స్కోరు తేడాతో పట్నా పైరేట్స్‌ను ఓడించింది.

బిజినెస్

మరో పదేళ్ల పాటు 'ఉడాన్' పథకం

న్యూఢిల్లీ: ప్రాంతీయ విమానాశ్రయాలను అనుసంధానం చేసే 'ఉడాన్' పథకాన్ని మరో పదేళ్ల పాటు పొడిగిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ విషయం ప్రకటించారు. ప్రాంతీయ విమానయాన అనుసంధానం కోసం కేంద్ర ప్రభుత్వం 2016 అక్టోబరు 21న ఈ పథకాన్ని ప్రారంభించింది. దీంతో అనేక ప్రాంతీయ విమానయాన సంస్థలు ప్రారంభమై అనేక మందికి ఉద్యోగావకాశాలు ఏర్పడడంతో పాటు దేశంలో పర్యాటక రంగ అభివృద్ధికి తోడ్పడిందని రామ్మోహన్ తెలిపారు. ఈ పథకం పుణ్యమాని 601 విమాన మార్గాలు, 71 విమానాశ్రయాలు అందుబాటులోకి వచ్చాయి.

దేశంలోనే విమానాల డిజైనింగ్

దేశీయంగా విమానాల రూపకల్పన (డిజైన్), ఉత్పత్తి చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి రామ్మోహన్ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో పార్లమెంట్ ఆమోదించిన 'భారతీయ వాయుయాన్ విధేయక్ బిల్లు- 2024 ఇందుకు దోహదం చేస్తుందన్నారు. ఇందుకోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), నేషనల్ ఏరోనాటిక్స్ లేబొరేటరీస్ లిమిటెడ్ (ఎన్ఏఎల్) వంటి సంస్థల సహకారం తీసుకుంటామని చెప్పారు.

బంగారం, వెండి
ఆల్‌టైం రికార్డు



సిల్వర్ ఒక్కరోజే రూ.5,000 అప్
కిలో ధర రూ.99,500కు చేరిక
రూ.80,000 దాటిన పసిడి రేటు

న్యూఢిల్లీ: దేశీయంగా బులియన్ ధరలు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి ఎగబాకాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ డేటా ప్రకారం.. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర సోమవారం రూ.750 పెరిగి రూ.80,650కి చేరింది. 10 గ్రాముల పసిడి రూ.80,000 స్థాయిని దాటడం ఇదే తొలిసారి. వెండి ధర ఏకంగా రూ.5,000 ఎగబాకి రూ.99,500కు చేరుకుంది. వెండి ధర పెరగడం వరుసగా ఇది నాలుగో రోజు. మరోవైపు హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర పది గ్రాములకు రూ.220 పెరుగుదలతో రూ.79,640కి, 22 క్యారెట్ల రేటు రూ.200 పెరిగి రూ.73,000 చేరకున్నాయి. కిలో వెండి రూ.2000 ఎగబాకి రూ.1,09,000 ధర పలికింది.

సిల్వర్‌కు చైనా బూస్ట్

అంతర్జాతీయ మార్కెట్లోనూ ఈ విలువైన లోహాల ధరలు సరికొత్త జీవితకా గరిష్ఠాలకు ఎగబాకాయి. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో దాదాపు 26 డాలర్ల పెరుగుదలతో 2,755 డాలర్లకు చేరుకోగా.. వెండి ఒక శాతం పెరిగి 12 ఏళ్ల గరిష్ఠ స్థాయి 34.49 డాలర్లకు పుంజుకుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో పాటు పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా (పీబీఓసీ) ప్రామాణిక వడ్డీ రేట్లను తగ్గించడం ప్రస్తుత ర్యాలీకి కారణమని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు. ముఖ్యంగా పీబీఓసీ వడ్డీ రేటు తగ్గించడం చైనాలో పారిశ్రామిక రంగానికి ఊతమివ్వనుందని, తద్వారా పారిశ్రామిక అవసరాలకు వెండి వినియోగం మరింత పెరగవచ్చన్న అంచనాలతో ఈ లోహం ధర అమాంతం దూసుకుపోయింది.

బులియన్ రేట్లు మరింత పైపైకే

నవంబరులో అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు బులియన్ ధరలను కొత్త గరిష్ఠాలకు చేర్చే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఔన్స్ గోల్డ్ 2,800 డాలర్లకు చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి.

మూడేళ్ల గరిష్ఠానికి ఆర్‌బీఐ బంగారం కొనుగోళ్లు

ఆర్‌బీఐ తన వద్దనున్న విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలను వివిధీకరించడంతో పాటు అంతర్జాతీయ అనిశ్చితులు, సంక్షోభాల నుంచి నిల్వలకు రక్షణ కల్పించేందుకు బంగారం కొనుగోళ్లను గణనీయంగా పెంచింది. ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదిక ప్రకారం.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆర్‌బీఐ 54.7 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. గడిచిన మూడేళ్లలో ఇదే గరిష్ఠ స్థాయి కొనుగోళ్లు. దాంతో ఈ ఏడాదిలో ఆర్‌బీఐ వద్దనున్న బంగారం నిల్వలు 7 శాతం పెరిగి మొత్తం 858.3 టన్నులకు చేరుకున్నాయి. ఈ ఏడాది అత్యధికంగా బంగారం కొనుగోళ్లు జరిపిన ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌ల్లో ఆర్‌బీఐ ఒకటని డబ్ల్యూజీసీ నివేదిక పేర్కొంది.

యూనియన్ బ్యాంక్ లాభం రూ.4,720 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను బ్యాంక్ నికర లాభం 34 శాతం వృద్ధి చెంది రూ.4,720 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.3,511 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.28,282 కోట్ల నుంచి రూ.32,036 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ వడ్డీ ఆదాయం కూడా రూ.24,587 కోట్ల నుంచి రూ.26,708 కోట్లకు వృద్ధి చెందింది. అయితే నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం 0.87 శాతం క్షీణించి రూ.9,047 కోట్లుగా నమోదైంది. మరోవైపు నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) కూడా 3.18 శాతం నుంచి 2.9 శాతానికి తగ్గింది. కాగా స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 6.38 శాతం నుంచి 4.36 శాతానికి, నికర ఎన్‌పీఏ 1.30 శాతం నుంచి 0.98 శాతానికి తగ్గాయి. సెప్టెంబరు ముగిసే నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.21,70,779 కోట్లుగా ఉంది.

సైయెంట్ డీఎల్ఎం లాభంలో 5 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్ సంస్థ సైయెంట్ డీఎల్ఎం.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.15.4 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.14.6 కోట్లు)తో పోల్చితే లాభం 5.5 శాతం పెరిగింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ రెవెన్యూ కూడా 33.4 శాతం వృద్ధి చెంది రూ.291.80 కోట్ల నుంచి రూ.389.40 కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ కొత్తగా ఇద్దరు క్లయింట్లను చేర్చుకుంది. ఇందులో ఒకటి మిస్సైల్ సిస్టమ్స్‌లో కీలకంగా ఉన్న ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ. మరొకటి అంతర్జాతీయ ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్ కంపెనీ.

ఏఐ వినియోగంలో జర జాగ్రత్త

- ఆదమరిస్తే ఇక అంతే
- ఇది రెండు వైపులా పదునున్న కత్తి
- భారతి గ్రూప్ చైర్మన్ సునీల్ మిట్టల్



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) వంటి టెక్నాలజీల వినియోగం విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని భారతీ గ్రూప్ చైర్మన్ సునీల్ భారతి మిట్టల్ కోరారు. అనేక సవాళ్లతో కూడిన ఈ టెక్నాలజీల విషయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉండొద్దని హెచ్చరించారు. ఎన్‌డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ఆయన ఈ హెచ్చరిక చేశారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్లు ఏఐ సాయంతో అచ్చం తన కంఠస్వరాన్ని అనుకరిస్తూ దుబాయ్‌లోని తన కంపెనీ ఉన్నతాధికారి ద్వారా పెద్దమొత్తంలో నిధులు బదిలీ చేయించుకునేందుకు ఎలా ప్రయత్నించిందీ మిట్టల్ వివరించారు. తాను ఎప్పుడూ పెద్ద మొత్తంలో నిధుల బదిలీ అడగననే విషయం తెలిసిన ఆ అధికారి అప్రమత్తతో ఆ ప్రమాదం తప్పిందన్నారు. ఆ సైబర్ కేటుగాడు పంపిన తన వాయిస్ మెసేజీ విని తానే ఆశ్చర్యపోయినట్టు తెలిపారు. అందుబాటులోకి వస్తున్న అధునాతన టెక్నాలజీల కారణంగా ముందు ముందు డిజిటల్ సంతకాలకూ ప్రమాదం తప్పకపోవచ్చని మిట్టల్ తెలిపారు.

ఉపగ్రహ కమ్యూనికేషన్ వ్యవస్థను ఆయన మ్యాజిక్ బుల్లెట్‌గా అభివర్ణించారు. ఈ ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో మారుమూల ప్రాంతాలకూ మొబైల్, ఇంటర్నెట్ సదుపాయాలు కల్పించడం సాధ్యపడుతుందన్నారు.

డేటాలీక్‌తో తస్మాత్ జాగ్రత

రెండు బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ హెచ్చరిక

న్యూఢిల్లీ: పాలసీదారుల ప్రయోజనాలకు రక్షణ కల్పించడం కోసం ఐటీ వ్యవస్థల ఆడిటింగ్ చేపట్టాలని డేటాలీక్ జరిగినట్టు భావిస్తున్న రెండు బీమా కంపెనీలను భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఆదేశించింది. ఐటీ వ్యవస్థల్లో లోపాలను కనుగొనేందుకు ఆయా కంపెనీల యాజమాన్యాలతో సంప్రదింపులు జరుపుతోంది. అయితే ఆ బీమా కంపెనీలేవి అన్న విషయం ఐఆర్‌డీఏఐ ప్రకటించలేదు. డేటాలీక్ అనేది తీవ్రమైన అంశమని, పాలసీదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కంపెనీలతో నిరంతర సంప్రదింపులు నిర్వహించనున్నట్టు తెలిపింది. ఇటీవలే తమ పాలసీదారుల డేటా లీక్ అయినట్టు స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ అంగీకరించింది. రెండు కంపెనీలు తమ ఐటీ వ్యవస్థలను ఆడిట్ చేసేందుకు స్వతంత్ర ఆడిటర్లను నియమించుకోవాలని ఆదేశించినట్టు ఐఆర్‌డీఏఐ తెలిపింది.

కోటక్ షేరు కుంగదీసెన్..

- సెన్సెక్స్ 73 పాయింట్లు డౌన్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు ఆరంభ లాభాలను నిలుపుకోలేకపోయాయి. సోమవారం ప్రారంభ ట్రేడింగ్‌లో 545 పాయింట్ల వరకు పుంజుకున్న సెన్సెక్స్. తొలి గంటలోనే నష్టాల్లోకి మళ్లింది. ఒక దశలో 81,000 స్థాయిని కూడా కోల్పోయిన సూచీ మళ్లీ తేరుకుని, చివరికి 73.48 పాయింట్ల నష్టంతో 81,151.27 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 72.95 పాయింట్లు నష్టపోయి 24,781.10 వద్ద ముగిసింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లలో భారీగా అమ్మకాలతోపాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోవడం మార్కెట్‌ను కుంగదీసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 21 నష్టపోగా.. నిరాశాజనక త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన కోటక్ బ్యాంక్ షేరు ఏకంగా 4.29 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలైతే 1.63 శాతం వరకు నష్టపోయాయి.

అఫ్కాన్స్ ఐపీఓ ధరల శ్రేణి రూ.440-463

షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.440-463గా నిర్ణయించింది. కంపెనీ పబ్లిక్ ఆఫరింగ్ ఈ నెల 25న ప్రారంభమై 29న ముగియనుంది. ఐపీఓ ద్వారా కంపెనీ మొత్తం రూ.5,430 కోట్లు సమీకరించాలని భావిస్తోంది.

ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న
టాప్ 10 నగరాల్లో హైదరాబాద్

- సావిల్స్ గ్రోత్ హబ్స్ నివేదిక వెల్లడి
- భారత్ నుంచి 4 నగరాలకు చోటు




న్యూఢిల్లీ: హైదరాబాద్ అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న టాప్-10 నగరాల్లో నాలుగో స్థానం సంపాదించింది. అంతర్జాతీయ ప్రాపర్టీ అడ్వైజర్ సావిల్స్. 'సావిల్స్ గ్రోత్ హబ్స్' పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది. ఈ జాబితాలో మన దేశం నుంచి నాలుగు నగరాలు బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, ముంబై స్థానం సంపాదించాయి. ఇందులో బెంగళూరు అగ్రస్థానంలో ఉండగా రెండో స్థానంలో వియత్నాం.. హోచిమన్ సిటీ నిలవగా మూడు, ఐదు స్థానాల్లో ఢిల్లీ, ముంబై ఉన్నాయి. 2033 నాటికి గణనీయంగా పెరగనున్న జీడీపీ వృద్ధి రేటుతో పాటు ఇతరత్రా అంశాలు హైదరాబాద్ సహా ఇతర నగరాలు శరవేగంగా వృద్ధి చెందేందుకు దోహదపడున్నాయని నివేదిక వెల్లడించింది. తలసరి ఆదాయంలో పెరుగుదల, ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధి చెందుతున్న టెక్నాలజీ హబ్స్‌ల్లో హైదరాబాద్ కీలకంగా ఉండనుందని తెలిపింది. మరోవైపు పెరుగుతున్న జనాభా, ఆదాయాలు, విస్తరిస్తున్న ఆర్థిక వ్యవస్థ, నూతన అభివృద్ధి విధానాలు, టెక్నాలజీ, వ్యూహాత్మక ఉనికి హైదరాబాద్ అభివృద్ధికి దోహదపడనున్నాయని సావిల్స్ తెలిపింది. యువత, అత్యుత్తమ నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులతో టెక్నాలజీ రంగంతో పాటు ఆర్థికాభివృద్ధిలో భాగ్యనగరం దూసుకుపోతుందని వెల్లడించింది. ఇదే సమయంలో వలసలు పెరగడంతో 2033 నాటికి ఢిల్లీ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన నగరంగా అవతరిస్తుందని సావిల్స్ అంచనా వేసింది. అలాగే హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం ఎంతగానో దోహదపడనుందని తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,640 ▲	73,000 ▲	1,09,000 ▲
ముంబై	78,214 ▲	71,644 ▲	97,254 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	530
వరంగల్	507	గోదావరి	525
చిత్తూరు	558	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	135
వరంగల్	125	గుంటూరు	133
కరీంనగర్	125	ఒంగోలు	133
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	120
కర్నూలు	125	నెల్లూరు	120
విశాఖపట్నం	120	అనంతపురం	120
గోదావరి	135		

జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలి

- మంత్రి దామోదరకు టీయూడబ్ల్యూజే వినతి
- త్వరలో ఉన్నతస్థాయి భేటీలో చర్చిస్తామన్న మంత్రి

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్లుగా జర్నలిస్టుల ఆరోగ్య పథకం (జేహెచ్ఎస్) సక్రమంగా అమలుకాకపోవడంతో జర్నలిస్టులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే జేహెచ్ఎస్ అమలయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) కోరింది. సోమవారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం బంజారాహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ కార్యాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఆర్.వి.కర్ణన్‌ను కలిసి జేహెచ్ఎస్ అమలుపై చర్చించింది. పథకం అమలుకాకపోవడంతో పలువురు జర్నలిస్టులు అప్పులు చేసి చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. వెంటనే ఆరోగ్య పథకాన్ని పునరుద్ధరించి జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత కల్పించాలని మంత్రిని కోరారు. కాగా జేహెచ్ఎస్ విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, ప్రభుత్వ ఉద్యోగులతోపాటు జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని పటిష్ఠంగా అమలుచేసే విషయంలో త్వరలో శాఖాపరంగా ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి చర్చిస్తామని టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి మంత్రి దామోదర హామీ ఇచ్చారు.

తప్పుడు ప్రకటనలతో సీఎం స్థాయి తగ్గించకు

- బిడ్డ పుట్టక ముందే కుల్ల కుట్టినట్లు రేవంత్ మాటలు
- పునరుజ్జీవం పేరుతో ప్రజాధనం లూటీ: హరీశ్‌రావు



హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల భర్తీ గురించి వివరాలు కావాలంటే ఆర్థిక శాఖ నుంచి తెప్పించుకో తప్పుడు ప్రకటనలు చేస్తూ ముఖ్యమంత్రికి ఉండే స్థాయిని తగ్గించకని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఇచ్చిన 30 వేల ఉద్యోగాల నోటిఫికేషన్లకు నియామకపత్రాలు ఇచ్చి డబ్బా కొట్టుకుంటున్నావ్ అంటూ సీఎంను ఎద్దేవా చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో సీఎం ప్రకటించడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. సీఎం వంద సార్లు చెప్పినంత మాత్రాన అబద్ధాలు నిజమైపోవని తెలుసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. గ్రూప్-1 విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆకాంక్షలను కాలరాస్తూ కర్కశంగా, కఠినంగా వ్యవహరించిన రేవంత్‌ను తెలంగాణ సమాజం క్షమించదని, నిరుద్యోగులను లాఠీలతో కొట్టి, అరెస్టులు చేసిన సీఎం వైఖరిని విస్మరించదని పేర్కొన్నారు. ఉద్యోగాల ఆశచూపి మోసంచేసి అధికారంలోకి వచ్చిన మీకు నిరుద్యోగులే బుద్ధి చెబుతారని హరీశ్‌రావు హెచ్చరించారు. మూసీపై పూటకో మాట మాట్లాడుతున్న సీఎంను చూసి ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతోందని ఎద్దేవా చేశారు. పలు సందర్భాల్లో బిడ్డ పుట్టక ముందే కుల్ల కుట్టినట్లు డీపీఆర్ లేకుండా లక్షన్నర కోట్లు ఖర్చవుతుందని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లుతుందని విమర్శించారు. మూసీ పేరుతో ప్రజాధనం లూటీ చేయాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రను బట్టబయలు చేస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు.

మూసీ బాధితులకు అండగా 25న బీజేపీ మహాధర్నా

- 23, 24న మూసీ పరీవాహక ప్రాంతంలో పర్యటన
- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

మూసీ బాధితులకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 25న మహాధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అధ్యక్షతన ధర్నాచౌక్ వద్ద ఈ మహాధర్నా జరుగుతుందని పేర్కొన్నారు. మూసీ బాధితులకు బాసటగా నిలిచేందుకు ఈ నెల 23, 24 తేదీల్లో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు మూసీ పరీవాహక ప్రాంతంలో పర్యటిస్తారని కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ కట్టి, ఆ తర్వాత పునరుజ్జీవం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

హరీశ్‌రావు చెప్పినవన్నీ అబద్ధాలే

- మల్లన్నసాగర్ భూనిర్వాసితుల మండిపాటు

గజ్వేల్, అక్టోబరు 21: మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పినవన్నీ అబద్ధాలేనని మల్లన్నసాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ భూనిర్వాసితులు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీపై గజ్వేల్‌లో ఆదివారం హరీశ్‌రావు మాట్లాడిన మాటలకు నిరసనగా సోమవారం ఆయన బ్యానర్‌ను దహనం చేశారు. వారికి కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ మాట్లాడుతూ.. హరీశ్‌రావు మీడియా సమావేశంలో మాట్లాడినవి పూర్తి అబద్ధమన్నారు. ట్రాన్స్‌పోర్టేషన్ కోసం రూ.50 వేలు ఇచ్చామని చెప్పడం అబద్ధమని, కొందరు బ్రోకర్లను తయారు చేసి వాళ్లే పంచుకున్నారని ఆరోపించారు. దేశంలోనే మోడల్ ఆర్ అండ్ ఆర్ కాలనీగా తీర్చిదిద్దామని చెబుతున్నారని, కానీ కాలనీవాసులు చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా శ్మశానవాటిక లేదన్నారు. గుడికి, మసీదుకు వెళదామన్నా అవి లేవన్నారు. గ్రామాలను తరలిస్తున్నప్పుడు ఉపాధి కల్పిస్తామని, కంపెనీలు పెడతామని చెప్పి నట్టేట ముంచారని మండిపడ్డారు. భూనిర్వాసితుల ఉసురు ఇప్పటికే తగిలిందని, ఇంకా తగులుతుందన్నారు.

పటిష్ఠ విధానం కోసమే విద్యా కమిషన్: కోదండ

హైదరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అస్తవ్యస్తంగా మారిన విద్యా విధానాన్ని పటిష్ఠ పరచడానికే ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు సమూల మార్పులు చేపట్టి పేద, బడుగు, బలహీన వర్గాల వారందరికీ సముచిత న్యాయం కల్పించే లక్ష్యంతో ఈ కమిషన్ పనిచేయాలని సూచించారు. విద్యా కమిషన్ సభ్యునిగా నియమితుడైన ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావును సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన సన్మానించారు. విశ్వేశ్వరరావు నియమాకంతో కమిషన్‌కే గౌరవం వచ్చిందన్నారు. విద్యారంగంలో తనకున్న 40 సంవత్సరాల అనుభవాన్ని ఉపయోగించి ఉన్నత విద్యలో సంస్కరణలు తీసుకువస్తానని విశ్వేశ్వరావు అన్నారు.

ఈడబ్ల్యూఎస్ తో బీసీలకు తీరని అన్యాయం

- జీవో నెంబర్ 29ని వెంటనే రద్దు చేయాలి
- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కోరిన బీసీ నేతలు

పంజాగుట్ట,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయడం వల్ల బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని బీసీ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు తీవ్ర నష్టం కలిగించే జీవో నెంబర్ 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ సంఘాల ప్రతినిధుల బృందం రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అనంతరం రాజ్ భవన్ బయట వారు మాట్లాడుతూ జనాభా లెక్కలు లేకుండా, ఎలాంటి శాస్త్రీయత లేకుండా ఉద్యోగాల నియామకాలలో అగ్రవర్ణాల పేదల పేరుతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10 శాతం అమలు చేయడం మూలంగా బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు.

శబరిమలకు 'భారత్ గౌరవ్' యాత్ర

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : శబరిమల యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ భారత్ గౌరవ్ పేరిట ప్రత్యేక పర్యాటక ప్యాకేజీని ప్రకటించింది. 16న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభం కానున్న ఐఆర్‌సీటీసీ భారత్ గౌరవ్ ప్రత్యేక రైలు శబరిమల యాత్ర ఐదురోజుల పాటు కొనసాగనుంది. ఈ యాత్ర శబరిమలలోని ప్రసిద్ధ అయ్యప్పస్వామి ఆలయం, చొట్టనిక్కరలోని చొట్టనిక్కర దేవి ఆలయాలను కవర్ చేస్తుంది.

సహించేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

శాంతిభద్రతల విషయంలో రాజీ పడటం లేదని అభినందించారు. కేఎస్ వ్యాస్, పరదేశి నాయుడు, ఉమేష్‌చంద్ర, కృష్ణప్రసాద్ వంటి వందలాది మంది పోలీసు అధికారులు అమరులై శాంతిభద్రతలను కాపాడటంలో స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.

ఆర్థికసాయంతో ఆదుకుంటాం..

పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, తగిన ఆర్థికసాయం అందించి ఆదుకుంటుందని సీఎం భరోసా ఇచ్చారు. విధినిర్వహణలో అమరులయ్యే పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు.. కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు కోటి రూపాయలు, ఎస్సై, ఇన్‌స్పెక్టర్‌కు రూ.1.25 కోట్లు, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు రూ.1.50 కోట్లు, ఎస్పీ, ఆపై స్థాయి ఐపీఎస్ కుటుంబాలకు రూ.2 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు రూ.50 లక్షలు, ఎస్సై, ఇన్‌స్పెక్టర్, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు రూ.60 లక్షలు, ఎస్పీ, ఆ పైస్థాయి ఐపీఎస్‌లకు కోటి రూపాయల సహాయం అందిస్తామన్నారు. తాత్కాలిక వైకల్యం బారిన పడే సిబ్బందిలో కానిస్టేబుల్ నుంచి అడిషనల్ ఎస్పీ స్థాయి వరకు రూ.10 లక్షలు, ఎస్పీ, ఆపైస్థాయి ఐపీఎస్‌లకు రూ.12 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. ఇటీవల విధినిర్వహణలో మృతి చెందిన సీనియర్ ఐపీఎస్ రాజీవ్‌రతన్ కుమారుడికి గ్రేడ్-2 ఉద్యోగం, కమాండెంట్ మురళీ కుటుంబ సభ్యులకు డిప్యూటీ ఎమ్మార్వో ఉద్యోగం ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు.

సమాజానికి రోల్‌మోడల్‌గా ఉండాలి..

సమాజానికి పోలీసులు ఆదర్శంగా నిలవాలని సీఎం రేవంత్ సూచించారు. విధినిర్వహణలో సహనం కోల్పోతే కొత్త సమస్యలు వస్తాయన్నారు. 99 శాతం మంది నిబద్ధతతో పనిచేసి ఎక్కడో ఒక శాతం మంది తప్పు చేసినా.. మొత్తం పోలీస్ వ్యవస్థను వేలెత్తి చూపిస్తారని చెప్పారు. అలాంటి పరిస్థితి రానివ్వద్దన్నారు. పోలీసులు ఆత్మగౌరవంతో బతకాలని, ఎదుటివారు చులకనగా మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని సూచించారు. పోలీస్‌లకు ఎలాంటి లోటు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఉన్నతాధికారులు పోలీస్ సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ లాంటి సంస్థలను ఏర్పాటు చేసి.. తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. మొహర్రం, బక్రీద్, క్రిస్మస్, వినాయక చవితి, హనుమాన్ జయంతి వంటి ఉత్సవాల సమయంలో మౌలిక సదుపాయాలు లేకపోయినా పోలీసులు అద్భుతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. ఇటీవల జరిగిన పోలీస్ నియామకాల్లో ఉన్నత విద్యనభ్యసించిన వారు కానిస్టేబుళ్లు, ఎస్సైలుగా చేరారని, గొప్ప లక్ష్యం కోసం యువత పోలీస్ ఉద్యోగంలో చేరుతున్నారని తెలిపారు. పోలీసులు బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటూ నేరస్తులతో కఠినంగా వ్యవహరించాలన్నారు.



గోషామహల్ మైదానంలో పోలీస్ అమరుల స్థూపానికి వందనం చేస్తున్న సీఎం రేవంత్

పంజాబ్‌లో విపత్కర పరిస్థితులు..

పంజాబ్‌లో యువత డ్రగ్స్‌కు బానిస అయ్యారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డ్రగ్స్ విషయంలో ఆ రాష్ట్రం విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటోందన్నారు. తెలంగాణలో గత పదేళ్లలో గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి డ్రగ్స్ వినియోగం పెరిగిందని, రాష్ట్రంలో గంజాయి సాగు లేకపోయినా.. పొరుగు రాష్ట్రాల నుంచి తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల కట్టడికి తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరోను ఏర్పాటు చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫిజికల్ పోలీసింగ్‌తోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీని ఉపయోగించుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. నేరగాళ్లు ఇప్పుడు సరికొత్త పద్ధతుల్లో వస్తున్నారని, సైబర్ నేరాల బారిన పడుతున్న వారిలో చదువుకున్నవారే ఎక్కువగా ఉంటున్నారని చెప్పారు. సైబర్ నేరాల కట్టడిలో తెలంగాణ పోలీసుల కృషిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందించారని గుర్తు చేశారు. కాగా, గత ఫిబ్రవరిలో కూంబింగ్ ఆపరేషన్‌లో మృతి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ఆది ప్రవీణ్ కుటుంబాన్ని గోషామహల్ స్టేడియంలో సీఎం రేవంత్ పరామర్శించారు. తగినవిధంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన విశ్రాంత ఐపీఎస్ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వారు కూర్చున్న వేదిక వద్దకు సీఎం స్వయంగా వెళ్లి మాట్లాడారు. కాగా ఈ సందర్భంగా స్టేడియంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

సీఎంకు పోలీస్ సంఘం కృతజ్ఞతలు..

పోలీస్ అమరుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం గతంలో ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని భారీగా పెంచడం పట్ల పోలీస్ అధికారుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. సీఎం నిర్ణయం పోలీస్ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైగోపిరెడ్డి తెలిపారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ భవనానికి శంకుస్థాపన

పోలీసులు, పోలీసు అమరవీరుల కుటుంబాల పిల్లలకు, ఇతర యూనిఫామ్ సర్వీసు శాఖల ఉద్యోగుల పిల్లల కోసం ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'ను ఏర్పాటు చేయనుంది. ఈ స్కూల్ ఏర్పాటుకు ప్రాథమికంగా అనుమతిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రమాణాలు, నివాస సౌకర్యాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో పోలీసు పిల్లల కోసం ఒక ప్రత్యేక గురుకుల విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలంటూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ పాఠశాల భవనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. మంచిరేవులలో గ్రేహౌండ్స్ విభాగానికి చెందిన భూమిలో 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ పాఠశాలను నిర్మించనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాల అందుబాటులోకి వస్తుంది. మొదటగా 5 నుంచి 8వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆ పై తరగతులు ప్రారంభమవుతాయి. పోలీస్‌తో పాటు యూనిఫాం సర్వీసులైన అగ్నిమాపక శాఖ, ఇతర విభాగాల్లో పనిచేసే వారి పిల్లలకు యంగ్ ఇండియా స్కూల్‌లో చదువుకునే అవకాశం కల్పించనున్నారు. ఇందులో 15 శాతం స్థానిక పిల్లలకు కూడా అవకాశం కల్పిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, అదనపు డీజీపీ మహేష్ భగవత్, గ్రేహౌండ్స్ చీఫ్ స్టీఫెన్ రవీంద్ర, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐజీ రమేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

డైట్, కాస్మెటిక్ చార్జీలు 40శాతం పెంపు?

సిఫారసు చేసిన ఉన్నతాధికారుల కమిటీ

డిప్యూటీ సీఎం భట్టికి నివేదిక అందజేత

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల నెలవారీ డైట్, కాస్మెటిక్ చార్జీలు పెరగనున్నాయి. ఇవి దాదాపు 40 శాతం మేర పెరిగే అవకాశాలున్నాయి. దీనివల్ల 7.65 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. చార్జీల పెంపు కోసం ప్రభుత్వం నియమించిన ఉన్నతాధికారుల కమిటీ సోమవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు నివేదికను సమర్పించింది. ప్రస్తుతమున్న చార్జీలకు అదనంగా 40 శాతం మేర పెంచాలంటూ కమిటీ సిఫారసు చేసింది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. 26న జరిగే క్యాబినెట్ సమావేశంలో కమిటీ నివేదికపై చర్చించి నిర్ణయం తీసుకోవచ్చని సమాచారం. నిజానికి సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యార్థుల కాస్మెటిక్ చార్జీలు 16 ఏళ్ల నుంచి , డైట్ చార్జీలు ఏడేళ్ల నుంచి పెరగడం లేదు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వీటి గురించి పెద్దగా పట్టించుకోలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత... ఈ చార్జీలను పెంచాలంటూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం తదితరులు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టికి విజ్ఞప్తి చేశారు. సీఎం సూచన మేరకు డిప్యూటీ సీఎం భట్టి ఈ నెల 17న బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అధ్యక్షతన ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశారు. డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు కోసం ఈ కమిటీ పలు అంశాలను పరిశీలించింది. గత ప్రభుత్వం కాస్మెటిక్ చార్జీలపై నియమించిన కమిటీ 2023, మార్చి 1న ఇచ్చిన నివేదికను కూడా పరిశీలించింది. 2022, ఫిబ్రవరి 22న మహిళా శిశు సంక్షేమ శాఖ... దివ్యాంగుల వసతి గృహాల్లోని విద్యార్థులకు పెంచిన డైట్ చార్జీలను పరిగణనలోకి తీసుకున్నది. అన్నీ పరిశీలించి 40 శాతం మేర నెలవారీ కాస్మెటిక్, డైట్ చార్జీలను పెంచాలంటూ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ చార్జీలను పెంచడం వల్ల రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లోని 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని కమిటీ వివరించింది.

కమిటీ సిఫారసు చేసిన డైట్ చార్జీలు(రూ.లలో)

తరగతి	ప్రస్తుతం	పెరిగితే
3నుంచి - 7వ తరగతి వరకు	950	1330
8నుంచి 10వ తరగతి వరకు	1100	1540
ఇంటర్ నుంచి పీజీ వరకు	1500	2100
కాస్మెటిక్ చార్జీలు (విద్యార్థినుల కోసం)		
3నుంచి 7వ తరగతి వరకు	55	175
8నుంచి 10వ తరగతి వరకు	75	275
కాస్మెటిక్ చార్జీలు (విద్యార్థుల కోసం)		
3నుంచి 7వ తరగతి వరకు	62	150
8నుంచి 10వ తరగతి వరకు	62	200



'బ్యాడ్ టచ్' అవగాహనలో ఇద్దరిపై లైంగిక వేధింపులు

- అటెండర్ దుశ్చర్య..

బయటపెడితే చంపేస్తానని హెచ్చరిక

భువనగిరి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎంత దారుణం? ఆ బాల సదనంలోని అనాథ బాలికలకు ఓవైపు 'బ్యాడ్ టచ్.. గుడ్ టచ్'పై అవగాహన కల్పిస్తుండగానే ఓ వ్యక్తి అక్కడి ఓ బాలికపై తీవ్ర లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఈ నెల 14వ తేదీన జరిగిన ఘోరానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన బాలసదనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎల్ఎస్ఏ సెక్రటరీతో పాటు వచ్చిన అటెండర్ వెంకటరెడ్డి.. ఇద్దరు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలికలకు బ్యాడ్ టచ్.. గుడ్ టచ్‌పై డిఫెన్స్ కౌన్సిల్ అవగాహన కల్పిస్తున్న క్రమంలో ఓ బాలిక మరుగుదొడ్డికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో అటెండర్ వెంకటరెడ్డి ఆ బాలిక ఛాతీపై చెయ్యి వేయడంతోపాటు పెదవులపై పళ్ల గాటు పడేలా కొరికాడు. మరో బాలికతోనూ అతడు అసభ్యంగా ప్రవర్తించాడు. పైగా విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని హెచ్చరించాడు. దీంతో భయపడిన బాలికలు తమ గదిలోకి వెళ్లిపోయారు. కార్యక్రమం ముగిశాక బాలికలు అదో రకంగా ఉండటాన్ని గమనించిన బాలసదనం సిబ్బంది వారిని ప్రశ్నించగా తమపై అటెండర్ వెంకట్‌రెడ్డి లైంగిక దాడికి పాల్పడినట్లు చెప్పారు. తమ శరీరంపై గాయాలను చూపించారు. ఈ విషయాన్ని బాలసదనం సూపరింటెండెంట్ లలిత జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీవో) సైదులు, సీడబ్ల్యూసీ చైర్మన్ జయశ్రీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ నరసింహారావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి (పీఓఐసీ) అలివేలు సమాచారమిచ్చింది. పోక్సో చట్టం ప్రకారం బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడినా, లైంగిక దాడి చేసినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంది. అయితే డీసీపీవో సదరు వ్యక్తిపై పోక్సో చట్టం కింద ఫిర్యాదు చేయలేదు. అంతేకాక తమ ఉద్యోగాలకు ఇబ్బంది కలుగుతుందని విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు సమాచారం. ఆదివారం విషయం బయటకు రావడంతో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ అవుట్ సోర్సింగ్ అటెండర్‌గా పనిచేస్తున్న వెంకట్‌రెడ్డిపై పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. లోతైన దర్యాప్తునకు కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఆదేశాలు జారీ చేశారు. కాగా ఘటనపై స్పష్టత కొరవడటం, బాధిత బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చాక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సంబంధిత శాఖ అధికారుల నిర్ణయంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదని బాల సదనం సూపరింటెండెంట్ లలిత పేర్కొన్నారు.

రెచ్చగొట్టే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

డీజీపీని ఆదేశించాలని కోరింది. ఈ మేరకు సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్ రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి తదితరులు వినతిపత్రం అందజేశారు. ముత్యాలమ్మ గుడిపై జరిగిన దాడి ఘటనతో పాటు జాతి వ్యతిరేక కార్యక్రమాలపై ఒక హోటల్‌లో శిక్షణ పొందిన వారిపై సమగ్ర నివేదిక తెప్పించుకోవాలని వారు గవర్నర్‌ను కోరారు. ముత్యాలమ్మ గుడిపై దాడికి నిరసనగా శాంతియుత ర్యాలీ చేపట్టిన హిందూ యువతపై అక్రమ కేసులు పెట్టారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇటు డీజీపీ జితేందర్‌ను కూడా బీజేపీ ప్రతినిధుల బృందం కలిసింది. ఆలయాలపై జరుగుతున్న దాడులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరింది. పలు కేసుల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి దాడికి పాల్పడ్డవారికి మతిస్థిమితం లేదంటూ ముందే ప్రకటించడం ద్వారా హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని స్పష్టం చేసింది. రాష్ట్రంలో నిఘా వ్యవస్థ విఫలమైందని ఈటల ఆరోపించారు. హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఆలయాల మీద బయట నుంచి వచ్చిన కొంతమంది దుర్మార్గులు దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. గవర్నర్ కలసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'ముత్యాలమ్మ గుడి మీద దాడి చేసిన వ్యక్తులు పక్కనే ఉన్న హోటల్లో శిక్షణ పొందారు. దాడి చేసిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగిస్తే మతిస్థిమితం లేని వాడంటున్నారు. హైదరాబాద్‌లో ఇట్లాంటి 15 బృందాలు శిక్షణ పొంది హిందూ మనోభావాలు దెబ్బకొట్టే దుర్మార్గ కుట్ర చేస్తున్నాయి. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే ప్రయత్నం జరుగుతుందని తెలిసినా ప్రభుత్వం కళ్లు తెరవడం లేదు. లుంబినీపార్క్, గోకుల్ చాట్ వద్ద పేలుళ్ల ఘటనలను ఇంకా మర్చిపోలేదు. మళ్లీ అలాంటి కుట్రకు ఈ దుర్మార్గులు తెరలేపే అవకాశముందని గవర్నర్‌కు తెలియజేశాం' అని ఈటల వివరించారు. 3 నెలల్లో 15 ఆలయాలపై దాడులు జరిగాయని, వీటిపై సమగ్ర విచారణకు ఆదేశించాలని డీజీపీని కోరినట్లు రఘునందన్‌రావు తెలిపారు. వ్యక్తిత్వ వికాస శిక్షణ పేరిట సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకు స్లీపర్‌సెల్స్ కుట్ర పన్నాయని, దీన్ని ఛేదించాలని డీజీపీని కోరినట్లు చెప్పారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవాలయాలపై దాడుల ఘటనలు పునరావృతమైతే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ముత్యాలమ్మ గుడి వద్ద హిందూ కార్యకర్తలపై లాఠీచార్జ్ చేయడమే కాకుండా, వారిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. దీని దృష్ట్యా అడ్వకేట్లతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కోరారు.

గవర్నర్‌కు వీహెచ్‌పీ ఫిర్యాదు..

ముత్యాలమ్మ ఆలయం వద్ద శాంతియుత ఆందోళన చేసిన హిందూ యువకులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారని గవర్నర్‌కు వీహెచ్‌పీ ఫిర్యాదు చేసింది. ఆ అక్రమ కేసులను ఎత్తివేసేందుకు ఆదేశాలివ్వాలని, లాఠీచార్జ్ చేసిన పోలీసు అధికారులపై చర్యలకు ఆదేశించాలని కోరింది. ఈ మేరకు వీహెచ్‌పీ ప్రతినిధులు రామరాజు, సునీతారామ్మోహన్‌రెడ్డి, పగుడాకుల బాలస్వామి తదితరులు గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు.

రేవంత్ చెప్పేవి పచ్చి అబద్ధాలు!

- 60వేల ఉద్యోగాలు ఎవరికిచ్చారు?
- రేవంత్, సంజయ్...

రహస్య స్నేహితులు: కేటీఆర్



హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను మభ్యపెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 60వేల ఉద్యోగాలు ఇచ్చిందంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 60వేలు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఎప్పుడిచ్చారు? పరీక్షలు ఎప్పుడు పెట్టారో చెప్పాలి? అని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తాము ఇచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రాలు జారీ చేస్తూ... బీఆర్ఎస్ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని సిగ్గు లేకుండా చెబుతున్నారన్నారు. కేసీఆర్ హయాంలో 1.60లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చింది వాస్తవం కాదా? వాళ్లకు ప్రభుత్వం జీతాలు ఇస్తున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, రిజర్వేషన్లకు విఘాతం కలుగుతుందన్నారు. ఈ విషయంలో హైకోర్టు నిర్ణయం తీసుకునే వరకు గ్రూప్-1 ఫలితాలు వెల్లడించొద్దన్న సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. జీవో29కు వ్యతిరేకంగా హైకోర్టులో అభ్యర్థుల తరఫున కొట్లాడతామన్నారు. మూసీ విషయంలో బీఆర్ఎస్ కంటే ఎక్కువ ప్రశ్నించాల్సింది జర్నలిస్టులేనని, లక్షన్నర కోట్లు మూసీలో పోద్దామంటే చూస్తూ ఊరుకుందామా? అని ప్రశ్నించారు. జర్నలిస్టులపై బీఆర్ఎస్‌కు ఎనలేని గౌరవం ఉందని, ఎన్నడూ తాను ఎవరినీ అవమానించలేదన్నారు. విద్యుత్ చార్జీల విషయంలో ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో ప్రజలపై పెను భారం పడే అవకాశం ఉందని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచాలంటూ డిస్కమ్‌లు చేసిన 9 ప్రతిపాదనలను అంగీకరించొద్దని ఈఆర్సీ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈనెల 23న జరిగే బహిరంగ విచారణలో పాల్గొని అభిప్రాయాలు చెప్పాలని ఈఆర్సీ చైర్మన్ తమకు సూచించారన్నారు. రేవంత్‌రెడ్డి కుర్చీ పోతుంటే.. కేంద్ర మంత్రి బండి సంజయ్ బాధపడుతున్నారని, వారిద్దరూ రహస్య స్నేహితులని ఆరోపించారు. ముత్యాలమ్మ గుడి సంఘటనను తాను ఖండిస్తే శాంతిభద్రతల సమస్య అంటూ సైబర్ క్రైమ్ వాళ్లు తనపై ట్విట్టర్ కు ఫిర్యాదు చేశారని వెల్లడించారు. ముఖ్యమంత్రికి చేతనైతే శాంతి భద్రతలను కాపాడాలని, సోషల్ మీడియాను ఏదో చేయాలని ప్రయత్నించటం అరాచకమని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక తిరోగమన పరిస్థితిపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. విధ్వంసకర విధానాలతో జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రం ఆఖరి స్థానంలో నిలిచి అనూహ్యమైన ఘనతను సాధించిందని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు.

మార్గదర్శి కేసులో వాదనలకు సిద్ధంకండి

రిజర్వు బ్యాంకుకు తెలంగాణ హైకోర్టు నిర్దేశం

హైదరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో వాదనలు వినిపించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) సిద్ధంగా ఉండాలని తెలంగాణ హైకోర్టు నిర్దేశించింది. అదేవిధంగా డిపాజిటర్లు, ఇన్వెస్టర్లకు తిరిగి చెల్లించిన నగదు వివరాలకు సంబంధించి సమర్పించిన 69,530 పేజీల వివరాలను ఎలక్ట్రానిక్ రూపంలో సిద్ధం చేయాలని మార్గదర్శికి సూచించింది. ఈ కేసును రెండు కోణాల్లో విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు నిర్దేశించిందని వ్యాఖ్యానించింది. పబ్లిక్ నోటీసు ఇచ్చి ఇంకా ఎవరైనా అభ్యంతరాలు ఉన్నవారు ఉంటే వారి సమస్యలను పరిష్కరించడంతోపాటు, ఆర్బీఐ వాదనలు సైతం వినాల్సి ఉంటుందని తెలిపింది. ఈ కేసు విచారణ పారదర్శకంగా ఉండాలంటే డిపాజిటర్లకు చేసిన చెల్లింపుల వివరాలను పెన్‌డ్రైవ్(ఎలక్ట్రానిక్) రూపంలో పిటిషనర్ ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు అందజేయడమే ఉత్తమమని కోర్టు తెలిపింది. ఇప్పటికే హార్డు కాపీలు ఆయనకు అందుబాటులో ఉన్నాయి కాబట్టి ఎలక్ట్రానిక్ రూపంలో ఇవ్వడం వల్ల వచ్చే నష్టమేమీ ఉండదని పేర్కొంది. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్లు సేకరించిందని పేర్కొంటూ అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం కేసు నమోదు చేసింది. దీనిని కొట్టేయాలని కోరుతూ మార్గదర్శి సంస్థ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిని 2018లో హైకోర్టు అనుమతిస్తూ మార్గదర్శిపై కేసు కొట్టేసింది. హైకోర్టు తీర్పుపై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు తీర్పును కొట్టేసిన సుప్రీంకోర్టు.. మళ్లీ విచారించాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం ఎదుట ఈ పిటిషన్‌పై విచారణ జరుగుతోంది. సోమవారం జరిగిన విచారణలో ఉండవల్లి అరుణ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వినిపించారు.


నిజామాబాద్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, చిత్రంలో మంత్రి జూపల్లి, షబ్బీర్ అలీ, జీవన్ రెడ్డి, తదితరులు

బీసీ బిడ్డగా భరోసా ఇస్తున్నా

- జీవో 29తో రిజర్వుడ్ అభ్యర్థులకు అన్యాయం జరగదు
- ప్రశాంతంగా పరీక్ష రాసుకోండి- పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

హైదరాబాద్, నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిలుపుదలకు సుప్రీంకోర్టు నిరాకరించడం పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ యువతకు ఉన్నత ఉద్యోగాలు ఇవ్వాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను హైకోర్టు, సుప్రీంకోర్టు సమర్థించాయన్నారు. ఇక ఎలాంటి ఆందోళన, ఆలోచనలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసుకోవాలంటూ అభ్యర్థులకు సూచించారు. 13 ఏళ్ల తర్వాత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవో 29 వల్ల రిజర్వుడు క్యాటగిరీ అభ్యర్థులకు ఎలాంటి అన్యాయమూ జరగదని ఒక బీసీ బిడ్డగా తాను విద్యార్థులకు మరోసారి భరోసా ఇస్తున్నానని పేర్కొన్నారు. అంతకుముందు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) ఛైర్మన్‌గా నియమితులైన కేశవేణు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వాటి రాజకీయ లబ్ధి కోసం గ్రూప్ -1 అభ్యర్థులను పావుగా వాడుకున్నాయన్నారు. కార్యకర్తలనుద్దేశించి... పార్టీ కోసం కష్టపడ్డ వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యమిస్తామని స్పష్టం చేశారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ... ప్రభుత్వంపై సోషల్ మీడియాతో పాటు కొన్ని మీడియా సంస్థల ద్వారా విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

వ్యవసాయ కమిషన్‌లో ఏడుగురు సభ్యులు

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, సంక్షేమ కమిషన్‌లో ప్రభుత్వం ఏడుగురు సభ్యులను నియమిస్తూ వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్(ఆదిలాబాద్), ఎం. సునీల్ కుమార్ (భూమి సునిల్, హైదరాబాద్), రాంరెడ్డి గోపాల్‌రెడ్డి(ఖమ్మం), గడుగు గంగాధర్ (నిజామాబాద్), కేవీ నరసింహారెడ్డి(నాగర్ కర్నూల్), చెవిటి వెంకన్న యాదవ్(సూర్యాపేట), మరికంటి భవాని(సిద్ధిపేట)లను కమిషన్ సభ్యులుగా నియమించారు.

విభజన సమస్యలపై 24న ఢిల్లీలో కీలక భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టానికి సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఉన్న పలు అపరిష్కృత అంశాలపై చర్చించేందుకు 24న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలక సమావేశం ఏర్పాటు చేసింది. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఆ సమావేశంలో ప్రత్యేకించి తెలంగాణకు సంబంధించిన అంశాలపై చర్చ జరగనుంది. వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో కలిసి హాజరు కావాలని కేంద్ర హోం శాఖ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసినట్టు తెలిసింది. తెలంగాణలో స్టీల్ ప్లాంట్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీల ఏర్పాటు, జాతీయ రహదారులు, అనేక మౌలిక సదుపాయాల కల్పన, విద్యకు సంబంధించిన అంశాలపై చర్చ జరగనుంది. రెండు రాష్ట్రాలకు చెందిన విభజన సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు విజ్ఞప్తి చేశారు. అందుకు అనుగుణంగానే ఈ సమావేశం జరుగుతోంది. తెలంగాణ సమస్యలపై చర్చించిన తర్వాత ఆంధ్రాకు సంబంధించిన విభజన సమస్యలపై కూడా మరో కీలక సమావేశం జరిగే అవకాశం ఉంది.

సెలక్షన్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల హోదాపై స్పష్టత

హైదరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ విధులు నిర్వర్తిస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎవరి అధికార పరిధి ఏమిటనేదానిపై స్పష్టత ఇవ్వకుండానే నాలుగేళ్ల క్రితం రెవెన్యూకు ఒకరు, స్థానిక సంస్థలకు ఒకరు చొప్పున అప్పటి ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను నియమించింది. నిర్దిష్ట జాబ్ చార్ట్ అంటూ లేకుండానే జాయింట్ కలెక్టర్ నిర్వహించే బాధ్యతలను అప్పగించడంతో గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. ముందుగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల విషయంలో నిర్ణయం తీసుకొంది. వారి హోదా ఇతర శాఖల్లోని జాయింట్ డైరెక్టర్ హోదాతో సమానంగా ఉంది. అందువల్ల జాయింట్ కలెక్టర్ విధులు అప్పగించాలంటే వారిని అడిషనల్ డైరెక్టర్ హోదాతో సమానంగా సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదా ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేశారని రెవెన్యూ వర్గాల విశ్వసనీయ సమాచారం. ఈ కారణంగా 33 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు సెలక్షన్ గ్రేడ్ రానుంది.

ఒక కన్నును చంద్రబాబు పొడుచుకున్నారా?

- తెలంగాణ రాష్ట్రంపై ఎందుకింత చిన్న చూపు?
- తిరుమలలో మీడియాతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

తిరుమల/జడ్చర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : "విభజన సందర్భంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్.. రెండు కళ్లలాంటివి అని వ్యాఖ్యానించిన చంద్రబాబు.. నేడు ఒక కన్నును పొడుచుకున్నారా?" అని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి సోమవారం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను ఆమోదించబోమని డయల్ యువర్ ఈవో కార్యక్రమంలోనే వెల్లడించారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తిరుమలలో ఒక గది ఇప్పించాలని తన నియోజకవర్గానికి చెందిన కుటుంబ సభ్యులు కోరితే, ఇప్పించలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఏపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు యాదాద్రి, భద్రాచలం తదితర పుణ్యక్షేత్రాలలో దర్శనాల విషయంలో ఈవోలకు ఫోన్ చేస్తే దర్శనాలు కల్పిస్తున్నారని, మరి తెలంగాణపై ఎందుకింత చిన్నచూపు అని ప్రశ్నించారు. 'వైసీపీ అధికారంలో ఉంటే టీడీపీ నేతలు, టీడీపీ అధికారంలో ఉంటే వైసీపీ నేతలు తెలంగాణలో వ్యాపారాలు చేసుకునేందుకు వస్తారు. మేము ఏనాడూ ఒక్క మాట మాట్లాడలేదు. మా ఎమ్మెల్యేలందరం కలిసి తీర్మానం చేసుకుని మీరు అక్కడికి రావద్దంటే మీకెలా అనిపిస్తుంది. దయచేసి ఇప్పటికైనా పార్టీలకతీతంగా తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలు తీసుకోండి. లేదంటే డిసెంబరులో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలందరం కలిసి నిర్ణయం తీసుకుంటే మీరు బాధపడతారు. అన్నదమ్ములమన్నారు... అన్నదమ్ములుగానే ఉండండి. కేవలం వ్యాపారం కోసమే తెలంగాణకు రాకండి' అని హెచ్చరించారు. ఎంతో బాధతో తాను ఈ అంశాలను ప్రస్తావిస్తున్నానని చెప్పారు. ఇప్పటికైనా తిరుమల దర్శనాలు, వసతి గదులకు తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసుల లేఖలను ఆమోదించాలని కోరారు. ఎమ్మెల్సీ వెంకట్ మాట్లాడుతూ టీటీడీ ఈవో, ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు తగిన గౌరవం ఇవ్వాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

చంగ్ ఏ చంగ్ కళతో సియోల్‌కే అందం!

పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా రవాణా కోసం ఫ్లైఓవర్.. ఆపై నది పునరుద్ధరణ.. చెత్త నుంచి విద్యుదుత్పత్తి

(సియోల్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)

చంగ్ ఏ చంగ్ నది పునరుజ్జీవం మొత్తంగా సియోల్ నగరానికే కళ తెచ్చింది. ఒకప్పుడు పారిశ్రామిక అభివృద్ధి కోసం నదిపై ఫ్లై ఓవర్‌ను నిర్మించి.. తర్వాత మురుగు, కాలుష్యంతో రూపు కోల్పోయిన నది కోసం ఫ్లై ఓవర్‌ను కూల్చేసి.. నదికి సహజమైన మునుపటి రూపు కల్పించింది. గతంలో చెత్త నుంచి విద్యుదుత్పాదన కోసం నిర్మించిన ప్లాంటును కూడా తొలగించింది. ఇప్పుడా ఆ ప్రాంతాన్ని ఒక గ్రీన్‌పార్కుగా మార్చనుంది. ఒకప్పుడు పలు ఆసియా దేశాలతో పాటు వెనకబడిన దేశంగా ఉన్న దక్షిణ కొరియా కాలానుగుణంగా వ్యూహాలతో అభివృద్ధి చెందిన దేశంగా మారింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు నేపథ్యంలో దక్షిణ కొరియాలోని చంగ్ ఏ చంగ్ నదిని కొన్ని నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి కూడా సందర్శించారు. సీఎం సూచనల మేరకు ఈ ప్రాజెక్టును శుక్రవారం మంత్రులు, మూసీ పరీవాహక ప్రాంతంలోని కొందరు ఎమ్మెల్యేలు, అధికారుల బృందం, పాత్రికేయుల బృందం కూడా పరిశీలించింది. ఇంతకీ ఆ ప్రాజెక్టు ఏమిటి? మూసీకి దానికి సారూప్యతలేమిటి?

చంగ్ ఏ చంగ్ నది దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో 600 ఏళ్ల నుంచీ ఉంది. ఉత్తర కొరియాతో యుద్ధం ముగిశాక.. వేగవంతమైన ఆర్థిక వృద్ధిలో భాగంగా 1976లో ఈ నదిపై ఒక ఫ్లై ఓవర్ నిర్మించారు. పారిశ్రామిక రవాణా, వాహనాల రవాణాకు ఇది కీలకంగా ఉండేది. ప్రతిరోజు ఈ వంతెనపై 1.7 లక్షల వాహనాలు రాకపోకలు సాగించేవి. క్రమంగా అక్కడ మురుగు పేరుకుపోవడం, నదీ ప్రవాహం తీవ్రంగా కలుషితమవడం జరిగాయి. అయితే దేశం, సియోల్ అభివృద్ధి చెందాక.. 2002లో అదే ఫ్లై ఓవర్‌ను కూల్చేసి అక్కడ మళ్లీ పాత నదిని పునరుజ్జీవింపజేసింది. అయితే ఆ పునరుజ్జీవం నదికే కాదు. ఆ సియోల్ నగరానికి కూడా అన్నట్లుగా చేసింది. మురికి కూపంలా ఉండే ప్రాంతాన్ని ఇప్పుడు ఆ నగరంలో అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకటిగా మార్చింది. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడింది. అన్నింటికీ మించి ఆ నగర ప్రజల జీవితాల్లో పునరుజ్జీవం నింపింది. ఇప్పుడది అత్యంత రద్దీ ప్రాంతం. దానికి ఇరువైపులా భారీ ఐదు నక్షత్రాల హోటళ్లు. 20నుంచి 50అంతస్థుల వరకు ఉన్న కార్యాలయ సముదాయాల టవర్లు. అలాంటి ప్రదేశంలో ప్రజలకు స్వచ్ఛమైన గాలి పీల్చుకునేందుకు, కాసింత సేద దీరేందుకు అనువైన చోటు. దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకూ ఒక ఆకర్షణీయ ప్రాంతం.


సియోల్‌లోని చంగ్ ఏ చంగ్ నది వద్ద పర్యాటకుల సందడి

పునరుజ్జీవం విషయంలో మూసీ, చంగ్ ఏ చంగ్ ది ఒకటే కథ అయినా...అనేక విషయాల్లో మాత్రం భిన్నత్వం ఉంది. ముఖ్యంగా నిర్వాసితుల విషయం. ఈ నది విషయంలో నిర్వాసితులు పెద్దగా లేరు. మూసీ విషయంలో నిర్వాసితులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అదే సమయంలో మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు పొడవు హైదరాబాద్‌లోనే 55కిలోమీటర్లు. చియాంగ్ యాచిన్ నది పొడవు సియోల్‌లో 10.9 కిలోమీటర్లు మాత్రమే. వెడల్పు కూడా చాలా తక్కువ. దీని వెడల్పు కేవలం 30మీటర్లు మాత్రమే ఉంది. కొన్నిచోట్ల అంతకంటే తక్కువ కూడా ఉంది. దీన్ని ఒక నది అని కూడా అనలేం. ఒక సెలయేటి లాంటిది. దీని అడుగుభాగంలో రాళ్లను వేసి...స్టోన్ పిచ్చింగ్ చేశారు. అంటే అడుగున మట్టి, బురద కాకుండా రాతినేలలా ఉంటుందన్న మాట. మరోవైపు దీనిలోతు కూడా మూడు అడుగులు మాత్రమే ఉంటుంది. ఎప్పుడైనా వరద వస్తే మాత్రం కొంత పెరుగుతుంది. వరద నీరు వచ్చినా అది వెళ్లిపోయేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. అయితే పునరుజ్జీవ ప్రాజెక్టు విషయంలో మాత్రం రెండింటి మధ్య సారూప్యతలున్నాయి. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు గోదావరి నీటిని వినియోగించాలని నిర్ణయించగా చంగ్ ఏ చంగ్ పునరుజ్జీవానికి ఇక్కడి హాన్ నది నీటిని వినియోగించారు. శుద్ధి చేసిన మురికినీరు మూసీలోకలపడం, శుద్ధికోసం ఎస్టీపీల ఏర్పాటు ఎలా జరుగుతుందో చంగ్ ఏ చంగ్ లో కూడా అలానే శుద్ధి చేసిన నీటిని కలుపుతున్నారు. ఇక్కడ శుద్ధిచేసిన నీటిని కలిపేందుకు, అదేవిధంగా వర్షాల సమయంలో భారీగా వచ్చే నీరు ఈ నదిలోనే కలిసేందుకు రెండు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటుచేశారు. ఈ ప్రాజెక్టు వల్ల ఇక్కడ పర్యావరణం మెరుగుపడింది. ఉష్ణోగ్రతలు ఆ చుట్టుపక్కల ప్రాంతాల కంటే 3-4 డిగ్రీలు తక్కువయ్యే స్థాయికి చేరుకున్నాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా ప్రజలకు అందుబాటులో ఉండేలా ఒక ఆహ్లాదకర ప్రదేశం ఏర్పడింది. ఆ చుట్టుపక్కల ఉన్న ఉన్న భవనాలు, స్థలాల ధరలు కూడా బాగా పెరిగాయి. ఇతర ప్రాంతాల్లోని ధరల పెరుగుదల కంటే ఇక్కడ రెట్టింపు శాతం ఆస్తుల విలువలు పెరిగాయని స్థానికులు తెలిపారు.

ప్రతిరోజు 64వేలు.. ఇప్పటికి 20కోట్ల మంది సందర్శకులు

చంగ్ ఏ చంగ్ నదిపై ఉన్న ఫ్లైఓవర్‌ను తొలగించే సమయంలో 5లక్షల టన్నుల కాంక్రీట్‌ను తొలగించారు. నదిని పునరుద్ధరించాక 1.4 లక్షల మొక్కలను ఆ ప్రాంతంలో నాటారు. ఈ ప్రాజెక్టును 2003లో ప్రారంభించి 2005లో పూర్తిచేయగా...అప్పట్లో సుమారు రూ.1,550 కోట్లు ఖర్చయింది. ఇందులో 59శాతం బడ్జెట్ ప్రాజెక్టు నిర్మాణం కోసం, పునరావాసం కోసం 19 శాతం, డిజైన్, ప్రణాళిక కోసం ఐదుశాతం, ఈ నదికి ఇరువైపులా వేసిన చూడచక్కని బొమ్మలు, ల్యాండ్‌స్కేపింగ్ కోసం 4శాతం, ఇతర ఖర్చుల కింద 9శాతం ఖర్చయింది. ఈ నిధులను సియోల్ మెట్రోపాలిటన్ అథారిటీ 70శాతం, కేంద్ర ప్రభుత్వం 20శాతం, ప్రైవేటు రంగం నుంచి 10 శాత సమకూర్చుకున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యాక ఈ 19ఏళ్లలో 20కోట్లమంది దీన్ని సందర్శించారు. ప్రతిరోజు ఈ నదిని సుమారు 64వేల మంది సందర్శిస్తారు. కొరియా ప్రభుత్వంతో పాటు అప్పటి సియోల్ మేయర్‌గా పని చేసిన లీ మ్యుంగ్ బాక్ ఈ ప్రాజెక్టు విషయంలో శ్రద్ధ చూపించారు. ఆ తర్వాత 2008లో అతను ఏకంగా దక్షిణకొరియా అధ్యక్షుడయ్యారు. అయి తే అధ్యక్ష పదవీకాలం ముగిశాక ఆయనపై అవినీతి ఆరోపణలు రావడంతో అరెస్టు కూడా అయ్యారు.


సియోల్‌లోని మాపో రిసోర్స్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్

చెత్త నుంచి సంపద...

అత్యంత పెద్ద నగరాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చెత్త నిర్వహణ. సియోల్‌లో కూడా ఒకప్పుడు డంపింగ్ ప్రాంతంలో 15 ఏళ్లపాటు వేసిన చెత్త...దాదాపు 100 మీటర్లు ఎత్తుకు పేరుకుపోయింది. ఈ చెత్తను సంపదగా మార్చేందుకు సియోల్ మెట్రోపాలిటన్ అథారిటీ వినూత్నంగా ముందుకెళ్లింది. చెత్తను అత్యధిక ఉష్ణోగ్రతల మధ్య మండించి విద్యుత్తుగా తయారు చేసే ప్లాంట్లను నెలకొల్పింది. మాపో రిసోర్స్ రికవరీ ఫెసిలిటీ దీని పేరు. ఇలాంటి ప్లాంటు జవహర్‌నగర్‌లోనూ ఉంది. జవహర్‌నగర్ ప్లాంటులో ఒక టన్ను చెత్త రీసైక్లింగ్‌కు రూ.3,500 ఖర్చవుతుండగా సియోల్‌లో రూ.5,500 ఖర్చవుతుంది. అయితే సియోల్‌లో ప్రభుత్వమే ఆ ప్లాంటును నడుపుతోంది. అదేవిధంగా విద్యుత్తును అమ్మితే వచ్చే ఆదాయమూ ప్రభుత్వానిదే. ఇప్పుడు లాభాలబాటకు ఈ వ్యవస్థ చేరుకుందని సియోల్ మెట్రోపాలిటన్ అభివృద్ధి అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. జవహర్‌నగర్ ప్లాంటును మాత్రం రామ్‌కీ సంస్థ నిర్వహిస్తోంది. ఆ సంస్థకు ఒక టన్ను చెత్త ప్రాసెస్ చేసినందుకు సుమారుగా రూ.3,500ల వరకు చెల్లిస్తున్నారు. మరోవైపు సియోల్‌లో ఒకే చోట చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్లను నిర్మించలేదు. మొత్తం ఐదుచోట్ల ఈ ప్లాంట్లు పెట్టారు. ఒక్కోటి ఐదు మెగావాట్ల చొప్పున 25మెగావాట్ల విద్యుత్తును ఈ ప్లాంట్లు ఉత్పత్తి చేస్తున్నాయి. అదే సమయంలో సియోల్ ప్లాంటులో ప్లాంటు నుంచి గాలిలోకి వదిలే వాయువులనూ శుద్ధి చేసి వదులుతున్నారు. హైదరాబాద్‌లో ఈ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. మరోవైపు ఈ మాపో ప్లాంటును 2035 వరకు కొనసాగించి ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని పార్కుగా మార్చనున్నారని అక్కడి అధికారులు తెలిపారు. మరోవైపు దీనికి పక్కనే మరో భారీ ప్లాంటును భూగర్భంలో నిర్మించడం ప్రారంభమైంది. 2026కల్లా ఈ భూగర్భ ప్లాంటు పూర్తవుతుంది. చెత్తే కాదు...చెత్తనుంచి విద్యుదుత్పత్తి ప్లాంటు కూడా భూమిపై కనిపించకుండా భూగర్భంలో నిర్మిస్తుండడం కొసమెరుపు.

హైదరాబాద్‌లోనూ నాలుగువైపులా ప్లాంట్లు: దానకిశోర్

హైదరాబాద్‌లో కూడా నగరానికి నాలుగువైపులా చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్లు పెడతామని ముఖ్య కార్యదర్శి దానకిషోర్ తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ దేశంలోనే ఒక అత్యుత్తమ చెత్త నిర్వహణ ప్లాంట్ అన్నారు. సియోల్‌లో చెత్త నుంచి విద్యుత్తు తయారుచేసే కేంద్రాలు ఐదు ఉండడం వల్ల చెత్త రవాణా ఖర్చు తగ్గుతుందన్నారు. సీఎం రేవంత్ హైదరాబాద్‌లో కూడా నాలుగువైపులా చెత్త నిర్వహణ.. విద్యుదుత్పత్తి కేంద్రాలు పెట్టేందుకు స్థలాలు చూడాలని నిర్దేశించారన్నారు. అందుకే సంగారెడ్డి జిల్లాలోని ప్యారానగర్‌లో 150ఎకరాలు, శంషాబాద్ వైపు 50ఎకరాలు, యాదాద్రి, భువనగిరి వైపు 200 ఎకరాలు గుర్తించామన్నారు. అక్కడ ప్లాంట్లు పెడతామన్నారు.

సోలో బతుకే.. సో బెటర్!

దక్షిణ కొరియాలో వివాహాలపై విముఖత.. యువకుల సగటు వివాహ వయసు 34పైనే

- అమ్మాయిల ఆలోచనలు కూడా అదే తీరులోనే
- ఇక్కడ జననాల రేటు అత్యల్పంగా 0.72శాతం
- ట్రాఫిక్ షరా మామూలే.. శుభ్రంగా రహదారులు
- స్ట్రీట్ ఫుడ్‌కు ఆదరణ.. సాయంత్రం వేళల్లో జోష్

(సియోల్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

సోల్ బతుకే సో బెటర్.. దక్షిణ కొరియాలో ప్రస్తుతం ఈ ట్రెండే నడుస్తోంది. పెళ్లి చేసుకోవడం ఆనందమేనని చాలామంది అంటున్నా... దాని జోలికి వెళ్లేందుకు మాత్రం వెనుకంజ వేస్తున్నారు. చూద్దాంలే అంటూనే 30 ఏళ్లు దాటించేస్తున్నారు. దక్షిణ కొరియన్ అబ్బాయిల సగటు వివాహ వయసు 34పైనే. కొందరు 35-40ఏళ్లు వచ్చినా పెళ్లి చేసుకోవడం లేదు. అలాగని అక్కడ అమ్మాయిలు దొరక్క కాదు. అమ్మాయిని వెదికే కష్టాలు ఇక్కడా ఉన్నా... దానికంటే పెద్ద కారణం అసలు వివాహం మీద మనసు పడకపోవడమే. అబ్బాయిలే కాదు... అమ్మాయిలదీ ఇదే పరిస్థితి. వారి సగటు వివాహ వయస్సు 31.5 ఏళ్లుగా ఉంది. ఉన్నత చదువులు, జీవితంలో స్థిరత్వంపైనే దృష్టి పెడుతూ వివాహాన్ని వాయిదా వేసుకుంటున్నారు. అంతేకాదు...చాలా మంది పెళ్లిళ్లు చేసుకోబోమని తెగేసి చెబుతున్నారు. ఒక ఇల్లు కొనడం, కుటుంబాన్ని పోషించడం, పిల్లల్ని చదివించడం వంటి బాధ్యతల్ని స్వీకరించేందుకు సిద్ధంగా లేమని అక్కడి ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 60శాతం యువకులు ప్పారు. పిల్లల్ని కనడం, ఇంటి పనులు చేయడం.. తమకు ఏ మాత్రం ఇష్టం లేదని అదే సర్వేలో అత్యధిక శాతం యువతులు అభిప్రాయపడ్డారు. దక్షిణకొరియాలో మరో సమస్య ఇల్లు లేదా ఫ్లాట్ కొనుగోలు చేయడం. రాజధాని సోల్(సియోల్)లో మధ్య తరగతి ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో ఒక డబుల్ బెడ్ రూం ఫ్లాట్ కొనాలంటే దాదాపు రూ.కోటి వెచ్చించాల్సిందే. ఇక, గంగమ్, చియాన్‌యాచిన్ వంటి ప్రాంతాలోనైతే అదనంగా మరో రూ.50 లక్షలు సమర్పించుకోవాల్సిందే. సగటు కొరియన్‌కు ఇది కష్ట సాధ్యంగా మారింది. "పెళ్లి చేసుకుంటే అపార్ట్‌మెంట్ కొనాలి. అది ఖరీదైన వ్యవహారం. పిల్లల పెంపకం అన్నీ చూసుకోవాలి. అందుకే దానిపై దృష్టిపెట్టలేదు. అలాగని పెళ్లి చేసుకోం అని కాదు. నా స్నేహితులు కొందరు చేసుకున్నారు. సంతోషంగా కూడా ఉన్నారు. కానీ నేను మాత్రం చేసుకోదలచుకోలేదు" అని 38 ఏళ్ల టీక్ కిమ్ పేర్కొన్నారు. దక్షిణ కొరియా ధనిక దేశమే కదా! ఆర్థిక కారణాలతో పెళ్లికెందుకు భయపడుతున్నారని లీ మిన్ అనే అబ్బాయిని ప్రశ్నించగా..."కొరియా ధనిక దేశమే. కానీ కొరియన్లందరూ ధనికులు కాదు"అని సమాధానమిచ్చారు. ఈ పరిస్థితితో కొరియాలో



జననాల రేటు దారుణంగా 0.72శాతానికి పడిపోయింది. ప్రపంచంలోనే అత్యంత తక్కువ జననాల రేటు ఉన్న దేశాల్లో తొలి మూడు స్థానాల్లో కొరియా ఒకటి కావడం గమనార్హం. ప్రపంచ సగటు జననాల రేటు 2.3శాతం ఉండగా...అందులో నాలుగింట ఒక వంతు కూడా ఈ దేశంలో లేకపోవడం గమనార్హం.

కిమ్‌లా కాదు... వీళ్లు స్లిమ్

పెళ్లికి దూరంగా ఉంటున్న కొరియన్లు ఫిట్‌నెస్‌లో మాత్రం బ్రహ్మాండం. వేల మందిని చూసినా.. ఎవరికీ కొంచెం పొట్ట కూడా కనిపించ లేదు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌లా కాకుండా... దక్షిణ కొరియన్లు యమ స్లిమ్. నాణ్యమైన సౌందర్య ఉత్పత్తుల తయారీలో దక్షిణ కొరియా నంబర్ వన్ స్థానంలో ఉంది. ఇక్కడి సౌందర్య ఉత్పత్తుల్ని ప్రపంచవ్యాప్తంగా కొనుగోలు చేస్తుంటారు. సియోల్‌లో రోడ్లు అత్యంత శుభ్రంగా ఉన్నాయి. నాలుగు లేన్ల రహదారి అయినా... మన సుల్తాన్‌బజార్ లాంటి చిన్న గల్లీలైనా స్వచ్ఛంగా, అందంగా ఉన్నాయి. సాయంత్రాలు వీధుల్లోకి వచ్చి స్ట్రీట్ ఫుడ్ తినడానికి కొరియన్లు బాగా ఇష్టపడతారు. కొన్నిచోట్ల హోటళ్లలో కంటే స్ట్రీట్ ఫుడ్ ఖరీదు ఎక్కువగా ఉంటుంది. ఈ వీధి దుకాణాలు కూడా చాలా శుచి, శుభ్రతతో ఉంటాయి. ఇక్కడ వెజ్‌కు, నాన్ వెజ్‌కు ధరలో వ్యత్యాసం ఉండదు. ఇంకా ఆశ్చర్యకరమైన అంశం... నాన్‌వెజ్ ఆహారం వెజ్ కంటే తక్కువ ధరకే దొరుకుతుంది. కొరియన్ కరెన్సీ వాన్‌కు మన రూపాయితో పోలిస్తే విలువ తక్కువ. మన రూపాయి 16.40వాన్‌లకు సమానం. అంటే ఎవరైనా భారత్‌లో ఒక ఐఫోన్‌ను రూ.1.5లక్షలు పెట్టి కొనుగోలు చేస్తే... ఇక్కడ అదే ఫోన్‌కు సుమారు 25లక్షల వాన్‌లు పెట్టాలన్న మాట.


సియోల్‌లో మంత్రులు పొంగులేటి, పొన్నం తదితరులు

మూసీ ప్రాజెక్టు రెండు దశల్లో!

(మొదటిపేజీ తరువాయి)

ఆలోచిస్తున్నట్లు సమాచారం. అందునా.. మొదటి దశ పనులు మొదలుపెట్టిన కొద్దిరోజులకే రెండోదశకు అవసరమైన కార్యాచరణ మొదలు పెడతారని సమాచారం. మూసీ నది గర్భంలో కొన్ని ఇళ్లే ఉండటం, బఫర్‌జోన్ పరిధికొచ్చేసరికి ఎక్కువ ఇళ్లు ఉండటమూ రెండు దశల్లో ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రధాన కారణం అన్న భావన వ్యక్తమవుతోంది. మూసీ నది గర్భంలో ప్రభుత్వం గుర్తించిన దాని ప్రకారం 1600 ఇళ్లు ఉన్నాయి. ఈ కుటుంబాల్లో చాలామందిని ఇప్పటికే ఖాళీ చేయించి అక్కడి నుంచి తరలించారు. ఫలితంగా ప్రాజెక్టు తొలి దశను త్వరితగతిన ప్రారంభించుకునేందుకు వీలు కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. బఫర్‌జోన్‌తో కలుపుకొంటే సుమారు 13వేల మంది వరకు ఇళ్లను కోల్పోతున్నారని అంచనా. ప్రస్తుతం సియోల్ పర్యటనలో ఉన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి .సోమవారం ఇక్కడి చంగ్ ఏ చంగ్ ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం మంత్రులు, ఉన్నతాధికారుల మధ్య చర్చ జరిగింది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డితో కూడా చర్చించారని సమాచారం. కాగా ఈ ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి ఏడాదిన్నర సమయం పడుతుందని... మొత్తం ప్రాజెక్టును ఆరేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో ప్రస్తుతం మూసీకి అటూ ఇటూ రిటెయినింగ్ వాల్ నిర్మించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. వాల్ మధ్యలో ఉన్న మూసీ నదిని శుద్ధి చేసి.. అటూ ఇటూ కట్టలను సుందరీకరణ చేయాలని భావిస్తోంది. ఇక బఫర్‌జోన్‌లో మూసీ నది వెంబడి 55 కిలోమీటర్ల మేర రెండు వైపులా విశాలమైన రహదారిని నిర్మిస్తారు. అటూ ఇటూ రహదారుల ప్రక్కన ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు. చంగ్ ఏ చంగ్ నదిని సందర్శించేందుకు వచ్చిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, డైరక్టర్ పి.గౌతమి, మూసీ నది అభివృద్ధి కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ తదితరులు దీనిపై చర్చించారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా ఈ అంశంపై వారితో చర్చించారు.

ఇళ్ల స్థలాలకు 600-800ల ఎకరాలు అవసరం: పొంగులేటి

మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు కింద ఇళ్లు కోల్పోయే బాధితులకు పరిహారం విషయంలో కూడా ప్రభుత్వం ఇప్పటికే ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టు కింద ఇళ్లు కోల్పోతున్నవారిలో అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇప్పటికే కొందరికి ఇళ్లు కేటాయించగా వారు అక్కడికి వెళ్లారు. ఇళ్లు కోల్పోనున్నవారు పెద్ద సంఖ్యలో ఉండటంతో బాధిత కుటుంబాలకు రింగ్‌రోడ్డుకు దగ్గర్లో 150-200 గజాల వరకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించింది. బాధిత కుటుంబాలకు ఇస్తామన్న నగదు పరిహారం ఇవ్వడం, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వడంతో పాటు, ఇంటి స్థలాలు కూడా ఇస్తామని పొంగులేటి తెలిపారు. ఈ మేరకు బాధిత కుటుంబాలకు 600-800 ఎకరాలు అవసరపడుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. లేఅవుట్ వేసి రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం కొంత తీసేయగా ఎకరానికి సుమారు మూడువేల గజాలు మిగులుతుందని అన్నారు. ఈ మేరకు 200గజాల చొప్పున ఇస్తే 15మందికి , 150గజాల చొప్పున 20 మందికి ఇవ్వొచ్చునని పేర్కొన్నారు. ఇలా మొత్తం మూసీలో ఇళ్లు కోల్పోతున్న సుమారు 13వేల కుటుంబాలకు ఇచ్చేందుకు అవసరమైన భూమిని గుర్తిస్తామని చెప్పారు హైదరాబాద్‌కు చుట్టుపక్కల చాలాచోట్ల ప్రభుత్వ భూములు ఉన్నాయని, ఇందులో ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నవీ ఉన్నాయని ఆ భూములనే బాధితుల ఇళ్ల స్థలాలకు వినియోగిస్తామని చెప్పారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సుముఖంగా ఉన్నారని తెలిపారు. బాధితులకు న్యాయం చేసే విషయంలో ఉదారంగానే వ్యవహరిద్దామని అంతర్గత భేటీలో సీఎం చెప్పారని వెల్లడించారు. రింగ్‌రోడ్డుకు దగ్గరిలోనే ఉండడం వల్ల, అది కూడా అభివృద్ధి చేసిన లే అవుట్‌లో ఇవ్వడం వల్ల గజం రూ.40-50వేల వరకు విలువ ఉంటుందని చెప్పారు.

గాంధీలో నీళ్లు లేక శస్త్రచికిత్సలు వాయిదా!

- నీటి సరఫరాలో అంతరాయం
- బాత్‌రూంలకు తాళాలు వేసిన సిబ్బంది
- కాలకృత్యాలకు రోగుల అవస్థలు

అడ్డగుట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో రెండు రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో శస్త్ర చికిత్సలు వాయిదా పడ్డాయి. నీటి సరఫరా కొనసాగేవరకూ ఆపరేషన్లు జరగవని వైద్యులు స్పష్టం చేశారని రోగులు వాపోతున్నారు. నీళ్లు లేక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాగేందుకు కూడా నీళ్లు లేక బయట నుంచి తెచ్చుకుంటున్నారు. శనివారం రాత్రి నుంచి నీటి సరఫరా లేదని రోగులు తెలిపారు. చిన్నపిల్లల వార్డుల్లో నాలుగు రోజుల నుంచి నీళ్లు రావడంలేదని చికిత్స పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాత్‌రూంలకు తాళాలు

రెండు రోజులుగా ఆస్పత్రిలో నీళ్లు రాకపోవడంతో సిబ్బంది బాత్‌రూంలకు తాళాలు వేశారు. రోగులు, వారి సహాయకులు అపరిశుభ్రం చేస్తారనే నెపంతో మొదటి అంతస్తు నుంచి 7వ అంతస్తు వరకు బాత్‌రూంలకు తాళాలు వేశారు.

తాగునీరు లేక రోగుల ఇక్కట్లు

రేడియాలజీ విభాగం పక్కనే ఉన్న మంచినీటి కుళాయిలో నీళ్లు రాకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి బయట ఉన్న దుకాణాల్లో మంచినీటి బాటిళ్లను కొనుగోలు చేయాల్సి రావడంతో రోగులు, వారి సహాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే మినరల్ వాటర్ బాటిళ్లను డైట్ క్యాంటీన్‌కు మళ్లిస్తున్నారని తెలిసి రోగుల సహాయకులు నిరసన వ్యక్తం చేశారు. డైట్ క్యాంటీన్‌కు మంచినీటి బాటిళ్లు సరఫరా చేసినట్లే ప్రతి వార్డుకూ వాటర్ బాటిళ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల నుంచి నీటి సరఫరా లేదనేది వాస్తవమేనని మోటార్ పంప్ మరమ్మతుల వల్ల ఇబ్బంది ఏర్పడిందని హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మరమ్మతులు పూర్తికాగానే నీటి సరఫరా చేస్తామన్నారు.


బాత్‌రూంకు తాళం వేసి ఉన్న దృశ్యం

ఆందోళన వద్దు.. ఏకాగ్రతతో పరీక్షలు రాయండి: సీఎం

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం నుంచి ప్రారంభమైన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఎటువంటి ఆందోళన చెందకుండా.. ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని సూచించారు. ఈ పరీక్షల్లో విజయం సాధించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

చోరీ నెపంతో పోలీసు స్టేషన్‌కు పిలిపించారని.. మనస్తాపంతో బాలిక ఆత్మహత్యాయత్నం

- చావు బతుకుల్లో ఆస్పత్రిలో చికిత్స.. గద్వాలలో ఘటన

గద్వాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పనిచేసే బాలికపై దొంగతనం నెపం మోపి పోలీస్ స్టేషన్‌కు పిలిపించడంతో ఆమె తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలికను ఓ విత్తనాల వ్యాపారి కొన్ని నెలల కింద తన ఇంట్లో పనిమనిషిగా నియమించుకున్నాడు. 2 నెలల క్రితం ఇంట్లో బంగారం కనిపించడం లేదని అతడు ఆమెపై అనుమానం వ్యక్తం చేశాడు. ఆ తర్వాత బంగారం దొరికిందని చెప్పి ఆ బాలికను ఆమె అమ్మమ్మ ఇంటికి పంపించాడు. ఆ తర్వాత ఏమైందో కానీ కొద్దిరోజుల క్రితం మళ్లీ బంగారం కనిపించడం లేదంటూ మల్దకల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు బాలికను పిలిపించి విచారించగా.. చేయని దొంగతనాన్ని తనపై మోపడంపై అవమానంగా భావించి ఆ మరుసటి రోజే పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబీకులు గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అయితే తన ఇంట్లో దొంగతనం జరిగితే గద్వాల పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మల్దకల్ పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేశారు. తమ పరిధి కాకపోయినా బాలికను మల్దకల్ పోలీస్ స్టేషన్‌కు పిలిచి ఎందుకు విచారణ చేశారనే విషయంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితురాలి కుటుంబీకులు మాట్లాడుతూ.. చావుబతుకుల మధ్య తమ కూతురు ఉంటే ఓ కానిస్టేబుల్ ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకోవడానికి డబ్బులెలా వచ్చాయని ప్రశ్నించారని.. చోరీ చేసినందునే ఆస్పత్రిలో ఖర్చు చేస్తున్నారని ఆరోపించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై బీఆర్ఎస్ నేత కురువ విజయ్ కుమార్ స్పందిస్తూ.. బాలికను పనిలోపెట్టుకోవడమే కాకుండా.. ఆమెపై నేరం మోపి వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాపై కేసులు కొట్టేయండి

- ఏపీ హైకోర్టును ఆశ్రయించిన అల్లు అర్జున్, రవిచంద్ర

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా అధికారులు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించామంటూ ఈ ఏడాది మే 11న నంద్యాల టూటౌన్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ సినీనటుడు అల్లు అర్జున్, వైసీపీ మాజీ ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు సమయం ముగియడంతో ఈ వ్యాజ్యంపై సోమవారం విచారణ సాధ్యపడలేదు. పిటిషన్ బుధవారం విచారణకు రానుంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఈ ఏడాది మే11న అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్‌రెడ్డి ఇంటికి అల్లు అర్జున్ వచ్చారు. ఈ విషయం తెలుసుకొని అభిమానులు, ప్రజలు కిషోర్‌రెడ్డి ఇంటికి భారీగా చేరుకున్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున అంతమంది ఒకే చోటకు చేరడం ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘించినందుకు అల్లు అర్జున్, కిషోర్‌రెడ్డిలపై కేసు నమోదైంది.

విద్యార్థినులతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- విచారణ చేపట్టిన పోలీసులు.. పోక్సో కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులపై ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నరేందర్... దసరా సెలవులకు ముందు అతడు తరగతి గదిలో విద్యార్థినుల మధ్య కూర్చుని అసభ్యంగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయుడి బ్యాడ్ టచ్‌తో ఇబ్బంది పడిన ఓ విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి ఫిర్యాదు చేసింది. ఆమె ఆ విద్యార్థినికి నచ్చజెప్పి పంపించింది. ఉపాధ్యాయుడిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. జిల్లా షీ టీం కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించగా.. విద్యార్థినులు ఈ విషయాన్ని తెలియజేశారు. షీ టీం ద్వారా సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాధారాణి ఫిర్యాదుతో ఉపాధ్యాయుడు నరేందర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పోలీసులు పాఠశాలకు రావడం చూసిన ఉపాధ్యాయుడు నరేందర్ అక్కడి నుంచి పరారయ్యాడు.

బాచుపల్లిలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కోహీర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని ఓ ప్రముఖ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన సిరిపురం లక్ష్మయ్య-అన్నమ్మ దంపతుల రెండో కూతురు అనూష(15) బాచుపల్లిలోని కార్పొరేట్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఆమె సెలవులు పూర్తయ్యాక కళాశాలకు వెళ్లేందుకు నిరాకరించింది. తల్లిదండ్రులు నచ్చచెప్పి ఆదివారం మధ్యాహ్నం ఆమెను కళాశాలకు తీసుకెళ్లారు. కొంతసేపు దగ్గరే ఉండి సర్దిచెప్పి లక్ష్మయ్య- అన్నమ్మలు తిరుగు ప్రయాణమయ్యారు. వారు హైదరాబాద్ కూడా దాటక ముందే అనూష స్పృహ తప్పి పడిపోయిందంటూ కళాశాల సిబ్బంది సమాచారమిచ్చారు. దాంతో తల్లిదండ్రులు వెంటనే కళాశాలకు వెళ్లగా అనూష ఉరి వేసుకుని చనిపోయిందని చెప్పారు. తల్లిదండ్రులు కళాశాలకు చేరుకోకముందే కళాశాల సిబ్బంది, పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఆలయ ప్రతిష్ఠకు భంగం కలగనివ్వం

- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రీల్స్‌పై గుట్ట ఆలయ ఈవో స్పందన

భువనగిరి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ఆలయంలో స్వామి వారి ప్రతిష్ఠకు భంగం కలిగించే, భక్తుల విశ్వాసాలు, మనోభావాలకు ఆటంకం కలిగించే ఏ చర్యనైనా అనుమతించబోమని ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఇటీవల లక్ష్మీనరసింహస్వామిని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్న సందర్భంలో ఆయన కుమార్తె రీల్స్ చిత్రీకరించి ఎక్స్(ట్విటర్)లో పోస్టు చేయటంపై ఈవో స్పందించారు. క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తులు ఆలయం వెలుపల ఫొటోలు తీసుకోవడానికి అనుమతి ఉందని, ఇక ముందు వీడియోలు, ఫోటోలు తీసుకోవడంపై దృష్టి సారిస్తామని తెలిపారు.

సెలవు విధానం మార్చాలి.. పని భారం తగ్గించాలి

- 12వ బెటాలియన్ పోలీస్ కుటుంబసభ్యుల రాస్తారోకో

నల్లగొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సెలవుల విధానం మార్చాలని.. పని భారం తగ్గించాలని నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని అన్నెపర్తి 12వ బెటాలియన్ పోలీస్ కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. టీజీఎస్పీ లీవ్ మాన్యువల్‌కు వ్యతిరేకంగా సోమవారం నార్కట్‌పల్లి - అద్దంకి రహదారిపై పోలీసు కుటుంబాలకు చెందిన మహిళలు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమిళనాడు, కర్ణాటక తరహా వ్యవస్థను రాష్ట్రంలోనూ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా అమలులోకి వచ్చే రికార్డు పద్ధతిని ఉపసంహరించుకోవాలని, పని భారాన్ని 8 గంటలకు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. బెటాలియన్ వ్యవస్థలోనూ ఐదేళ్ల వరకు ఒకే ప్రాంతంలో పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. ఉద్యోగుల కుటుంబసభ్యులు ఆందోళనకు దిగడంతో ట్రాఫిక్ నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో బెటాలియన్ కమాండెంట్ సత్యశ్రీనివాస్ వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

జగన్ మీడియాపై కేంద్రానికి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఫిర్యాదు

- 'సాక్షి' చానల్‌కు కేంద్ర హోం శాఖ నుంచి సెక్యూరిటీ క్లియరెన్స్ లేదన్న విషయమూ ఫిర్యాదులో ప్రస్తావన
- శాటిలైట్ ఫ్రీక్వెన్సీ హ్యాకింగ్‌పైనా విజయవాడలో కేసు

అమరావతి, హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ మీడియా.. సైబర్ ఫ్రాడ్, వెబ్‌సైట్ హ్యాకింగ్ వంటి అనైతిక చర్యలకు పాల్పడుతున్న వైనంపై 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' కేంద్ర సమాచార, ప్రసార శాఖకు ఫిర్యాదు చేసింది. తెలుగు రాష్ట్రాల్లో విశేష ఆదరణ, సాక్షి కంటే మెరుగైన ర్యాంకింగ్ ఉన్న 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' వెబ్‌సైట్‌కు వచ్చే ట్రాఫిక్‌ను సైబర్ నేరగాళ్లు ట్యాగ్స్ ద్వారా మళ్లిస్తున్నారని.. వారికి 'సాక్షి'తో సంబంధాలు ఉన్నాయని బలంగా అనుమానిస్తున్నట్టు వెల్లడించింది. జగన్ రోత మీడియా చేస్తున్న ఈ చర్యల వల్ల వాటిల్లుతున్న ఆర్థిక నష్టం గురించి, సంస్థ ప్రతిష్ఠ తీవ్రంగా దెబ్బతింటున్న వైనం గురించి ఈ లేఖలో పేర్కొంది. బాధ్యులైనవారిపై వెంటనే కఠినచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. 'న్యూస్ బ్రాడ్‌క్యాస్టింగ్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎన్‌బీఎస్‌ఏ)' రూపొందించిన నైతిక నియమావళిని సాక్షి టీవీ గతంలో పలు సందర్భాల్లో ఉల్లంఘించిన విషయాన్ని కూడా 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' తన లేఖలో గుర్తుచేసింది. 2022 జనవరి 20న.. కేంద్ర హోం శాఖ నిఘా వర్గాల నివేదికలను ఉటంకిస్తూ సాక్షి చానల్‌కు సెక్యూరిటీ క్లియరెన్స్ ఇవ్వడానికి నిరాకరించిన విషయాన్ని, ప్రస్తుతం ఆ చానల్ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాత్కాలిక నిలుపుదల ఉత్తర్వులపై నడుస్తున్న విషయాన్ని సమాచార శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చింది. మరోవైపు.. జగన్ మీడియాపై విజయవాడలో సైబర్ కేసు నమోదైంది. గడిచిన రెండు నెలలుగా ఇంటర్‌నెట్‌లో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' వెబ్‌సైట్ చూడాలనుకుంటే.. సాక్షి వెబ్‌సైట్ వచ్చేలా ఫ్రాడ్ జరిగిందని, దీనివల్ల నెలకు రూ.50 లక్షల నష్టం వాటిల్లుతోందని, అలాగే ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఓబీ వ్యాన్ (డీఎస్ఎన్‌జీ) శాటిలైట్ ఫ్రీక్వెన్సీని కూడా ఇటీవల హ్యాక్ చేశారని.. దీనిపై ఇస్రోకు కూడా ఫిర్యాదు చేశామని, దీని వెనుక కూడా సాక్షి హస్తం ఉందని అనుమానిస్తూ విజయవాడలో సంస్థ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు.. బీఎన్ఎస్ యాక్ట్‌లోని 318 (4), 319 (2) సెక్షన్లతో పాటు, ఐటీచట్టంలోని 66, 66సీ, 66డీ సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్

మొదటి రోజు ఇంగ్లిష్ క్వాలిఫై పరీక్ష.. హాజరైన 72.4% మంది అభ్యర్థులు



బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ కేంద్రానికి ఆలస్యంగా వచ్చి విలపిస్తున్న మహిళా అభ్యర్థికి నీరు తాగిస్తున్న కానిస్టేబుల్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూపు-1 మెయిన్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. తొలి రోజు (సోమవారం) ఇంగ్లిష్ క్వాలిఫై పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మంగళవారం నుంచి సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల కోసం హెచ్‌ఎండీఏ పరిధిలో మొత్తం 46 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీటిని నిర్వహిస్తున్నారు. పరీక్ష మొదలు కావడానికి 30 నిమిషాల ముందు వరకూ వచ్చిన అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఆ తర్వాత వచ్చినవారిని అనుమతించలేదు. 27వ తేదీ వరకూ జరగనున్న మెయిన్స్‌కు.. 31,383 మంది అభ్యర్థులు అర్హులైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత హైకోర్టు ఆదేశాల మేరకు క్రీడల కోటాలో మరో 20 మందిని ఎంపిక చేశారు. వీరిని కూడా పరీక్షలకు అనుమతించారు. కానీ, తొలిరోజు 22,750 మంది మాత్రమే (72.4 శాతం) పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ ఇటీవల పలువురు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఆందోళనకు దిగిన నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు విభాగం అధికారులు ప్రణాళికా బద్ధంగా ముందుకుసాగారు. ఉదయం 7 గంటల నుంచే కేంద్రాల వద్ద పోలీసులు భారీగా మోహరించి నిర్వహణను పర్యవేక్షించారు. పరీక్ష వాయిదా, జీవో 29 రద్దు కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై తీర్పు కోసం పలువురు అభ్యర్థులు మధ్యాహ్నం 12గంటల వరకు వేచిచూసినా నిరాశే ఎదురైంది. వాయిదాకు సుప్రీంకోర్టు తిరస్కరించడంతో వారంతా ఉరుకులు, పరుగులతో కేంద్రాలకు చేరుకున్నారు. అయితే 1..30గంటలకు గేట్లను మూసివేయడంతో పలువురు నిరాశగా వెనుదిరిగారు. కోఠి మహిళా యూనివర్సిటీలోని పరీక్షా కేంద్రం గేటు మూసిన తర్వాత వచ్చిన ఉమాశ్రీలేఖ అనే అభ్యర్థిని లోపలికి అనుమతించకపోవడంతో భోరున విలపించింది. ట్రాఫిక్ రద్దీ వల్ల ఆలస్యం అయిందని.. పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఎంతగా ప్రాధేయపడినా పోలీసులు ఆమెను లోపలికి పంపలేదు. దీంతో ఆమె అరగంటపాటు అక్కడే కూర్చుని విలపించింది. మరోవైపు.. సికింద్రాబాద్ సర్దార్‌పటేల్ రోడ్డులోని ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కళాశాలలో పరీక్ష రాయాల్సిన మాథ్యూస్ అనే అభ్యర్థి (ఓల్డ్‌బోయిన్‌పల్లి) 1.32 నిమిషాలకు సెంటర్ వద్దకు చేరుకున్నారు. పోలీసులు అప్పటికే గేట్లు మూసేసి, లోపలికి అనుమతించక పోవడంతో మాథ్యూస్ కాలేజీ గోడ దూకి కేంద్రంలోకి ప్రవేశించాలని ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని.. సాయంత్రం 5గంటల తర్వాత వదిలిపెట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకోకుండా పోలీసులు 163 సెక్షన్ అమలు చేశారు. కేంద్రాల్లోకి అభ్యర్థులు వెళ్లకుండా రాజకీయ పార్టీల నాయకులు అడ్డుకుంటారనే అనుమానంతో గట్టి బందోబస్తు నిర్వహించారు. కాగా.. హైదరాబాద్‌లోని కోఠి మహిళా విశ్వవిద్యాలయం వద్ద హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మేడ్చల్ జిల్లాలోని పలు సెంటర్లను అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి పర్యవేక్షించారు. అలాగే రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ, బాస్కర్‌నగర్‌లోని జోగిన్‌పల్లి బీఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్లను కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. అభ్యర్థులకు పలుచోట్ల పోలీసులు, అధికారులు 'ఆల్ ది బెస్ట్' ప్లకార్డులతో స్వాగతం పలికారు.

కేటీఆర్ ఇంటి వద్ద పోలీస్ బందోబస్తు

బీఆర్ఎస్ నేత కేటీఆర్.. అశోక్ నగర్‌కు వెళ్లి ఆందోళన చేసే అవకాశాలు ఉన్నాయంటూ నిఘా వర్గాల సమాచారం ఉండడంతో ఆయన నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తాను అశోక్‌నగర్ వెళ్లబోనని కేటీఆర్ పలుమార్లు పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ సాయంత్రం వరకు బందోబస్తును కొనసాగించారు.

హాజరు శాతం ఇలా..

జిల్లా	అభ్యర్థులు	హాజరైనవారు	శాతం	సెంటర్లు
హైదరాబాద్	5,613	4,896	87.23	08
మేడ్చల్	17,779	12,000	67.49	27
రంగారెడ్డి	8,011	5,854	73.07	11

ఇంజనీరింగ్ కాలేజీలు సొంతంగా సీట్లు భర్తీ చేసుకోవచ్చు!

- ప్రభుత్వంతో సంబంధం లేకుండా భర్తీ చేసుకునేందుకు హైకోర్టు అనుమతి
- మాప్‌అప్ కౌన్సెలింగ్ నిర్వహించనందుకు అధికారులపై న్యాయస్థానం ఆగ్రహం
- సుప్రీంలో సవాల్ చేయనున్న సర్కార్

హైదరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలలు ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఏఐసీటీఈ అనుమతించిన మేరకు కొత్త కోర్సులు, పెంచిన సీట్లు భర్తీ చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతినిచ్చింది. ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో పెంచిన సీట్లకు, కోర్సులకు మాప్‌అప్ రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని సెప్టెంబర్ 9న హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. వాటి ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించనందుకు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఉత్తర్వులను అమలు చేసే ఉద్దేశం లేదని చాలా స్పష్టంగా అర్థమవుతోందని వ్యాఖ్యానించింది. "కోర్టు ధిక్కరణ చర్యల కింద శిక్ష విధిస్తే దానిపై సుప్రీంకు వెళ్లడం ద్వారా కాలయాపన చేద్దామని అనుకుంటున్నారు. టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియకు అక్టోబర్ 23వ తేదీ దాటిపోతే గడువు తీరిపోతుంది కాబట్టి చేతులెత్తేద్దామనుకుంటున్నారు" అని పేర్కొంది. కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలు దాఖలు చేసిన కాలేజీలకు సీట్లు భర్తీ చేసుకునేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ఈ తీర్పును సుప్రీంలో సవాల్ చేయాలని సర్కారు నిర్ణయించింది. సీట్ల పెంపుకు ఏఐసీటీఈ అనుమతినిచ్చినా, జేఎన్టీయూ అనుమతిలేనిదే కోర్సులకు గుర్తింపు ఉండదు. ఇప్పటికే కౌన్సెలింగ్ పూర్తయిన వాటిలో మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహిస్తే గతంలో వేరే కోర్సుల్లో చేరిన వారు, దూరం కాలేజీలో చేరినవారు మళ్లీ హాజరయ్యేందుకు ప్రయత్నిస్తారు. కాలేజీలు భర్తీ చేసుకున్నా ప్రభుత్వ అనుమతి లేనందున విద్యార్థులకు సర్టిఫికేట్స్ వచ్చే అవకాశం లేదు. ఇంకోవైపు, సింగిల్ జడ్జి బెంచ్ నుంచి వెలువడే పూర్తిస్థాయి ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాలని డివిజన్ పేర్కొంది. ఒకవేళ ఆ తీర్పుకు దీనికి వ్యతిరేకంగా వస్తే విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోతారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న హరగోపాల్

ఉద్యమాలకు నడకనేర్పిన మన కాలపు భగత్‌సింగ్ సాయిబాబా

- సంస్మరణ సభలో ప్రొఫెసర్ హరగోపాల్
- సాయిబాబాది ముమ్మాటికి రాజ్యం హత్యేనని ఆరోపించిన వక్తలు
- ఉపా చట్టాన్ని రద్దుచేయాలని ముకుమ్మడిగా డిమాండ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలని బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొ. సాయిబాబా సంస్మరణ సభలో వక్తలు డిమాండ్ చేశారు. అన్యాయంగా పదేళ్ల అత్యంత కఠినమైన అండా సెల్‌లో నిర్బంధించడం వల్లే ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిందని, అదే సాయిబాబ మరణానికి కారణం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా)ను రద్దు చేయాల్సిందిగా కార్యక్రమంలో పాల్గొన్నవారంతా నినదించారు. ప్రజాసంఘాలు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, విప్లవ ప్రజా సంఘాల ప్రతినిధులు, ఉద్యమ సహచరులు, మేధావులు పాల్గొని సాయిబాబాకు నివాళులు అర్పించారు. ప్రముఖ రచయిత్రి మీనా కందస్వామి మాట్లాడుతూ సాయిబాబాది ముమ్మాటికీ రాజ్యం హత్యే అని, అందులో మొదటి దోషి ఉపా చట్టాన్ని తీసుకొచ్చిన కాంగ్రెస్ నేత పి. చిదంబరం అయితే, దాన్ని ప్రశ్నించే గళాలను అణచివేసేందుకు దుర్వినియోగం చేస్తోన్న కేంద్ర ప్రభుత్వం మరొక దోషి అని విమర్శించారు. ప్రముఖ మానవహక్కుల ఉద్యమనేత ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ... తాను నడవలేకపోయినా ప్రజా ఉద్యమాలకు నడక నేర్పిన మన కాలపు భగత్‌సింగ్ జీఎన్ సాయిబాబా అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉపా చట్టం పేరుతో అకారణంగా సాయిబాబాను పదేళ్లు నిర్బంధించి తర్వాత నిర్దోషి అని విడుదల చేసి చేతులు దులుపుకోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. సీపీఐ(ఎం) తెలంగాణ ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు రాజీలేని పోరాటం సాగించిన సాయిబాబ నిబద్ధత, అంకితభావం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ సాయిబాబాను ప్రజాస్వామిక శక్తుల ప్రతీకగా అభివర్ణించారు.

గ్రూప్-1 వాయిదాకు సుప్రీం నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)



వెల్లడించిన విషయాన్ని సుప్రీం ధర్మాసనం గుర్తుచేసింది. తెలంగాణలో గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని, జీవో 29ని రద్దు చేయాలని కోరుతూ పోగుల రాంబాబు అనే అభ్యర్థి గత శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పరీక్షల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించట్లేదని, ప్రభుత్వం తెచ్చిన జీవో వల్ల తాము నష్టపోతున్నామని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో పాటు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఇందులో ప్రతివాదులుగా చేర్చారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్‌ను విచారించింది. ఇప్పటికే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారని, ఇలాంటి సమయంలో స్టే ఎలా ఇస్తామని ప్రశ్నించింది. ఇప్పుడు స్టే ఇవ్వడం అభ్యర్థులను గందరగోళానికి గురిచేస్తుందని వ్యాఖ్యానించింది. కాగా.. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్.. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పునకు పూర్తి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 29ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. "పద్నాలుగేళ్ల తర్వాత.. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారిగా.. రాష్ట్రంలో గ్రూప్-1 పరీక్ష జరుగుతోంది. అభ్యర్థులు సుదీర్ఘకాలంగా ఈ ఉద్యోగంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే.. ఇప్పట్లో మళ్లీ గ్రూప్-1 భర్తీ జరగదు. అభ్యర్థులు ఈ సువర్ణావకాశాన్ని కోల్పోతే వారికి తీరని నష్టం జరిగినట్టే. కాబట్టి జీవో 29పై స్పష్టత వచ్చే వరకూ పరీక్షలు నిర్వహించొద్దు. వాయిదా వేయాలి" అని ధర్మాసనాన్ని కోరారు. దీనికి సీజేఐ.. "స్వయంప్రతిపత్తి కలిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పరీక్షలు వాయిదా వేయాలని ఎలా ఆదేశించగలం?" అని ప్రశ్నించారు. ఇది అసాధారణమైన విషయమని వ్యాఖ్యానించారు. సిబల్ మాత్రం.. ఇది వేలాది మంది జీవితాలకు సంబంధించిన విషయమంటూ పరీక్ష వాయిదాకు పట్టుబట్టారు. ఎస్సీ, ఎస్టీ వర్సెస్ భూపేంద్ర యాదవ్ కేసులోని తీర్పు వివరాలను ధర్మాసనానికి అందించారు. అయినప్పటికీ.. ధర్మాసనం ఆయన వాదనలతో ఏకీభవించలేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఎలా ఆపగలమని మరోసారి ప్రశ్నించింది.

పిటిషన్ తిరస్కరణ..

తెలంగాణ గ్రూప్-1 పరీక్షకు సంబంధించి హైకోర్టులో విచారణ జరుగుతోందని ప్రభుత్వం తరఫు సీనియర్ అడ్వొకేట్ నిరంజన్ రెడ్డి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గత నెల 31న ఈ కేసు హైకోర్టు ముందు విచారణకు వచ్చిందని.. టీజీపీఎస్సీ ఇప్పటికే ఈ కేసులో హైకోర్టు ముందు కౌంటర్ ఫైల్ చేసిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వాదలను కౌంటర్ రూపంలో అందజేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. గ్రూప్-1 నియామక ప్రక్రియ పూర్తికి ఎంత సమయం పడుతుందని హైకోర్టు ప్రశ్నించగా.. పరీక్షలు నిర్వహించి, ఫలితాలు ప్రకటించేందుకు మరో మూడు నెలలు పడుతుందని టీజీపీఎస్సీ తెలిపిందని వెల్లడించారు. ఆ సమయంలో సిబల్ కలుగజేసుకుని.. మూడు నెలల సమయం పడుతుంది కాబట్టి వెంటనే విచారణ చేపట్టాలని కోరగా, అందుకు ధర్మాసనం నిరాకరించింది. ఇప్పుడు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని పునరుద్ఘాటించింది. హైకోర్టులో తదుపరి విచారణ నవంబర్ 20న ఉన్నందున, ఫలితాల కంటే ముందే విచారణను ముగించాలని హైకోర్టును ఆదేశించి.. ఈ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్టు పేర్కొంది.

ఏపీ మాజీ మంత్రి పినిపే తనయుడి అరెస్టు

- వలంటీర్ హత్య కేసులో సూత్రధారి
- మధురై వద్ద సినీ ఫక్కీలో కారును చేజ్ చేసి పట్టుకున్న ఏపీ పోలీసులు

అమలాపురం/రామచంద్రపురం/చెన్నై, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రెండున్నరేళ్ల కిందట అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన దళిత వలంటీర్ దారుణ హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన సూత్రధారి ఏపీ మాజీ మంత్రి, వైసీపీ నేత పినిపే విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్‌ను సోమవారం తమిళనాడులోని మధురై సమీపంలో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హత్య కేసు విచారణ వేగవంతమైంది. దీంతో శ్రీకాంత్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో శ్రీకాంత్ తమిళనాడులోని తూత్తుకుడిలో ఉన్నట్టు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ నేతృత్వంలోని బృందం అక్కడే మకాం వేసి నిందితుడి కదలికలను నిశితంగా గమనించింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తూత్తుకుడి నుంచి మధురైకు కారులో బయలుదేరిన శ్రీకాంత్‌ను సినీ ఫక్కీలో చేజ్ చేసి.. పట్టుకున్నారు.

రాజకీయ ప్రోద్బలంతో..

కోనసీమ జిల్లాలోని అయినవిల్లిలో వలంటీర్‌గా పనిచేస్తున్న దళిత యువకుడు జనుపల్లి దుర్గాప్రసాద్(27) జూన్ 6, 2022న హత్యకు గురయ్యారు. ఆ తర్వాత మృతదేహం కోటిపల్లి రేవులో ఇసుక దిబ్బలపై దొరికింది. వలంటీర్ దుర్గాప్రసాద్ హత్య కేసుపై విచారణ జరపాలని ప్రజాసంఘాలు అప్పట్లో ఆందోళన చేసినా రాజకీయ ప్రోద్బలంతో కేసును అప్పటి పోలీసులు పక్కన పెట్టేశారు. రాష్ట్రంలో కూటమి సర్కారు వచ్చాక దుర్గాప్రసాద్ భార్య ఆదర్శ, తన భర్త హత్య కేసును పునర్విచారించాలని మంత్రి వాసంశెట్టి సుభాశ్‌ను వేడుకున్నారు. దీంతో ఆయన పోలీసు ఉన్నతాధికారులకు విషయాన్ని చెప్పడంతో హత్య కేసు విచారణ పుంజుకుంది.

శ్రీకాంత్‌దే పక్కా ప్లాన్

దుర్గాప్రసాద్ హత్యకు పినిపే తనయుడు శ్రీకాంతే పక్కాప్లాన్ చేసినట్టు ఈ కేసులో మరో కీలక నిందితుడు పోలీసులకు తెలిపారు. కేసు విచారణలో భాగంగా ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి గ్రామానికి చెందిన వడ్డి ధర్మేశ్‌ను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. ధర్మేశ్ నుంచి లిఖిత పూర్వక వాంగ్మూలం తీసుకున్నారు. మహిళా సంబంధాల వ్యవహారంలోనే ఈ హత్యకు కుట్ర చేసినట్టు ధర్మేశ్ స్పష్టం చేశారు. "జూన్ 5, 2022న అనాతవరం దగ్గరున్న గ్రాండ్ పార్క్ వద్ద పినిపే శ్రీకాంత్‌తోపాటు మరికొందరు మద్యం సేవించారు. ఆ సమయంలో నేను కూడా ఉన్నా. మద్యం తాగుతున్న సమయంలో దుర్గాప్రసాద్ ప్రస్తావన వచ్చింది. అయన హత్యకు శ్రీకాంత్ పక్కా ప్లాన్ చేశారు. 2022 జూన్ 6వ తేదీ సాయంత్రం ముక్తేశ్వరం సెంటర్‌కు నలుగురు వ్యక్తులు కారు వేసుకుని వస్తారని, వారికి దుర్గాప్రసాద్ ఉన్న ప్రదేశాన్ని చూపించాలని శ్రీకాంత్ నన్ను ఆదేశించారు. దీంతో నేను దుర్గాప్రసాద్‌కు ఫోన్ చేసి ఎక్కడున్నావని అడిగా. కోటిపల్లి రేవు వద్ద ఉన్న తోటలలో ఉన్నట్టు దుర్గాప్రసాద్ చెప్పడంతో కారులో వచ్చిన వ్యక్తులతో నేనూ వెళ్లి దుర్గాప్రసాద్‌ను చూపించా. ఆ తర్వాత వారు దుర్గాప్రసాద్‌ను కోటిపల్లి వైపునకు తీసుకెళ్లి అతనిపై దాడి చేశారు. మెడకు తాడు బిగించి ఊపిరి ఆడకుండా చంపేశారు. తర్వాత దుర్గాప్రసాద్ మృతదేహాన్ని అక్కడే పడేశారు" అని ధర్మేశ్ తన వాంగ్మూలంలో పేర్కొన్నారు.



ఏపీ మాజీ సీఎం జగన్‌తో వైసీపీ నేత పినిపే శ్రీకాంత్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.